ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

11-2-'53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEK


పంచతంత్రం
మిత్రలాభం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
ఒకానొకప్పుడు సాగరుడనియెడి వర్తక శ్రేష్ఠుడు వుండేవాడు
ఆతని కొడుకొక దినమున ఒకచోట పాత పుస్తకముల మ్మే అంగడి కేగి, గ్రంథములు తిరగేస్తుండగ వాటిలోని ఒక వృద్ధగ్రంథములో
కనబడెనాతనికీవాక్యం
ఎవరికేది ప్రాప్తముందో అదే లభ్యమౌను గాదె
వర్తకపుత్రునికి సూక్తి ఎందులకో మరి నచ్చినది. వెంటనే ముందూ వెనకా చూడక - అంగడి వానికి నూరు వరాలను - ఇచ్చి పుస్తకము కొన్నాడు
(ఇంటికి రాగానే).
"ఏమా పుస్తకమెంతకు కొంటివి?"
"నూరు వరాలకు కొంటిని నాన్నా,- చూశావా, ఆ ఒక్క వాక్యమున - కివ్వచ్చును యున్నూరు వరాలు!"
"నూరు వరాలా! ఓరి దరిద్రుడ!! ఎవడో భ్రష్టుడు ఏదో రాస్తే, నూరు వరాలకు బూజుపుస్తకము కొని తెచ్చావా, వాణిజ్యమ్మే డబ్బుంటే నీకంత చులకనా? పో పో ఇపుడే నా ఇంట్లోంచి"
"ఎవరికేది ప్రాప్తముందో అదే లభ్యమౌను గాదె!" అనుకొంటూ ఆ వర్తకపుత్రుడు ఇంటినుండి వెళ్ళిపోయాడు
పిచ్చివాని వలె అదే సూక్తినే - మననం చేస్తూ, తిరిగి తిరిగి ఒక - దూరపు నగరం చేరాడు
ఒక మనిషి:
"ఏవూరయ్యా? పేరేమయ్యా?"
"ఎవరికేది ప్రాప్తముందో అదే లభ్యమౌనుగాదె!"
"పాపం, ఎవడో పిచ్చివాడురా" అని తన వారిని పోయారు
ఎవ్వరడిగినా వర్తకపుత్రుడు ఇదే జవాబు యిస్తున్నాడు
ఇట్లా వుండగ, ఆ నగరంలో 'శశికళ' అనియెడి రాజకుమారి - వేరొక రాజకుమారుని వలచెను - విరహ వేదనకు తాళలేక ఒక - దాసిని పిలిచి యిట్లంది:
"ఆ నవమన్మథు నెట్లయినా ఒక్క-పర్యాయం మన సౌధం లోనికి - తీసుకు రావే; తాళజాలనే!"
దూతిక అప్పుడు రాజకుమారుని-వద్దకు వెళ్ళి, ముద్దు ముద్దుగా - తన సఖి విరహము తెలిపినది
"కోటలోని తోటలోకి - నేటి రేయి రావోయీ! - నీటుకాడ, నీకోసం - నిచ్చెన ఒకటుంచుతాను - నిబ్బరముగ రావోయీ!"
కానీ, రాత్రికి రాజకుమారుడు రాక పూర్వమే అక్కడకొచ్చిన వర్తకపుత్రుడు నిచ్చెన చూచి
ముందూ వెనకా చూడక ఎక్కి మేడ మీది గదిలోనికి పోయెను వచ్చినవాని ప్రియుడే ననుకొని శశికళ ముదమున కూడియాడినది
11

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 24
11-2-53

నందన మాఘ బహుళ ద్వాదశి బుధవారము



సూర్యనమస్కారం

ఫొటో : శ్రీ పి. వీరయ్య, సికిందరాబాద్.

విషయానుక్రమణిక

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన పెద్దకవర్లనుగాని చేర్చి పంపవలసిందని మనవి. స్టాంపులను పంపేవారికి మాత్రమే వారి రచనలను గాని, చిత్రాలనుగాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియపరచగలము. మొదట స్టాంపులనుచేర్చి పంపక, తరువాత ఉత్తరాలు వ్రాసీ స్టాంపులు పంపినట్లయితే, వెతికి పంపడం కష్టమని రచయితలూ, చిత్రకారులూ గుర్తించ ప్రార్థన. ఈ సందర్భములో రచయితలు, చిత్రకారులు మాకు సహకార మివ్వగలరని ఆశిస్తున్నాము.

కాలక్షేపం

రాత్రిరి మూషకంబు వివరం బొనరించి;
 కరండబద్ధమై
ఛితిలి చిక్కి యాసచెడి—పెద్దయు డస్సిన
 పామువాత సం
పాతము జెందె; దాని దిని—పాము దొలంగ
 బిలంబు త్రోవనే;
ఏతరి హానివృద్ధులకు—నెక్కటి దైవము
 కారణంబగున్.

తా॥ రాత్రివేళ ఎలుక ఒకటి పెట్టెకు రంధ్రంచేసింది. అదివరకే ఆ పెట్టెలో బంధింపబడినదై భయపీడితయై కృశించి, నిరాశజెంది, చాలా అలసియున్నటువంటి ఒక పామునోటబడింది ఆ ఎలుక-దానినితిని ఆ రంధ్రముగుండానే పాము బయటకు వెళ్లిపోయింది. ఏ సందర్భములోనైనను, కీడునకుగాని మేలునకుగాని దైవయోగం ఒకటే కారణభూతమగుచున్నది.

ఇది ఒక విడ్డూరమైన సందర్భవిశేషం—పెట్టెలో కమ్మని తినుబండారము లేవైనా ఉంటే ఉండవచ్చును. ఆ పెట్టెకూడా సులభంగా ఎలుకలు కొరికి రంధ్రం చేయుటకు వీలైన మెత్తని చెక్కతో అనగా దేవదారు చెక్కవంటి చెక్కతో తయారు చేయబడినదై యుండవచ్చును. ఆ పెట్టె కర్మంజాలక అదివరకెప్పుడో తెరిచియుంచబడిన సమయంలో ఒక పెద్ద పాము ఆ పెట్టెలో దూరి, అందులోని సామగ్రుల క్రింద దాగియుండవచ్చును. అది జెఱ్ఱిపోతు జాతిలో చేరినదై యుంటుంది. దేవదారు చెక్కపెట్టెకు రంధ్రం చేయగల్గినటువంటి మామూలుసైజు యింటి ఎలుకను యీ జెఱ్ఱిపోతు మింగవచ్చు. జెఱ్ఱిపోతు ఆ దేవదారు చెక్కపెట్టెలో దూరి దాగియుండినప్పటికీ, ఆ పెట్టెలో ఉన్న సామానుల క్రిందనున్న ఆ పాము కన్పించకపోవచ్చు. అందుకు కారణము అది చాలా పెద్దపెట్టె అయియుండవచ్చు — పల్లెటూళ్లలో ఉలవలబస్తాలు తెలకపిండిగోనెలు వగైరా సామానులు ఉండేటటువంటి చీకటి గదులు కొన్నిఉంటాయి. ఆ గదులలో ఉండే చెత్త యింతా అంతా కాదు. ఆ గది నిండా పందికొక్కులు కన్నములుచేసి కాపురం ఉంటాయి. అటువంటి గదిలో ఎద్దులకు మెడలోకట్టేడి గంటలు మువ్వలు గల మెడపట్టీలు, తలకుచ్చులు, బండి కాడికి యిరువైపుల ఉండే చిరుతకర్రలు వగైరా చిల్లరసామాన్లు అనేకం పడిఉంటాయి. ఆ అభ్యాసము వెళ్లివస్తూ ఉండేవాళ్లుమాత్రమే ఆ గదిలోకి నిర్భయంగావెళ్లి రాగలరుగాని, కొత్తవాళ్లు ఆ గదిలో ప్రవేశించడానికి భయపడ్తారు. అటువంటి పరిస్థితిలో ఆ దేవదారు చెక్కపెట్టెలో జెఱ్ఱిపోతువంటి పెద్దసైజు పాము ఎప్పుడు ప్రవేశించిందో ఎవ్వరూ గమనించియుండరు. దానిని ఆ పెట్టెలో ఉండగా ఏ పాతేరైనా చూచియుండినయెడల దానికి అప్పుడే అంత్యకాలం సంభవించియుండేది. కాని అది ఆ పెట్టెలో ఎవ్వరికీ తెలియకుండా ప్రవేశించింది. అది అందులో ప్రవేశించిన సంగతి ఎవ్వరికీ తెలియదు. రాత్రివేళ ఎలుక ఒకటి ఆ పెట్టెకు ఎప్పుడు రంధ్రంచేసి ప్రవేశించినదో ఎవ్వరికీ తెలియదు. కనుక ఆ రంధ్రంగుండా ఆ పాము బయటకు ఎప్పుడు పోయిందో బహుశః ఎవ్వరికీ తెలియదు. తెల్లవారినతర్వాత చూచేసరికి ఆ పెట్టెకు ఎలుక చేసిన రంధ్రము మాత్రము యింటి ఆసామికి కన్పించిఉంటుంది. ఆ పెట్టెలో గతరాత్రి ఆ ఎలుకను ఒక పాము కబళించినదనే సంగతి ఎట్లా తెలిసింది? ఒకవేళ ఆ పెట్టెలో ప్రవేశించినపాము విడిచిన కుబుసము ఏదైనా ఆ పెట్టెలో పడియుండవచ్చు — అందుమూలంగా పాము ఒకటి పెట్టెలో ప్రవేశించి నిష్క్రమించినట్లుగా ఆసామీకి తెలియవచ్చు.

ఆ పెట్టెలోనికి ఎలుక ప్రవేశించి నిష్క్రమించినట్లుగా రంధ్రమే ఆనవాలు. ఆ పెట్టెలోనికి పాము ప్రవేశించి నిష్క్రమించినట్లుగా పెట్టెలోని కుబుసమే ఆనవాలు. పెట్టెలోనిపదార్థములు ఎలుక తినదగిన వైనప్పటికి, ఆ పదార్థములను ఎలుక తినినట్లుగా నైనను, ఆ పదార్థములలో కొంతభాగము హరించినట్లుగా నైనను కన్పించని సందర్భములో ఆ ఎలుక ఆ పెట్టెలో ప్రవేశించి అనుభవించినది ఏమిన్నీ లేదని నిర్ధారణ చేయవచ్చు. కాని, పాము యొక్క జాడ తెలియగానే ఎలుక ఆ రంధ్రములో నుండియే బయటకు పారిపోయి యుండవచ్చును. లేదా అదివరకే తిండిలేక కృశించి బక్కచిక్కియున్న ఆ సర్పము అతి మెలకువగా దానిని కబళించియుండవచ్చు. ఇదే ఎక్కువ సాధ్యమైనవిషయము. ఎందుచేతనంటే, ఆ పెట్టెకు రంధ్రం చేయడానికి ఎలుక సుమారుగా ఒక అరగంటసేపైనా ఆ చెక్కను కొరుకుతూ కొంత సందడిచేస్తూ ఉండగలదు. అట్టి సందడికి, ఆ పెట్టెలోనిపాము అతి మెలకువగా ఉండగలదు. రంధ్రం చెయ్యడం పూర్తికాగానే, ఆ రంధ్రంలోనికి ఎలుక ప్రవేశించగానే అదివరకే మెలకువగా హుషారుగా ఉన్న సర్పము క్షణంలో ఆ ఎలుకను కబళించి ఉంటుంది. దాని కుబుసముకూడా ఆ రంధ్రం సమీపంలోనే పడిఉండవచ్చు. అందుమూలంగా ఆ రంధ్రంగుండానే అది బయటికి పోయియుండవచ్చు. యీ రాత్రి వ్యవహారంఅంతా, ఆ రాత్రి వేళ చూచినవారు ఉండరు. పెట్టెను ఎలుక కొరుకుచున్నట్లుగా చప్పుడైతే, ఇంట్లోఉన్నవాళ్లు నిద్రలేచి దీపంబుడ్డి వెలిగించిచూస్తే చూచియుండవచ్చు. కాని, ఆసమయంలో ఆ దీపంవెల్తురును చూడగానే ఆ ఎలుక అంతర్థానమైయుంటుంది.

మొత్తంమీద అది ఎలుకచేసిన సందడి గడాయను ధైర్యంతో ఇంటియజమానితిరిగి నిద్రలేవక గురకపెట్టి నిద్రపోతాడు. ఏమైనప్పటికీ, ఆ ఎలుకను ఆ పాము మ్రింగుచుండగా చూచినవాళ్లు లేరు. పాము ఆ పెట్టెలో ప్రవేశించినప్పుడుగాని, ఆ పెట్టెలోనుంచి నిష్క్రమించినప్పుడుగాని, దానిని చూచినవాళ్లు లేరు. ఒక వేళ పాము కొరికి పారవేసినటువంటి మూషిక కళ్యాభ శేషములు ఏవైనా అక్కడ ఆ పెట్టెలోగాని, పెట్టెబయటగాని పడియుండవచ్చు. ఇంతకూ చెప్పవచ్చింది ఏమిటంటే, పాము ఎలుకను మ్రింగుతూఉండగా ప్రత్యక్షంగా యింటియజమానిగాని, మరెవ్వరైనా గాని, చూచినట్లుగా ఆధారం కన్పించదు.

ఎలుకను పాము హత్య చేసినట్లుగా చూచినవారి ప్రత్యక్షసాక్ష్యం లేదు. మనకున్న ఆధారం అనుమానప్రమాణమే. అయినప్పటికీ అదంతా కన్నులార చూచినట్లుగా కవి వ్రాసినాడు. సర్వకర్మ సాక్షియైన సూర్యుని కంటబడని సంగతులు కవికి తెలియవచ్చు. "రవి కాననిచో కవి గాంచునెయ్యెడన్"-ఈ చిత్రంకంటె విచిత్రమైన ప్రత్యక్ష నిదర్శనాలు ప్రపంచంలో ఉన్నాయి.

సర్పం యజమాని కంటబడియుండినట్లయితే, దాని చావు మూడి ఉండేది. అన్నింటికన్న గొప్పఅదృష్టం ఏమిటంటే, ఆ పాము ఏ మానవుని కంట బడకుండా పెట్టెలో ప్రవేశించి, అందులో మకాము చేసి, హాయిగా నిష్క్రమించింది.

మూషికముయొక్క ప్రవృత్తి ఏమిటంటే పుస్తకములు కాగితాలు మొదలైనవి కొరికి ధ్వంసంచేయడం. అందువల్ల దానికి కలిగే లాభం ఏమిలేదు. ఏవైనా పెట్టెలకు రంధ్రంచేసి అందులో ప్రవేశించడం - ఇది కేవలము ఇంటికి కన్నము వేసి యింట్లో ప్రవేశించడంవంటిది. (*House breaking*) అనే నేరం ఇది. అదివరకే ఆ పెట్టెలో ప్రవేశించిన సర్పంమాత్రం యజమాని అనుమతి లేకుండా అక్రమంగా ప్రవేశించినవానివంటిది. ఇది *Wrongful Entry* అనవచ్చు. ఏమైనప్పటికీ, ఉభయులూ నేరస్థులే.

"మూషికం" అంటేనే ముష్కరుడు చేసెడి పనులు చేసేటటువంటిది. "ముష్కరుడు" అంటే దొంగ - ముష్కర శబ్దమునకు సంబంధించినదే మూషికశబ్దం - ఇటువంటి దొంగపనులు చేయడం దాని సహజప్రవృత్తి దానికది ఒక కులవృత్తి వంటిది. ఎరుకలు యానాదులు మున్నగువారు చాలాకాలము దొంగతనము చేయడం తమ కులవృత్తిగా భావిస్తూ ఉండేవారు. పిండారీలు, దొమ్మరులుకూడా గ్రామాలలో బందిపోట్లు, దోపిడీలు చేసేవారు. ఆ విధంగా తాము జీవించడం తమకు విధాయకమనిన్నీ తప్పులేదనిన్నీ భావిస్తూఉండేవారు. ధగ్గులు అనే జాతివారు ఉత్తర హిందూస్థానములో వంద యేండ్లక్రింద ఉండేవారు. దారిమార్గంగా పోతూఉండేవాళ్లని పట్టుకొని, మెడకు జేబురుమ్మాల బిగించి గొంతుపిసికి చంపివేసి, బాటసారులవద్ద ఉండే సొమ్మును అపహరించేవారు. యిట్టి పని తమ కులవృత్తిగా జీవనోపాధిగా భావించి తమ పనిలో తమకు విఘ్నములు లేకుండా చేయవలసినదని తమ కులదేవతకు మ్రొక్కుకొని బయలుదేరేవారు.

సముద్రంమీద అనేక విలువగల సరకులతో ప్రయాణం చేసేటటువంటి నావలను కూడా దారిలో అడ్డగించి కొన్ని ముఠాలవారు ఆ నావలలోని సరకులను దోచుకొనిపోయేవారు. వీరిని ఇంగ్లీషులో "*Pirates*" (సాగరచోరులు) అనేవారు. కాబట్టి ద్వారి దోపిడిగాండ్లు మెట్టమార్గాలమీదను నీటిమార్గాలమీదనుకూడా ఉండేవారు. వర్తకులసరకుల్లు మెట్టమార్గంమీద పోతూఉండినా, నీటిమార్గంమీద పోతూఉండినా, దొంగలు దోచుకొనుటకు అవకాశాలు చాలా ఉండేవి. క్రీ॥ శ॥ 16 వ శతాబ్దములో ఇంగ్లండులో షేక్స్పియరు మహాకవి అఖండ ప్రజ్ఞావంతుడై అనేక అసమాన ఆంగ్ల నాటకములను రచించాడు. అతడు రచించిన నాటకములలో "*Merchant of Venice*" "వెనీసు నగరవర్తకుడు" అనే నాటకం చాలా జనరంజకంగా ఉంటుంది. ఆనాటకంలో ఆనాడు షేక్స్పియరు మహాకవి, వెనీసు నగరవర్తకుని కథ వర్ణిస్తూ, ఒక సందర్భంలో, వర్తక వ్యాపార లాభములు నానా అనిశ్చితమైనవని వర్ణించాడు.

ఇటీవల ఒకసారి అంగడికి వెళ్లి కొబ్బరికాయ యిమ్మన్నాను. వెల అర్ధరూపాయన్నాడు - నాకు ఆశ్చర్యం వేసింది.

"అదేమిటయ్యా! కొబ్బరికాయ అర్ధరూపా యేమిటి?"

"మరేనండి. సరుకు తక్కువై, ధర పెరిగింది."

"సరుకు తక్కువ కావట మేమిటీ? కోసేవాళ్లులేక చెట్లమీదనే కొబ్బరికాయలు కుళ్లిపోతున్నాయని మొన్ననే పేపర్లో చదివానే!"

"అందుకే మార్కెట్టులో సరుకు తక్కువైదండి. చెట్టెక్కి కాయకోస్తే వచ్చే కూలీ గిట్టుబాటు కావటం లేదు. కోయకపోతే కాయలు కుళ్లిపోతున్నాయ్." అన్నాడు ఆ అంగడి యజమాని.

కాలక్షేపం

అందుకు కారణ మేమంటే వర్తకపు సరకులను రవాణా చేసేటప్పుడు నీటిమార్గంలో గాని, నాట మార్గంలో గాని ఆ సరకులను అపహరించే దొంగలు ఉంటారని సూచిస్తూ *"There be water-rats oud land-rats"* అన్నాడు. (నీటి ఎలుకలూ ఉంటాయి - నాటు ఎలుకలూ ఉంటాయి అన్నాడు.)

యుద్ధాలు చేసి, ప్రజలను, పీడించి, దేశాలు కొల్లగొట్టడం రాజ్యదాహం గల రాజుల లక్షణం - వారు వీరచోరులు - చోరవీరులు. చిన్న రాజులను మ్రింగిన మిన్న సామ్రాట్టు - ఎలుకను మించిన ఏలిక అతడు - సామ్రాజ్యవాదుల సహజతత్వం అది - ఆ కూటంలోనివారి కులవృత్తి అది.

ఇంగ్లీషు భాషలో షేక్స్పియరు ప్రయోగించిన "నీటి ఎలుకలు" అనే శబ్దం ఉంది. కాని, నీటి ఎలుకల ఎరుక మనకు లేదు. ఇంగ్లీషువారికిమాత్రమే అది ఏమిటో అర్థం కావాలి. ఇంగ్లీషువారు మన భారత దేశ చరిత్రను పాఠశాలలందు పిల్లలు చదువుకొను నిమిత్తము పాఠ్య గ్రంథాలుగా వ్రాయించి, యీ భారతదేశచరిత్రగ్రంథాలలో హిందూ సామ్రాజ్యోద్ధరణ బద్ధ కంకణుడై గోవులను స్త్రీలను రక్షించుటకు దీక్ష వహించి పోరాడిన మహారాష్ట్ర ధీరుడగు శివాజీ మహారాజును గూర్చి వ్రాయబడిన చరిత్ర గాథలలో అతనిని "కొండ ఎలుక" (*Mountain Rat*) అని వర్ణించారు. మహారాష్ట్ర దేశములోని కొండల మధ్య శివాజీ పటాలములు ఎక్కడ దాగియుండి, ఎక్కడ పొంచియుండి ఔరంగజేబుయొక్క మహమ్మదీయ పటాలములపై దుమికి, పటాపంచలు చేసెడివో కనిపెట్టడం అసాధ్యంగా ఉండేది.

పిల్లివలె పొంచి దండెత్తిన ఔరంగజేబు జేబులో పడని "కొండంత ఎలుక శివాజీ".

ఆనాటి తురుష్క సేనలు దేశమును కొల్లగొట్టుతూ ఉండేవి. అందువల్ల ఆ ముష్కర తురుష్క సేనలను శివాజీ సాధించి హిందూ సామ్రాజ్య ప్రతిష్ఠాపనకు ఉపక్రమించి విక్రమించాడు.

మనదేశ సంపదను కొల్లగొట్టిన గజినీ మహమ్మదు సోమనాథ దేవాలయములోని అమూల్యాభరణములను అపహరించాడు: మొగలాయిప్రభువులు మనదేశాన్ని ఆక్రమించి ఢిల్లీనగరంలో పాదుషాలై దేశాన్ని శాశ్వతంగా అనుభవించవచ్చునని స్థిరమైన పీఠం ఏర్పరచుకొన్నారు. కాని, ఢిల్లీ పాదుషాల తరఫున దక్షిణ హిందూస్థానంలో ఉంటున్న నైజాము, ఆర్కాటు నవాబువగైరాలున్నూ బెంగాలురాష్ట్రంలో ఉంటున్న సర్దారులున్నూ ఢిల్లీ ప్రభుత్వాధికారాన్ని శిరసావహించక స్వతంత్ర ప్రభువులుగా చీలిపోయినారు. ఈ తురుష్క ప్రభువులలో ఛిద్రాలు ఏర్పడ్డాయి. ఈ విభేదాలు, యీ ఐకమత్యవిచ్ఛేదాలు, ఆధిపత్య ఛిద్రాలు, రంధ్రాలు ఇంగ్లీషు వారికి దివ్యమైన అవకాశాలైనాయి. ఈ దేశంలో యీస్టు ఇండియా కంపెనీవారు వర్తకంచేసికొనుటకై శించారు. ఢిల్లీలోని మొగలాయి పాదుషాయొక్క అనుగ్రహంవల్లనే ప్రవేశించారు ఆఖరుకు యీ మొగలాయి ప్రభుత్వపీఠమునే ఆంగ్లేయులు ఆక్రమించారు.

మన దేశసంపదను అపహరించడానికి మొదట ప్రవేశించిన తురుష్కులమూలంగానే ఆంగ్లేయులు హాయిగా దేశాన్ని ఆక్రమించి మొగలాయిప్రభుత్వాన్ని కూడా స్వాహాచేశారు. ఈవిధంగా మన దేశచరిత్ర చదివిచూస్తే, సమగ్రంగా పరిశోధిస్తే మన దేశపురాజులే ఒకరిని మింగవలెనని ఇంకొకరు కలహించినారు. వీరిలో వీరికి అయికమత్యంలేకపోవుటవల్ల ఏర్పడిన చీలికవల్లనూ, ఆ చీలికలమధ్య ఏర్పడిన అవకాశంవల్లను ఇంగ్లీషువారు ఏదో ఒకపార్టీ పక్షంచేరి యుద్ధంచేసి తాము ఓడించిన రాజును తాము గెల్పించినరాజును కూడా కబళించారు. ఇది ఎట్లాఉంది అంటే, కోర్టుకు ఎక్కి గెల్చినవాడు ఆ వ్యాజ్యంలో తన పగ సాధించడానికి పైసా ఖర్చుచేసి దివాలాస్థితికి వచ్చాడు. కోర్టుకుఎక్కి ఓడినవాడు తాను అనుభవించవలెనని ఆశపడిన ఆస్తిని పోగొట్టుకొని దివాలాస్థితికి వస్తాడు. వ్యాజ్యంలో ఓడినవాడు కోర్టులోనే ఏడుస్తాడు. వ్యాజ్యంలో గెల్చినవాడు కోర్టులో నవ్విన్నా, కొంపకువచ్చి ఏడుస్తాడు.

మొత్తంమీద అసలు దావాఆస్తిని గెల్చి

(53-వ పేజీ చూడండి)

గోడ మీద బొమ్మ

శ్రీ బలివాడ కాంత రావు (చిన్ననవల)

(గతసంచిక తరువాయి)

5

జానకి మనస్సు నొప్పించకుండా వుండటానికి రామం సాధ్యమైనంత వరకూ నవ్వుతూ, చెణుకులు విసురుతూ ఆమెవద్ద వుంటున్నాడు. అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన రామం, సర్వాంగసుందరంగా అలకరించుకున్న జానకి వుత్సాహంతో యెదురవడం చూచి, "ఈ రోజు సినిమాకు వెళ్ళేకన్న సముద్రతీరానికి వెళ్తే బాగుంటుంది" అన్నాడు. జానకి కాదనలేక పోయింది.

సముద్రతీరాన్నుంచి తిరిగి వచ్చేసరికి ఇంట్లో చాల గొడబగా వుంది. చిన్నబావ కాళ్లు చేతులు కొట్టుకొని యేడుస్తూంటే సుందరమ్మ చెయ్యి చేసుకుంటోంది. రామం వస్తూనే అడ్డుకుని కుర్రాడ్ని యెత్తుకున్నాడు.

"వాడ్ని' విడిచిపెట్టు నాయనా! వెధవ-పూరుకుంటే ఇల్లంతా గోలచేసి పారేస్తున్నాడు."

రామం కుర్రవాడి యేడుపును తగ్గించటానికి అబద్ధంతోనే ప్రయత్నిస్తున్నాడు. "ఊరుకోవోయ్! నువ్వేడిస్తే-అమ్మ మళ్ళీ కొడ్తుంది. నువ్వూరుకుంటే అమ్మ ఏమంటుంది చెప్పు? ప్రతిదీ అమ్మనే అడగాలా? నన్నడుగు."

బావగారన్న మాటలకు ఏడుపు తగ్గించి కళ్లు నులుపుకుంటూ దీర్ఘంతోనే బావగారి ప్రశ్నలకు సమాధానం చెప్పుతున్నాడు.

"చూశావా! ముఖమంతా చెమట, జిడ్డున్నూ - వెళ్ళి అక్కను కడగమను. బాగా తయారైవస్తే బజారుకు వెళ్ళి బట్టలు జోడు కొనుక్కుందాం." ఈ మాటలతో వచ్చిన దుఃఖమంతా అణచుకుని, అక్క దగ్గరకు పరుగెత్తాడు. వెక్కుతూనే ముఖం కడిగించుకుని తుడిపించుకున్నాడు.

ఇరువురు వీధి గడపలోనికి వచ్చేసరికి, సుందరమ్మ అంది. "వద్దు నాయనా! ఇప్పుడెందుకు దండగ! వెధవ రోజు కొక జత మాపుతున్నాడు."

"ఈసారికి కొనివ్వండి. మరెప్పుడు అల్లరిచెయ్యడు" అంటూ వొంగొని కుర్రాడివేపు చూస్తూ, "బట్టలు జోడు కొంటాను. ఇంకెప్పుడు అల్లరి చెయ్యనని చెప్పు అమ్మతో' అన్నాడు రామం. కుర్రాడు ముఖం త్రిప్పకుండానే, "అల్లరి పెట్టను" మొఖం ముడుచుకున్నాడు. జానకి వెక్కిరిస్తూ ఆ మాటలను మళ్లీ అనడంతోనే బుచ్చిగాడికి చేతగాక యేడుపు లంకించుకున్నాడు.

బజారునుండి తిరిగి వచ్చేసరికి ఎనిమిదిన్నర అయింది. రామం భోజనం చేస్తూంటే లోన గదిలో చిన్నబావ వుల్లాసంగా కబుర్లు చెప్తూంటే, 'పెద్దబావ మరది తల్లి దగ్గరకు వచ్చి మూలుగుతూ మారాం చేస్తున్నాడు. సుందరమ్మ వరండాలోనికి వస్తూనే, "మూడునాయనా! వద్దంటే విన్నావు కావు. పెద్దాడి అల్లరిచూశావా?" అంటూ దగ్గరగావచ్చి కూర్చుంది.

"ఇదేంటోయ్ బావా! చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నావు. ఎవరైనా వింటే నవ్వగలరు" అని రామం అక్కడనుంచే అన్నాడు. మరి జవాబు లేదు. మూలుగు కూడ కట్టింది.

సుందరమ్మ మాటల్లో మాటగా వెంకట్రావు ప్రసక్తి తెచ్చింది. రామం ఆయన మీద యెటువంటి అభిప్రాయం యివ్వలేదు. అత్తగారు, చాల మర్యాదస్తుడని, మాటంటే నిలుపుకునే మనిషని తెగ పొగుడుతోంది. సుందరమ్మకు యింత కాలం వెంకట్రావు ముఖపరిచయమే కాని, తేలు సంఘటన జరిగినపాటనుండి మాట్లాడే అవకాశం కల్గింది.

"మీ మామగారు ఆ నరసింహం పంతులుగారి మీద యెప్పుడో యేదో కేసువస్తే చాలా సహాయం చేశారట. అందుకని యిప్పటికీ ఆ అభిమానంతోనే యేదో వొకటి అలా పంపిస్తూనే వుంటారు. నేను వద్దని తల బాదుకున్నా వింటారనా! నిన్న వాళ్ళ చిన్నకోడలు వచ్చిందట. అందుకని లాడూలు పంపించారు. వెంకట్రావుగారింటికిస్తే - ఏమనుకుంటారన్న భయంతోనే పంపించాను.

రామం, ఆ పొరుగునవున్న వాళ్ళయింటికి పంపించారా అని అడగలేదు కాని ముఖమొకసారి పైకియెత్తి దించాడు. రుచించని అన్నం ముద్ద ముద్దకు మంచినీరు త్రాగుతున్నాడు. తను అడగాలనుకుంటున్న విషయానికి యీ మాటలు అడ్డు వస్తున్నాయి. సుందరమ్మ మామూలు ధోరణిలోనే చెప్పుకు పోతూంది.

సాయంత్రం వెంకట్రావుగారు వచ్చారు. ఎందుకన్ని లాడూలు పంపించారన్నారు "అయ్యో! అవి ఏమాత్రం - ఈ నా చేతులతో......ఇప్పుడే మను కుంటే యేం లాభం? ఆ రోజులూ ఆ కాలం - అంతా సరి. దేవుడు నాకిలారాస్తే ఆయనెందుకు వుంటారు?"

అల్లుని వైఖరిచూసి సుందరమ్మ కొంచెం సర్దుకుని, "ఈ పిల్లల అదృష్టమూ అని నువ్వు నామాట కాదనలేక పోయావు నాయనా! వెంకట్రావుగారు కూడ అదే అన్నారు. నీ బుద్ధిమంచి, నీ యెదురుగా చెప్పకోకూడదు."

ఈ చివరమాటలకు రామం ఒక విధంగా చిన్నబుచ్చుకున్నా, ఇంతలోనే బుచ్చిగాడు వచ్చి, "బావగారూ! బావగారూ! [illegible]న్న అన్నయ్య రేపు కొడతాట."

"వూరకనే అన్నాడు లే - పోయి పడుకో" [illegible]చ్చిగాడు వెనుకకు తిరిగి పుట్టిదే అన్నట్టు చెయ్యివూపాడు. రామం యిదే సమయమని అత్తగారు మళ్ళీ కలుగజేసికుని ఏమీ చెప్పకముందే,

"మా చెల్లెమ్మను రేపు తీసుకవచ్చి ఒక వారం రోజులు యిక్కడ, వుంచాలని వుంది." అన్నాడు.

సుందరమ్మ ఆలోచనలన్నీ యీ మాటలతో యెగిరిపోయినై. తన అయిష్టత ముఖంలో స్ఫుటంగా చూపించి, అల్లునివైపు చూస్తోంది. ఆ అల్లుడు ముఖం దించే వున్నాడు. అత్తగారు కలుగజేసికుని,

"వింటో గొడవల్లో వున్నారని విన్నాను."

ఎవరు చెప్పారు అన్న ఎదురు ప్రశ్న నాలిక-చివరవరకూ వచ్చినా ఆపుకున్నాడు రామం. అత్తగారు నా కిష్టంలేదని చెప్పదు అనే ధీమాతోనే ఆయన ఆ విషయం యింకేమీ మాట్లాడలేదు. గొడవల్లో వున్నారన్న విషయం యీ మెరకూ యెలా వచ్చిందా అని తర్కించుకుంటూనే చెయ్యి కడుక్కున్నాడు.

ఆరాత్రి చెప్పని నిర్ణయం, మరుచటి

అలెగ్జాండరుతో పోరాడిన పురుషోత్తముడు

క్రీస్తు పుట్టక పూర్వము భారతదేశమును జయించవలెననే ఆశతో గ్రీసుదేశపు చక్రవర్తియైన అలెగ్జాండరు 22 వేలమంది గ్రీకు సైనికులతో సింధునదీ తీరమువరకు వచ్చెను.

అక్కడ బహు పరాక్రమవంతుడైన హిందూ ప్రభువగు పురుషోత్తమునితో యుద్ధము చేసెను "పురుషోత్తం" అనే పేరు ఉచ్చరించలేక గ్రీకులు అతనిని "పురుస్" లేదా "పోరస్" అనేవారు. అతి ప్రాచీనకాలములో ప్లూటార్కు అను గ్రంథకర్త మహావీరుల చరిత్రలను ఒక గ్రంథంగా వ్రాసెను. ఆ గ్రంథములో అతడు "పోరస్"గూర్చి (పురుషోత్తముని గూర్చి) యిలా వ్రాసెను:—

ఇతడు 4 మూరలపైన ఒక జానెడు ఎత్తు ఉండేవాడు. అనగా 7 అడుగుల పొడ*రి. అతడు ఎక్కిడి ఏనుగుయొక్క ఎత్తుకు అతడు తగిన ఎత్తు గలవాడైయుండెను. అతడు ఏనుగు మీద ఎక్కితే, ఒక రౌతు గుర్రం మీద ఎక్కినట్లుగా ఉండేది. గ్రీకు సేనతో జరిగిన యుద్ధంలో "పోరస్"కు గ్రీకు సైనికులు వేసిన బాణాలు కొన్ని శరీరములో గుచ్చుకొనెను. ఆ బాణముల మూలంగా అతడు కిందకు పడిపోకుండా, అతని ఏనుగు మెల్లగా నేలమీద మోకరించి కూర్చుండెను. అప్పుడు ఆ ఏనుగు తన తొండముతో పురుషోత్తముని శరీరములో గ్రుచ్చుకొన్న బాణములను ఒక్కటొక్కటిగా పట్టి నేర్పుగా లాగివేసినది. వాటినిలాగినప్పుడు బాధ కలుగును. కాని, ఆజానుబాహువైన "పోరస్" ఆ బాధకు ఓర్చుకోగలెను.

గోడమీద బొమ్మ

రోజు వుదయం రామం ఆఫీసుకు వెళ్ళే ముందు కూతురుద్వారా సుందరమ్మ చెప్పించింది. కమీజు గుండీలు అందిస్తూ జానకి అంది

"వదినను తీసుకరాకండి, అమ్మకు యిష్టంలేదు." క్రిందకు జారిపోయిన గుండీని వంగొని తీస్తున్న భార్యవైపు చూశాడు. ఆమె తల ఎత్తేసరికి సర్దుకుని గబగబ అక్కడనుంచి కదలి క్రేప్ సోల్ బూటు వేసుకోటానికి సంసిద్ధుడయ్యాడు. అద్దం చూడకుండానే ఆ వుంగరాల క్రాపును తొందరగా దువ్వుకొని వెళ్లిపోతూంటే చేతిలో ప్లాస్టిక్ బెల్ట్, గుండీ పట్టుకుని జానకి అడ్డుపడింది. బెల్టు తీసుకుంటూంటే జానకి కమీజుకు గుండీ పెట్టూ, "ఆఫీసుకు వేళ కాకుండానే వెళ్లిపోతున్నారు. సాయంత్రం వేగంగా వస్తారు కదూ?"

రామం జవాబివ్వకుండానే వెళ్ళిపోయాడు. వెళ్తున్న రామం వైపు చూస్తూ జానకి అలా నిల్చుండి పోయింది.

ఇంటినుండి బయటకు యెంతవడిగా వచ్చాడో వీధిలోనికి వచ్చాక అంత నెమ్మదిగా అడుగులు పడుతున్నాయ్. వారం రోజులు అత్తగారు తన చెల్లెల్ని యింట్లో వుండనీయదా అన్నధీమాతోనే ముందు రోజు నరసమ్మను పార్వతిని కూడ ఒప్పించాడు. ఇక మామగారిని ఒప్పించటమంత పెద్ద విషయంకాదు. ఇప్పుడు అత్తగారు అసలుతీసుకురావటానికే వీలుకాదనటంవల్ల వచ్చిన విషమ పరిస్థితిని యెలా ఆదుకోవటమా అని పరిపరి విధాల ఆలోచించాడు. ఈ మాత్రం స్వతంత్రత లేనిది తనా యింట్లో వుండి దేనికనుకున్నాడు.

ఈ నిరాశాజనకమైన ఆలోచనలకు స్వస్తి చెప్పి కర్తవ్యమేమిటని కొంతసేపటికి గోడమీదబొమ్మ జ్ఞాపకం వచ్చేవరకూ ఆలోచించలేకపోయాడు. తను మనిషిలా బ్రతకాలి. తన్ను సూదులతో పొడుస్తున్నా నవ్వాలి. మనస్సులో క్రొత్త అనుభూతి కలగటంవల్ల వెలవలబోయిన ముఖంలో ఆశాజ్యోతి వెలిగింది. తన చెల్లెలను తప్పకుండా తన అత్తవారింటికి తీసికొని వెళ్లాలి అని మొద అనుకున్నట్టే జరిపించాలి. ఏమైనా జరిగితే తగుచితంగా ప్రవర్తించవచ్చని భీష్మించుకున్నాడు.

రంగయ్యగారింటికి వెళ్ళేసరికి వీధి తలుపు తెరచే వుంది. నరసమ్మ ముఖ్య గదిలో వొకమూల కూర్చునివుంది. పార్వతి వంటయింట్లో వుంది. మామగారితో యీ నిర్ణయాన్ని చెప్పి చెల్లెలను తీసుకునిపోదామని, మెల్లెగ్రాకుతూంటే మామగారి గంభీరమైన గొంతుక వినిపించింది. రామం మధ్యలోనే ఆగి వింటున్నాడు.

"నీకు తెలుసును నాయనా! కోడలును యెక్కడనుంచి యెల్లాంటి స్థితిలో తెచ్చానో? నా కంఠంలో ప్రాణముండగా కోడలిని యింకో యింటికి పంపించను!"

వెనువెంటనే వెంకట్రావు గొంతుక విన్నాడు రామం. "అల్లా తెంపి పారేస్తే ఎల్లాగండీ? మరి మీ అబ్బాయి పేచీ పెడ్తున్నాడుకదా! నిన్న సాయంత్రం నేను రామం చాలవరకు ఆలోచించే యీ నిర్ణయానికి వచ్చాం."

"పిల్లికి రొయ్యల మొలత్రాడు కట్టకండి నాయనా! రావాలనివుంటే వాడే

వస్తాడు! రాకపోతే పొయ్యాడు. ఏదైనా ఋణానుబంధం కదా!"

"మీ అబ్బాయి నూరక త్తిలాంటివాడు. అన్నీ అవలక్షణాలే—ఎట్లాచ్చి విడిచి పెట్టగలం?"

"ఆఫీసుకు టైము అయినట్టుంది వెళ్ళు నాయనా! ఏది ఎల్లా ప్రాప్తముంటే అల్లా జరుగుతుంది."

"మీవాడికి స్వతహాగా బుర్ర వుంటే యెల్లా అనుకున్నా పూచీలేదు. ఎవరిక్రింద యెంత తగలేస్తాడో!" అంటూ వెంకట్రావు లేచిపోతూ, "ఆ దరిద్రగొట్టు కిష్టయ్య వున్నాడు కదండీ?"

ఈ చివర మాటలు గొణుగుతుండేసరికి రామం మీదకు వచ్చాడు. రంగయ్యగారు మేనల్లుని చూడగానే, నిండు ముఖంతో "రా – నాయనా!" అన్నారు

అభిమాన పూర్వకమైన ఆ పిలుపుకు రామం ఒళ్ళు పులకరింప జేసికుని దగ్గరగా కూడ వెళ్ళలేక పోయాడు.

"నువ్వెందుకు నాయనా! అన్నీ మీద వేసుకుంటావు? అక్కడ ఏదో సుఖంగా వుంటావనుకుంటే..."

రామంకు అత్తగారిల్లు ఆ పరిస్థితిలో తలపుకు రావటంతో మొదట పొందిన అనుభూతి యెంతసేపో లేదు. ముసలాయన మెల్లగా నవ్వి, "చూడు నా కెప్పుడూ మీ చెల్లెమ్మ విషయంలో విచారంలేదు. బ్రతికితే హాయిగా బ్రతకాలి, చస్తే పూర్తిగా చావాలికాని బ్రతుకుతూ చచ్చినట్లుండ కూడదు నాయనా!" ముసలాయన మెల్లగా లేచి దూరంగా పోతూ, "దానిని తీసికుని వెళ్ళాలంటే తీసికుని వెళ్ళొచ్చు. కాని నా కెంతమాత్రం ఆ పని రుచించదు."

వెంకట్రావు చప్పున, "ఛా ఛా! ఆయనకు ఇష్టంలేని పని మనం ఎంతమాత్రం చేయకూడదు. మరెందుకు సెలవు పెట్టావు? ఇల్లా ఆఫీసుకు పోదాం పద!" అన్నాడు.

రామం ఏమీ మాట్లాడలేక పోయాడు. రెండు మెట్లు దిగి తనకోసం ఆగిన వెంకట్రావును చూచి తనూ కదిలాడు. వీధిలోనికి వస్తూ కృంగిన హృదయంతో వున్న నరసమ్మను చూచాడు. ఇంతసేపూ మామగారి మాటలవల్ల తేలికబడిన హృదయం మళ్లీ బరువెక్క సాగింది. సగంత్రోవలో వెంకట్రావు ప్రారంభించాడు, "మీ అత్తగారు అడిగారోయ్—సర్ది చెప్పానులే"

"ఏమిటి?"

"ఆడవాళ్ళకి లేనిపోని అనుమానాలు కదూ! ఆ మరుచటి రోజు వస్తానన్నవాడివి ముందురోజు రాత్రి వుత్తచేతులతో వెళ్ళావని మంచయినా కొద్దయినా



అజంతా సుందరి

—చిత్రకారుడు: శ్రీ పి. నాగేశ్వరరావు.

అల్లుడ్ని నిలదీసి ఎల్లా గడుగుతారు? అప్పుడే చెడ్డ గడియలు దాటాయని, మంచి ముహూర్తం మించిపోతుందని నేనే వెళ్ళమన్నానని చెప్పాను. నిన్న సాయంత్రం ఆలస్యంచేస్తే మన బండారం బయటపడుతుందని, నరసమ్మగారితో చెప్పి, నీ పెట్టి పంపించాను."

"అయితే యీ గొడవేమి నువ్వు చెప్పలేదన్నమాట,"

"*What do you mean*? అన్నం తింటున్నానా? గడ్డి తింటున్నానా? నాకామాత్రం తెలియదటోయి?"

ఇంతలో యిద్దరూ మెయిన్‌రోడ్డులో పడ్డారు. నాలుగడుగులు వేసేసరికి వెంక

కళింగ దేశపు చాటువులు :

పంచవింశతి దేవతాస్తుతి

★

పక్కి - వేంకటనరసయ్య కవి (1800-1860)

కం॥ వనచర వనచర విప్రా
వనిపద్వయ బుద్ధకలికి వరపురహర వా
గిన మోమావాగవి కవి
శని ఫణియుగ గురుబుధకుజ చంద్రులఁ దలఁతున్.

దశావతారములు : (10) వనచర = మత్స్య, కూర్మములు ; వనచర = వరాహ, సింహములు - సింహశబ్దము వలన నరసింహుఁడని తెలియవలెను. (వనమనఁగా నీరు, వనమనగా నడవి); విప్రా = వామనుఁడు - బ్రాహ్మణ వటువు ; అవనిద్వయ = రామ, బలరాములు ; బుద్ధ = బుద్ధుఁడు ; కలికి = కల్క్యవతారము (విష్ణువు).

త్రిమూర్తులు, వారి భార్యలు : (6) పురహర = శివుఁడు; వాక్ + ఇనుఁడు = వాగ్దేవికి రాజు = బ్రహ్మ (వాగిన) ; మోమావాక్ - (మ + ఉమా + వాక్), మా = లక్ష్మీదేవి ; ఉమా = పార్వతీదేవి ; వాక్ = సరస్వతీదేవి ; వాగవి = వాక్ + అవి.

నవగ్రహములు (9) అవి = సూర్యుఁడు ; కవి = శుక్రుఁడు ; శని = శని ; ఫణియుగ = రాహు కేతువులు ; గురు = బృహస్పతి ; బుధ = బుధుఁడు ; కుజ = కుజుఁడు ; చంద్రులు = చంద్రుఁడు.

సేకరణ : శ్రీ ని. వేంకటరావు.

గోడమీద బొమ్మ

ట్రావు, "అదుగదుగో ఆ సైకిలుమీద వెళ్లిపోతున్న గుండు గాడిని చూశావా ?" అన్నాడు.

రామం వెనుకకు తిరిగి చూశాడు. వెంకట్రావు యిక తన కథ ప్రారంభించాడు.

"ఆ గుండుగాడు నా క్లాసుమేటనోయి! నేనిలా పోర్టు సిగ్నలర్‌గా పని చేస్తూ, అప్పులతో ఛస్తున్నాగానీ — ఆ గాడిదకొడుకు నే మూడు మేడలు నిక్షేపం లాంటివి గడించాడు. ఎక్కడికెళ్లు సైకిలు మీద బ్రాహ్మణికానికి తయారు. వాడి రాబడి యెంతనుకున్నావు? డిప్టీ కలెక్టరుకైనా వుండదనుకో. వంకాయకూర వండేడంటే అన్నం కన్న కూర హెచ్చుతినేస్తాం! ఉన్న fact చెప్తున్నా. వాడొక్కడే కూడబెట్టడం కాదు మా వాళ్లందరూ సంపాదించారు నమ్ము."

ఇది రామంకు క్రొత్త విషయం కాకపోవటంవల్ల యేమంతటి ఆసక్తి చూపించలేదు. ఆఫీసులో అడుగుపెట్టేవరకు యెన్నో సంగతులు వెళ్ళగక్కాడు.

ఆ వేళ ఇంటికి వెళ్ళేసరికి రాత్రి యేనిమిది అయ్యింది. జానకి యెదురుపడ్డా రామం మాట్లాడలేదు. భోజనందగ్గర చిన్నబావ క్రొత్త బట్టల వృత్తాంతం, తన బడి అనుభవాలు చెప్పకపోతున్నాడు. అల్లాంటి బట్టలు, జోగ్గు వాళ్ళ బడిలో డాక్టరు గారి అబ్బాయికి కూడా లేవట. సుంకరివారి లలిత యీ బట్టలు బాగులేవన్నదట. లలితను కొట్టాలని వెంబడించేసరికి, చింతచెట్టు దగ్గర పడిపోతే అంతా గొల్లున నవ్వారట. చివరి కిల్లా తేల్చాడు.

"బట్టలు ధూళి, బురదయ్యాయి — రేపు మళ్ళీ కొనరండీ బావగారూ ?"

రామం తల యెత్తి కుర్రాడివంక చూశాడు. చెయ్యి కడుక్కున్నాక మేడ మీదకు తీసికొనిపోయాడు.

అక్క భోజనం చేస్తుండగా, బుచ్చిగాడు గబగబ మేడ దిగి వచ్చాడు. "బావగారిచ్చారు" అంటూ చేతిలోని రూపాయి చూపించాడు.

"పకోడి కొంటాను. నీ కిస్తానేంటి?" అని అన్నయ్య ముఖంలో ముఖం పెట్టి చెప్పాడు. గెంతుకుంటూ అమ్మదగ్గర కెళ్లి చెప్పాడు. సుందరమ్మ ముఖం ముడుచుకుంటూ, "అణా కాదు, అర్ధణా కాదు — రూపాయి లివ్వకోవడ మేంటి?" అన్నది. కుర్రాడు మళ్ళీ అక్కకు చూపించి "ఇదిగో రూపాయి! నీకు లేదు." జానకి తమ్ముని చేతిమీద విసరికొట్టింది. రూపాయి యెక్కడో గుగిరిపడిదాగుంది. ఇక ఏడుపు లంకించుకున్నాడు. అన్నయ్య సంతోషంతో గంతటం, అక్కయ్య వెక్కిరించటం, అక్కయ్య వెక్కపోవటం గగ్గోలు పెడుతున్నాడు. సుందరమ్మ కష్టంమీద తన శరీరం కదిపింది. నూతి దగ్గరగా అంటుగిన్నెల ప్రక్క మిలమిల మెరుస్తున్న రూపాయిని వెళ్ళితీసి కొడుకున కదుతూ, "రూపాయి నూతిలో పడిపోయింది. పోతే పోనీలే. నేను నీకు అణాయిస్తానులే యిదిగో" అంటూ కొడుకును దగ్గరకు తీసికొని బుజ్జగించింది.

జానకి మేడమీదకు వెళ్ళేసరికి చటుక్కున గుండె ఆశ్చర్యంగా ఆగిపోయింది, వూరుకోలేక, "ఇదెప్పటినుండి ?" అని అడిగింది పాలగ్లాసు టేబిల్‌పై పెడుతూ.

కిటికీదగ్గర కుర్చీమీద కూర్చుని, ఆకాశంవైపు చూస్తూ పొగవదలుతున్న రామం భార్య మళ్లీ వేసిన ప్రశ్నకు, "ఎప్పుడైనా చిరాకుగా వున్నప్పుడే!" అన్నాడు.

సిగరెట్టుపై సిగరెట్టు వెలిగించాడు. జానకి అలాగే నిల్చుండిపోయింది. భర్త ముఖంవైపు దీక్షగా చూస్తూ, అడుగుదామన్న మాటలు నాలుక చివరవరకూ వచ్చిన మాటలు ఆపుకోడానికి ప్రయత్నిస్తూంది. శక్తిచాలక అడగవలసిన విషయం అడిగే వరకూ వుండలేకపోయింది.

"అడిగావు కాబట్టి చెప్పతాను" అన్నాడు రామం భార్య ముఖం చూడకుండానే. తను చిరాకుగా వుండటానికి గల కారణం తనభార్యకు తెలియకుండా వుంటుందా ? తెలిసే తన నోటి వెంబడి చెప్పదామని ఆమె కోరుకుండాలి ! ఈ సంగతి స్ఫురించటంవల్ల కొంచెం కోపు ఆగాడు. ఏం చెప్తారో వినిందామన్న కుతూహలంతో జానకి కొంచెం దగ్గరగా వచ్చింది. ఇది లీలగా గ్రహించిన రామం, యింతవరకు భార్యమీద నున్న అభిప్రా

యము న్నాక ముక్కు విచ్చి కెప్పుడని అన్నాడు.

"ఎలాగూ తెలిసింది. ఇప్పుడు భద్రం ఇంటికి రావాలి. అందుచేత కొన్నాళ్ళపాటు మా చెల్లి ఆ యింట్లో వుండకూడదు"

"అమ్మ ఆలోచించకుండా ఏపనీ చెయ్యదు."

జానకి యిలా వెంటనే అన్న మాటలకు రామం చిరాకుగా ముఖం పెట్టి సిగరెట్టు పారేస్తూ, "ఏ మెచ్చిందిప్పుడు?"

"వదినను తీసుకొస్తారే అనుకోండి! ఇల్లాంటి గొడవల్లో వున్నారు కదా ఏనుయ్యో గొయ్యో చూసుకుంటే?"

ఇది అత్తగారిఅభిప్రాయమైనా కూతురు అనుకరించటంతోనే కుపితుడయ్యాడు. తన చెల్లెలను అంత గుండె నిబ్బరంలేని మనిషిగా చేసేయటం సహించలేక కొంత కటుస్వరంతో-

"మీ అమ్మ మొగదక్షత లేదనిగా నన్నరమ్మంది. మొన్న ఆవిడతో ఏమంటోంది? మీబంటులా వుండటానికి నేను రాలేదు!"

జానకి మాట్లాడలేదు. కాని రామంకు ఒళ్ళంతా వుడికిపోయింది. ప్రొద్దున్న నుండీ అణస్తున్న కోపాన్ని యిక అణచలేకపోయాడు. "వాళ్ళ మంచిని మీరేం గ్రహించారు? నువ్వేనా ఏం న్యాయం చేశావ్? వచ్చిన వారం రోజుల్లోనే చిరాకుపడి కన్నారింటికి వచ్చేశావుగా?" భర్త కోపం యిలా వెళ్ళగక్కగానే జానకి తడబడుతూ అంది.

"ఆ యిల్లు మీ యిల్లులా లేదని అమ్మ చెప్పింది!" భార్య ఇలా అనటంతోనే మరీ విజృంభించాడు.

"పాతికేళ్లనుండి నేనుండగా లేదుగాని, ఒక్కవారం రోజుల్లోనే నా యిల్లులా లేదని తల్లీ కూతురూ నిర్ణయించేశారు."

"అవునండి! వదినను మీతో మాట్లాడి సందుకే కొట్టి, మామీద విరుచుకుపడితే మరి మీ యిల్లని అమ్మ యెలా అనుకుంటుంది? కొడుకు కొడుకే — మేనల్లుడు మేనల్లుడే."

"ఏమైనా అనుకుంటారు. మీ రేమనుకున్నా, మీ అమ్మ పేచీ పెట్టినా మిమ్మల్ని వారు బాగానే చూశారు. లేకపోతే గడచిన ఆరు నెలల్లో ఇన్నిరాత్రులు మీ యింటికి రావలసిన అవసరం ఏంకలిగేది?" జానకి అక్కడనుంచి కదలిమంచంను ఆనుకుని, తలదించి నిల్చుంది. రామం వూరుకోలేదు. మళ్ళీ తీవ్రంగా అన్నాడు. "వారం రోజులు మా చెల్లి మీ

(54-వ పేజీ చూడండి)

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

మొన్న మొన్నలా వుంటుంది; ముప్ఫైయేళ్ళ కిందటిమాట, అది జాతీయ మహాసభ ఏడాదిపండుగ తొలిసారిగా తెనుగుగడ్డమీద జరిగిన మంచి వేళ. నాజూకూ నాగరికం తెలిసిన కాకినాడ పటణంలో, పట్టువస్త్రాలేగాని పనికిరాని భోగమూర్తి, మహాత్ముడి సంస్పర్శ చేత త్యాగమూర్తిగా మారి, ఖద్దరు గావంచా కట్టుకుని, ఏకైకపుత్రుడు పోయిన కడుపుబాధ శోకమునుపు, అటు కర్మచేస్తూ, ఇటు కాంగ్రెసు కార్యదర్శిగా కష్టించిన మహర్షి సాంబమూర్తిని చూసి, కవయిత్రి సరోజిని కంట తడిపెట్టిన కనికరపు వేళ. గాంధీ సోమయాజి "వైశ్వదేవం"లో స్వాహా అంటే తెనుగుబిడ్డలంతా ఆ బాలగోపాలం చిచ్చులో వురికిన పుణ్యసమయం.

ఆనాటి మహాసభ కధ్యక్షుడు, మవులానా మహమ్మదలీ. నగరంలోవున్న జాతీయ సంస్థలన్నీ సందర్శించడానికి బయలుదేరినాడు. ఒకచోట అయిదువందల మంది యువతీయువకులు, బాలబాలికలు, గాంధీనిర్మాణ కార్యక్రమంలో తరిఫీయుతు పొందుతున్నారు. నూలు వడుకుతున్నారు; హిందీ నేర్చుకుంటున్నారు. పరాయి ప్రభుభక్తికేగాని, దేశభక్తికి ప్రాపులేని ఆ రోజుల్లో స్వంతఖర్చుతో ఆ సంస్థ అంత చక్కగా నడుపుతున్న దిట్ట ఎవరన్నాడు. ముక్కుపచ్చలారని పదమూడేళ్ళ బాలికని తీసుకొచ్చి ముందు నిలబెట్టి, ఈవిడే ఆ దిట్ట అన్నారు. ఆ బాలికే ఈనాటి ప్లానింగ్ కమిషన్ సభ్యురాలు, శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్ పల్లెటూరి పరదాలొంచి పైకొచ్చి ప్రజాక్షేమంకోసం ప్రభుత్వ పథకాలు నిర్మిస్తున్న ప్రజ్ఞావంతురాలు. దుర్గమదేవికి, మల్లమదేవికి, మాంచాలకి, నాయకురాలికి, కన్యకామణికి ఆటపట్టైన పుణ్యభూమిలో పుట్టిన చిగురుకొమ్మైన చేవ అన్న పూర్వకీర్తికి ప్రస్తుతకీర్తి జోడించి ఆంధ్రులికి గర్వకారణం, గౌరవకారణం అయిన తెనుగుల ఆడబిడ్డ. కవాతు నేర్చి, ఖడ్గం చేతబట్టి, గుర్రపుస్వారీచేసి, ప్రథమ భారతీయ స్వతంత్ర సమరం నడిపిన ఝాన్సీ లక్ష్మీబాయిని ప్రసాదించిన మహారాష్ట్రుల కోడలు. పుట్టినింటికీ మెట్టినింటికీ కీర్తి తెచ్చిన, తెస్తున్న భారతీయ మహిళామణి.

ఇంత ఉన్నతస్థాయికి వెళ్ళడానికి దుర్గాబాయి దగ్గిరున్న కిటుకేమిటి? కీలకమేమిటి? అది అర్థంచేసుకుంటే స్త్రీలకే కాదు పురుషులికి కూడా జీవితరహస్యం బోధపడుతుంది. భారతదేశాన్ని పరిపాలించేది నెహ్రూ మంత్రివర్గం. వారికి సలహాలిచ్చేది ప్లానింగ్ కమిషను. కమిషనుకే సలహాలిచ్చేది మరో జాతీయ మహాసంఘం. దానికి కార్యదర్శి దుర్గాబాయి. మంత్రివర్గానికి మంత్రాంగం చెప్పే మహాస్థానం. కనీసం అర శతాబ్దం దాటితేనే గాని గణనకిరాని రోజులివి. వర్తమాన రాజకీయ సంప్రదాయాల ప్రకారం తానున్న పదవికి దుర్గాబాయికి వయస్సు చాలదు. వెనకటికి ఈజిప్టురాణీ క్లియోపాట్రాలాగ అందర్నీ ముగ్ధుల్నిచేసే అతిలోక సౌందర్యవతి అనడానికి వీలులేదు.

శ్రీ కపిల కాశీపతి

పెదవులికి రంగైనా వెయ్యదు. చేతులో రంగురంగుల సంచీఅయినా పట్టుకోదు. పుట్టిసామాన్యపు, సాదా దేశవాళీమనిషి. ఆవిడలో వున్న ఘనత ఆవిడే. వ్యక్తుల గొప్పతనానికి కారణం అవకాశాలంటారు. నిజంగా గొప్పవాళ్లు ఆ అవకాశాలు కల్పించుకుంటారు. అల్లాగే దుర్గాబాయి కూడా ప్రథమ అవకాశం కల్పించుకుంది. తర్వాత అవే అవతరించాయి. కానైతే వాటిని సద్వినియోగం చేసుకుంది. అర్హతలేని బహుమతులూ, బిరుదులూ ఆవిడ కందలేదు. అందిన వాటికి సంపూర్ణమైన యోగ్యతవుంది. అన్నీ సమర్థించుకుంది. ఆవిడికి అందిన అవకాశాలు కొద్దిమంది పురుషులికి మాత్రం లభించినవి. మరే స్త్రీకీ దొరకలేదు. ఇన్ని విధాలుగా దేశసేవచేసే భాగ్యం కలిగిన వ్యక్తు లరుదు. జాతీయ స్వాతంత్ర్య సమరం తర్వాత, మన దేశంలో జరిగిన గొప్ప విషయాలు రెండే రెండు. ఒకటి రాజ్యాంగవిధానం తయారు చెయ్యడం; రెండు ప్రథమ పంచవర్ష ప్రణాళిక రూపొందించడం. దుర్గాబాయి స్వాతంత్ర్య సమరంలో ప్రథమ పంక్తిలో నుంచున్న వీరవనిత. కన్స్టిట్యూయంట్ అసెంబ్లీ సభ్యురాలుగా, ఆసభ ఉపసంఘాలలో ప్రముఖురాలుగా, ప్రపంచంలోకల్లా ఉదారమైన ప్రజాప్రభుత్వ రాజ్యాంగ విధానం తయారు చెయ్యడంలో మంచి పనిచేసింది. ప్రజాసభ కధ్యక్షత వహించి మహామంత్రుల్ని మందలించింది. ప్లానింగ్ కమిషన్‌లో ఏకైక స్త్రీ సభ్యురాలుగా, ఏ ప్రజాప్రభుత్వానికీ లేని నిర్మాణ పథకం తయారు చెయ్యడంలో పేరు సంపాదించింది. ఆవిడ జీవితక్రమమే ఒక నిర్మాణపథకం. దానికో లక్ష్యం, వో తీరూ వో తిన్ననా వున్నాయి. అది నేల విడిచిన సాము కాదు; ఊహాగానం కాదు. ఇహం పరం, పుణ్యం పురుషార్థం సమపాళ్లగా సంధించిన సత్పథం.

పంతొమ్మిది వందల పదో సంవత్సరంలో మధ్వ బ్రాహ్మణులైన బెన్నూరి వారికుటుంబంలో జననం. తండ్రి రామారావు పంతులు కాకినాడ సబుకోర్టు సిరస్తాదారు. తల్లి కృష్ణవేణమ్మ సమర్థురాలు. ఆ కుటుంబాని [illegible], మూల విరాట్. ఆదంపతులికి దుర్గాబాయి ప్రథమసంతానం. తర్వాత నారాయణరావు. వెనకగావుండి అప్పగారి [illegible] చేసిన సహాయం సౌభ్రాతృత్వంలో వో పునీతమైన ఘట్టం.

ఆనాడు తెనుగు సీమలో కాకినాడ నగరానికో ప్రత్యేకత వుండేది. బందరు వుప్పెనతర్వాతా, విశాఖపట్టణానికి పూర్వం, కాకినాడ తెనుగుకోస్తాకి ముఖ్యమైన రేవు పట్టణం, వాణిజ్య కేంద్రం. వీరుడు వీరేశలింగం సంఘసంస్కరణోద్యమానికి రాజమంద్రీతరువాత ముఖ్యకేంద్రం. ఆచార్యుడు వెంకటరత్నం నాయుడి బోధలతో విశిష్టమైన విద్యానగరం. పిఠాపురం మహారాజుల సాంఘిక సేవాసక్తికీ, ఔదార్యానికీ నిర్మాణస్థానం. యావజ్జీవం స్త్రీ ఉద్యమంకోసం పాటుబడ్డవాడు వీరేశలింగం. దానికోసం అరవైయ్యేళ్ళు గొంతెత్తి అరిచినాడు. నూట ఎనిమిది గ్రంథాలు వ్రాసినాడు. ఆ అవతార పురుషుడి ఆశయాలకి విజయచిహ్నం దుర్గాబాయి. ఆంధ్రదేశస్థుడైన ముత్యాలవారి బాలుడు వంగ దేశస్థురాలైన చట్టోపాధ్యాయుల బాలిక సరోజినీదేవిని చేబట్టినప్పుడు సంతోషంగా పౌరోహిత్యం వహించి, కొత్త కోడల్నీ కొడుకునీ ఆశీర్వదించినాడు. ఈనాడు అంత సంతోషంతోనూ, మహారాష్ట్రీనించి వచ్చిన ఈ కొత్త

అల్లుణ్ణి ఆహ్వానించి, దంపతుల్ని ఆశీర్వదించి ఆంధ్రుల ఆడబిడ్డని అత్తింటికి పంపించి వుండేవాడు. ఆయన పందొమ్మిది వందల పందొమ్మిదిలోనే వెళ్ళిపోయాడు. ఆయన్ని సందర్శించడానికి గాని, ఆయన సందేశం అవగాహన చేసుకోడానికి గాని, అప్పటికి దుర్గాబాయి చిన్నది. కాని వీరే కళింగ వాతావరణం కాకినాడ రాజమండ్రీలలో ముమ్మరంగా వున్న రోజులవి. ఆ స్పర్శ ఈవిడికి లేదనడానికి వీలులేదు.

దుర్గాబాయికి ఇంట్లోనే, పండితుల్ని పెట్టి సంస్కృతం, తెనుగూ చెప్పించారు. ఓ మౌల్వీ ఉర్దూ కూడా చెప్పాడు. సంగీతం ఆవిడ అభిమాన విద్య. ఈమధ్య చీనాదేశం వెళ్ళినప్పుడు వో సభలో భారత జాతీయ గీతం పాడమన్నారు. సాధన చేసిన శారీరం కనక వెంటనే పాడింది, దుర్గాబాయి. మధ్వులందరికివలెనే వెన్నూరివారు కూడా భోజనప్రియులు. ఆడవారికి పంచభక్ష్య పరమాన్నాలు మడులతో చెయ్యడం వచ్చితీరాలి. ఆ పాకశాస్త్రంలో తల్లిదగ్గర ఆరితేరింది పిల్ల. కొత్త ఢిల్లీలో రాష్ట్రపతి భవనంలో సమర్థులైన పురుషులకంటె చాకచక్యంతో ఆఫీసు నడిపే దుర్గాబాయి, అవలీలగా వో సంతర్పణకి వంట చేసి వడ్డించగలదు.

ఆనాటి రివాజు ప్రకారం పిల్లకి తొమ్మిదోయేట వివాహం చేశారు. అత్తవారు సుమ్మిడిదలవారు. జమీందారులు. వరుడు వెంకటసుబ్బారావు. వివాహానంతరం కొద్ది సంవత్సరాలకే పిల్ల అత్తవారింటికి వెళ్ళింది. ప్రయాణం తలుపులు మూసిన సవారిలో. చేతినిండా నవుకర్లూ చాకర్లూ వున్నారు. పెట్టుకునేందుకు ఏడు వారాల నగలూ వున్నవి. కట్టుకునేందుకు కావిడి పెట్టె నిండా పట్టు చీరలు వున్నవి. సామాన్య స్త్రీకి అంతకంటె ఏం కావాలి? కాని దుర్గాబాయి సామాన్యస్త్రీ కాదు. జమీందార్ల ఏడు మండువాల దేవిడీలలో ఆ ప్రాణి ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. భర్త నాటివాడు. భార్య నేటిది. సుబ్బారావుకి భార్యమీద పంచప్రాణాలు. పల్లెత్తుమాట అని యెరగడు. ఆవిడికి ఆయనంటే గౌరవం. కాని అడుగంటిపోయే పురాణ జీవిత సంప్రదాయం ఒకరిది; వికసించే నూతన జీవితాశయం ఒకరిది. సంఘసేవాసక్తితో ఉడికి ఉవ్విళ్లూరుతున్న అగ్ని పర్వతంలాటి ప్రకృతి ఈవిడిది. సర్వసామాన్యమైన జమీందార్లవలె, సర్వ భోగాలతో కడుపులో చల్ల కదలకుండా శాంతిజీవనం గడుపుదామన్న ప్రకృతి ఆయనది. ఈ వైవిధ్యంలో సామరస్యం కుదరడం వీలు కాదన్న సంగతి వారిద్దరూ గుర్తించారు. మామగారి అంగీకారంమీద, భర్త అనుమతిమీద, దుర్గాబాయి కాకినాడ వచ్చి తన విద్యాసంస్థ స్థాపించి కాకినాడ కాంగ్రెసు నాటికే ఆంధ్రదేశంలో పేరు సంపాదించింది. ఆ సంస్థ ఖర్చుకి, ఆ విడభాగం ఆస్తి అత్తవారే పంచి యిచ్చారు. తన నవీన పద్ధతికి వారి నందర్ని వొప్పించడంలోనే వుంది దుర్గాబాయి చాకచక్యం. ఎవర్నీ విడనాడలేదు. అందర్నీ కలుపుకొచ్చింది. సుబ్బారావుపోయేవరకూ అతని యోగక్షేమాలు తాను చూస్తూనే వుంది. జబ్బుచేస్తే, అంత చిన్నతనంలో తాను స్వయంగా మద్రాసు తీసుకెళ్ళి మందిప్పించి నయం చేయించింది. తన కార్యక్రమంలో ఆయనకి సంసారసౌఖ్యం వుండదని, ప్రోద్బలంచేసి మళ్ళీ పెళ్ళి చేయించింది. ఆయన తదనంతరం ఆ చెల్లెల్ని చేరదీసి చదువు చెప్పించి మహిళాసభలో పెట్టి కడుపులో దాచుకుంది తీవ్రమైన సాంఘిక సంస్కార వాతావరణంలో పుట్టి, అంతకంటే తీవ్రమైన రాజకీయ స్వాతంత్ర్యోద్యమంలో పెరిగింది. ఆ వుద్యమాలు రెండూ ఆమె జీవితంలో జీర్ణమైపోయినవి.

జాతీయ సమరంలో ఆవిడ ఎప్పుడూ ప్రథమ పంక్తిలోనే వుంది. పందొమ్మిది వందల ముప్ఫైయ్యో సంవత్సరం సత్యాగ్రహోద్యమం నాటికి దుర్గాబాయి రంగం ఆంధ్రదేశపు సరిహద్దులు దాటిపోయినది. ఆవిడ మద్రాసునగరానికి నియంతగా ఎన్నుకోబడినది. మద్రాసు బీచిలో త్రివర్ణపతాకం చేతులోపట్టుకొని తండోపతండాలుగా వచ్చిన ప్రజాసమూహాల్ని, తన వుపన్యాస పరంపరలతో వుద్రేకపరుస్తూ లూగించేది. ఈ ఝంఝామారుతాన్ని ఏం చెయ్యడానికీ పోలీసువారికి తోచలేదు. ఇరవైరోజులు చెలరేగినా చేతులు ముడుచుకుని కూచున్నారు. అరెస్టుచేస్తే బంగాళా ఖాతమే అంటుకుపోతుందని భయపడ్డారు. ఏదో పనిమీద మద్రాసు విడిచివెళ్ళినఅదను కనిపెట్టి పట్టుకున్నారు. ఆవిడ కది రెండో నిర్బంధం. ఏకాంత కఠినశిక్ష వేశారు. మధుర జైలులో బంధించారు. అది చాలక పక్క గదిలో వురిశిక్షకి వెళ్ళే నేరస్థుల్ని పెట్టారు. రాత్రింబగళ్లు ఆ నిర్భాగ్యుల ఆర్తనాదాలతో జైలుకప్పు ఎగిరిపోయేది. నిద్రాహారాలు లేక దుర్గాబాయి అవి వినలేక కుమిలిపోయేది. ఈ విచిత్ర శిక్షతో ఆవిడ మనస్సు ఖేదపడి, శరీర దౌర్బల్యం కలిగింది. ఖైదు ఖానాలోంచి బయటపడేసరికి దుర్గాబాయి వెనకటి మనిషి కాదు. ముందుకి మల్లే రాజకీయాలలో తిరగకూడదన్నారు డాక్టర్లు. ఆవిడ కది చేదు మందు. అయినా తప్పలేదు. పథకం మార్చింది. సరే, ఇంగ్లీషు చదువు ప్రారంభిస్తానంది. ప్రయివేటుగా చదివి కాశీ హిందూవిశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషను పరీక్షలో విజయం పొందింది. ఆనాటి కావిడకి ఇరవై నాలుగేళ్ళు. అంత ఆలస్యంగా ప్రారంభించి విద్యలో అంత పైకొచ్చినవారరుదు. కిడాంబి రామానుజాచార్యులవారు ఇరవై అయిదోయేట ఇంగ్లీషు చదువు ప్రారంభించారని వినికిడి. ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో డాక్టరుబిరుదు పొందినవారిలో ఆయన ప్రప్రథములు. అల్లాగే దుర్గాబాయి కూడా ఆలస్యంగా ప్రారంభించినా, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు బి. ఏ. ఆనర్సు పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. తర్వాత పరిశోధన చేసి ఎం. ఏ. డిగ్రీ పొందింది. ఆరోగ్యం ఇంకా సరిపడలేదు. రాజకీయాలింకా కూడదంటూనే వున్నారు. కుటుంబీకులు కోర్టు వ్యవహారాలలో తిరిగినవారు. ఆ వాతావరణం కూడా తత్వంలో ఘనీభవించింది. తాను న్యాయవాది ఎందుకు కాకూడదనుకున్నది. మకాం మద్రాసుకి మారింది. బి. ఎల్. పరీక్షలో జయం పొందింది. రాఘవరావుగారి ఆఫీసులో అప్రెంటిసుగా చేరి, మద్రాసు హైకోర్టు వకీలుగా ముందుకొచ్చింది. కొన్ని సంస్థలు ఆమెని సలహాదారుగా నియమించుకున్నాయి.

న్యాయవాది కాకపూర్వం దుర్గాబాయి ఇతర వైజ్ఞానిక విషయాలలో కూడా కొంత ప్రతిభ ప్రకటించింది. కథలూ వ్యాసాలూ వ్రాసింది. నాటకాలలో భూమికలు ధరించి తన చాకచక్యం చాటింది. ఫిల్ము కంపెనీలు కొత్తగా పైకొస్తున్న రోజులవి. ఓ ఫిల్ముకంపెనీ సంస్థాపనలో కూడా చాలా సహాయం చేసి వేషాలు వెయ్యడానికి కూడా ఇష్టపడింది. వూరికే వుండడం ఆవిడ స్వభావం కాదు. మైలాపూరులో

(52-వ పేజీ చూడండి)

అపురూపసుందరి

"ఇదేనా గ్రామం: ఇదేనా గ్రామం." అని అనుకుంటూ వచ్చిన శ్రీమన్నారాయణసింగు "ఇదేనా గ్రామం? ఇదేనా గ్రామం?" అని ప్రతీ గ్రామాన్ని అపహాస్యంగా అడుగుతూ, ఒకచోట "స్టాండ్" దగ్గర "బస్సు" దిగాడు. అక్కడ దిగీదిగడంలో అతనికి ఒక బండిగాని, ఒక వాహనంగాని, దొరకలేదు. 'బస్సు' రయిని కొండల్లోకి కనబడే రోడ్డంట ముఖమాయమైంది. అతడు అక్కడ, తానుండినచోట కొంచెము పరిభ్రమించినవాడై, చుట్టూ చూడసాగేడు. అదంతా, అతుకుల బొంతలాగుంటే, ఒకానొక తాత్కాలిక స్థలముగా కనుపించెను. అయితే ప్రపంచమంత తాత్కాలికం కాదాయని అతను ఒక విధముగా తర్కవాదములో పడి, గెంతు నియమములో, అగీ జగత్తేనని ఒకానొక సిద్ధాంతానకు వచ్చెను.

ఒక వంక, సినీమా నటుల యొక్క బొమ్మలను తోరణాలగా కట్టి కనుపింపజేస్తూ, కొనువారి నాకర్షించుకొన్న - సోడా దుకాణాలనుజూచినాడు. వేరొకవంక ఒక మిఠాయి పకోడీ ఇటువంటి తినుబండారములమ్మే దుకాణములను చూచినాడు. మఱియొక వంక పప్పుగుచ్ఛ పరిజనంతో సహా కొనవచ్చే కాఫీహోటల్ చూచినాడు. అన్నింటినీ మించి, తనను పిలుస్తూవుందా అన్నట్టు గణగణమంటూ గంటలు మోగించే అద్దెసైకిళ్ల ఆవరణాన్ని కనుగొన్నాడు. కొందరాడవాళ్ళు చెఱువుకు వెళ్లి నీళ్ళు తెస్తూవుంటే కొందఱు సోమరి మగవాండ్రు సిల్కులాల్చీలతో, గ్లాస్కో మల్లు పంచెలతో కనబడజొచ్చారు. కుటుంబీనులను చూచినప్పుడు తొల్త గ్రామమనాలని అతనికి తోచినా ఆ యొక్క సుందరం గ్రామంలా కనపడక తుదకు "ఏ యూరిది?" అని ఎవరిని అడగకుండానే అటునించి ఇటు, ఇటునించి అటు, పర్యటనం గావించాడు. పేరడిగి నవ్వులపాలవుతానేమోనని అతగాడి సంకోచం.

సాయంకాలం ఆరు గంటలైంది. దిగు ఆకాశము పడమటితట్టు బంగారపు ములామా చేసినట్లుగా వుండి నీడలు చూపించని ఏకకాంతి గొల్పుతూంది. చెట్లు తమంత తామే ఆ వెలుగు ముందు నలుపు లెక్కపోయినట్లు కనబడ్డాయి. ఒక వుంతకు దారితీసి ఇసుకమార్గము దుమ్మురేగుతూ కొనవచ్చింది. మరీ నల్లగా కనబడే చెట్ల సందునే మరీ నల్లగా ఒక లారీ ఆలా పడమటి కాంతిలోనికి వెళ్లి పోతూ వున్నట్టుగా తోస్తూ, లోని రాళ్లను, రాళ్ళమీద కూర్చున్న కూలీజనుల్ని అందర్నీ అన్నీ అన్ని సిలూటిరేఖలుగా మార్చివేసింది.

నాడు సూర్యుడు క్రుంకే లయస్థితి ఎందుకు చూడలేకపోతినా అని, ఏదో తప్పిపోయిన దృష్టి కలవానిలా శ్రీమన్నారాయణసింగు అయిపోయాడు కాని తొల్త, ఫిదప వెలుతురుముందు కొనవచ్చిన సిలూటీ ఛాయలు, జీవించియున్న మనుష్యులయొక్కయు, జీవించియున్న చెట్లయొక్కయు చైతన్యముగా సాక్షాత్కరించడంవల్ల, నిజమైన పల్లెటి గ్రామమేదో అటువైపు ఉన్నదని ఒక నమ్మకము గొన్నాడు. ఆ నమ్మకముతో రోడ్డుమీద కనిపించిన ఒక మనిషిని అడిగాడు "ఆ లారీ వెడుతూన్నది గ్రామానికి దారా?" అని.

ఆ మనిషి "అవునండీ! లారీ కాబట్టి చీకటి పడకుండా చేరుకోగలదు. మీరు నడకమీద పోయేవారు ఎలా చేరుకోగలరు? ఈ రాత్రికి ఇక్కడెక్కడైనా విశ్రమించి మఱి తెల్లవారి వెళ్లడ ముత్తమము." అన్నాడు. "విశ్రాంతి?—రోడ్డుమీదున్న ఇళ్ళల్లో బసచేసి పొందే విశ్రాంతి ఎంత? ఎక్కడ?-" అని అనుకొన్నవాడై శ్రీమన్నారాయణసింగు ప్రక్కకు చూచాడు. ఒక కిరాణాకొట్టు కనబడింది. ఆకొట్టుమీద ఒక కోమటక్క కూర్చొని సరుకులు అమ్ముతూవుంది. ఆ అమ్మ అక్కడ కానుపించిన జనులందరికన్నా స్థావరతరంగా కనిపించింది. ఆమె నడిగితే కొంతవఱకు నిజమైన సమాచారము దొఱకగలదని ఆశించాడు.

అతగాని ఆ ఆశలో పొరకులు వేసుకో దగ్గ ప్రశ్న ఒకటికూడా ఉంది. ఎందుకో నారాయణసింగు "ఆ ప్రక్క నొక గ్రామము వుందా?" అని అడుగుతూ వున్నాడు? ఎందుకు ఆ గ్రామం చేరుకోడానికి అతగాడు తహతహపడుతున్నాడు? ఇంతకూ గ్రామం పేరు ఏమి? అక్కడ అతగానికి బంధువులున్నారా? మిత్రులున్నారా? ఎవరూ లేకుండానే ఏమీ కాకుండానే ఊరకే పిచ్చివానిలా, లేకపోతే కర్మననుసరించి అలా పోవాలనుకొంటూ వున్నాడా చీకట్లో పడి?

శ్రీమన్నారాయణసింగు కోమటక్క కిరాణాకొట్టువద్దకు వెళ్లేటప్పటికి, అక్కడికొక చిన్నపిల్ల ఎనిమిది తొమ్మిదేళ్లది, సరిగా వొంటినిండా పరికిణీ గాని పైగోక్కా గాని లేకుండానే నిరుపేదల పిల్లలా కనిపించేది కాని "అమ్మా! మా అమ్మ ఒక కానీ పసుపు ఒక కానీ మినప పప్పు, తెమ్మనమంది. ఇదిగో డబ్బులు!" అని ఇచ్చింది. కోమటక్క కొండెక్కినంత సంతోషంగా ఆ రెండు డబ్బులు పుచ్చుకుని, "దీపం పెట్టాక నీదే బోణి" అని రెండు సరుకులు రెండు చిన్న చిన్న పొట్లాలుగా కట్టి యిచ్చివేస్తూ "పిల్లా! ఇంత చీకటి పడ్డాక వచ్చావు! నీకు భయం వేయదు తిరుగ వెళ్ళ...?" అని అడిగింది. "నీ దీపం కనబడుతున్నంతసేపూ నాకేం భయం? రఘుపతి రాఘవ రాజారాం! పతితపావన సీతారాం!" అని తొల్త లారీ వెళ్లిన వుంతమార్గాన్ని పరుగుచ్చుకుంది. పిల్ల కాదు! లేడిపిల్ల!

శ్రీమన్నారాయణసింగు మఱి ఎవర్నీ ఏమీ అడుగకుండా, ఆ పిల్ల నిర్గమించే మార్గాన్నే తానున్నూ నడువసాగాడు, భయం లేకుండా చీకట్లో సింహంలా! పిల్ల పరుగు అతగాడి నడక సమానమా అన్నట్టున్నాయి.

రోడ్డుమీదను నడిచే సైకిళ్ల గంటలు, నిలబడ్డ రహదారి జనం కబుర్లు, మఱేన్నీ బంయిని కూసి రయిని విడిచే బస్సులు, కార్లు, ఒక టేమిటి, ఎన్ని నాగరీకపు జంత్ర తంత్రయుక్తములైన వాహనాలు

ఆత్మ ప్రబోధము



"ఇదివరలో నాపే రెఱుగవు. ఇప్పుడు చెప్తాను. జ్ఞాపకం వుంచుకో అపురూప సుందరి..."

ప్రజలతో పోతూవున్నా, అటువైపు అతగాడు చూడలేదు.

"అదేదో వూరుంది అని అనుకొంటూ వున్నాడులాగుంది ఈ పురుషుడు!" "ఉన్నా ఈ అర్ధరాత్రి ఆతిథ్య మెవ్వరిస్తారు?" "మనకే తెలియని దారి ఇతగాడికెలా తెలిసేని?" అని వివిధరీతులగా, వివేకపరుల మని తమకు తా మెంచుకునే వారంతా, అతని తెన్నునే వేళాకోళంగా చెప్పుకోసాగారు.

నిజంగా ఏ పటంమీద గాని ఆ మార్గం ఆ స్థలం గుర్తించబడియుండదు. ఆ లారీకి ఆ జనానికే తెలుసు ఆ గమ్యస్థానం.

ఆ స్థలముయొక్క గోప్యం అంతా ఇక్కడ వుంది. కూలీలందరూ కలిసి ఒక గుడి ఒక మారుమూల తాము చక్కగా కట్టి దానికి చుట్టూ వీధులు దీర్చి ఒక ఊరు నిర్మాణము చేయాలి అని సంకల్పించుకొన్నారు. అయితే ఒక దేవాలయం నిర్మించే ముందు దేవుడు తెలవకుండా వున్నన్నాళ్ళూ దురాక్రమణ చేరమని సర్కారువారు తోసి త్రవ్వి పారవేయడానికి జంకరు. దేవుడు తెలిపోతా ఆ గుడిని పడగొట్టడానికుద్యోగస్థులు జంకుతారు. అందుచేత సర్వసాధారణంగా తొల్త దేవుడు వెలిసిన తరువాతనే, అందు విషయమై కొంత ప్రచారం జరిపి, మరీగుడి కట్ట ప్రారంభిస్తారు. ఇక్కడ కూలీల ఎత్తుగడ అదికాదు. కడుతూవుంటే దేవుడు వెలవకపోతాడా అనేవారి యిది. అది కొంత భక్తిచేత కొంతభయంచేత కలిగిందై యుండవచ్చు. ఆ కారణంగా ఒక నిగూఢమైన స్థలం ఎన్నుకున్నారు. మరి నిర్మాణం

రేకపల్లి సోమప్పకవి విశాఖమండలములో తునివద్ద నున్న సత్యవరము జమీందారుల ఆస్థానకవి. అడిదము సూరకవికి ప్రతిస్పర్థి.

"అప్పా! రేకపలీసో
మప్పా! విబుధాళి పాళి యమృతపులప్పా!
ఒప్పాలు నీకపితలు వె
న్నప్పాలకు సాటివచ్చు నౌభళి! రుచులన్"

అని పొగడ్త గన్నవాడు. ఇతడు 90 యేండ్లకు పైగా జీవించినాడని ప్రసిద్ధి. ఇతనికి మూడో వివాహము డెబ్బదియేండ్ల వయస్సులో జరిగినది. ఆస్థాన కవి యగుటచేతను, వయస్సులో పెద్దవాడగుటచేతను సోమప్పకవి అంతఃపురములోనికి యథేచ్ఛగా వెళ్లేవాడు. తన క్రొత్తభార్యను తీసికొని రాణీగారి వద్దకు వెళ్ళగా, రాణీగారు: తాతగారూ! పెండ్లికూతురు పేరు చెప్పండి. అని అడిగినారు. పెండ్లికూతురు పేరు 'పాపమ్మ' అగుటచేత సోమప్పశాస్త్రి, "పేరు చెబితే పాపమా" అని యుక్తిగా చెప్పినాడు. ఆ తరువాత రాణీగారు క్రొత్త పెండ్లికూతురుచేత వక్కాగ్రపుచెక్కలు గుండ చేయకుండా పెట్టి, తమలపాకులు చుట్టించి సోమప్పశాస్త్రి కిప్పించినారు. అప్పటికి పెండ్లి కొమారునికి పండ్లూడి పోయినవి. బోసినోటి వాడగుటచేత నాతడు నమలలేక తటపటాయించుచుండగా రాణీగారు: "తాతగారూ! నూరిప్పింతుమా" అని పరిహాసంతో అడిగినారు. తత్ క్షణమే సోమప్పశాస్త్రి "అమ్మా! తమరు నూరిప్పిస్తే మిగత పదహారు, ఎవరిప్పిస్తారమ్మా!" అని చమత్కారముగా జబాబిచ్చినాడట. రాణీగారును విద్యావతులగుటచేత జబాబునందలి చమత్కారము గ్రహించి బహుమతులొసగిరి. మొదటిదానికి నూరి + యిప్పించుట అని యర్థము. రెండవదానికి నూరు + యిప్పించుట - అనగా నూరురూపాయలిచ్చుట యనియర్థము.

రేకపల్లి - గోదావరీమండలమున భద్రాచలము తాలూకాలో నున్నది. దీని మొదటిపేరు ఱెక్కపల్లి. రావణుఁడు సీత నెత్తుకుని పోవుచుండగా జటాయువు అడ్డగింపగా నాతని ఱెక్కలను ఖండించినస్థలమని ప్రతీతి. ఱెక్కపల్లి క్రమముగా రేకపల్లి అయినది.

సేకరణ:- శ్రీ నిడదవోలు వేంకటరావు

అపురూప సుందరి ఆత్మప్రబోధం

కూడా రహస్యంగా రాత్రిళ్లు జరగాలన్నారు. గుడికి రాయి కావాలన్నారు. తాము తవ్వే క్వారీనిండా రాయే అని తెలుసుకున్నారు. ఎన్ని గుళ్లైనా కట్టవచ్చు ననుకొన్నారు. అందుచేత ఆ కూలీలు పగలల్లా క్వారీలో పనికి కుదిరి, సాయంత్రంవరకు రాయి త్రవ్వి, లారీలమీద రేవులకు చేర్చి, ఆఖరు లారీమీద మాత్రం, కంట్రాక్టరుకు తెలియకుండా, కూలీలు డ్రైవరు లాలోచీఅయి, రోజూ సంజపొద్దుకు కొంతకొంత రాయి ఈ రహస్యస్థలమున పేర్చడము కొంతకాలంనుంచి రివాజు అయింది. కూలీలున్ను అక్కడే పిల్లాజెల్లాతో తమ నివాసాలు ఏర్పాటు గావించుకున్నారు.

లారీడ్రైవరు తనకేమీ అక్కర్లేదంటూనే చాటుచాటుగా బాటను తిరుగరావడంలో ఒకచోట దొంగసారా కలవాటుపడి, తన గుట్టు ఇతరులకు బయటపెట్టకుండా వెళ్ళిపోయేవాడు. ప్రజలది సహజంగా లారీ పోయేమార్గమేనని, ఆ చెట్లల్లో కూలీల యొక్క నివాసాలకై ఆ రాయి చేరుస్తూ వున్నారని ఒక ప్రతీతి బయలుదేరింది. మరి కూలీలున్ను తమతమ కుటీరాలకు ముంగురు లెగరేసుకుంటూ త్వరగా చేరుకు తమ ఆలుబిడ్డల కానందం చేకూర్చవచ్చునని హెచ్చరిల్లుతూ వుండేవారు. ఒక్కొక్క కూలివాడొక్కొక్క కుటుంబం పెట్టుకొని ఉదరపోషణ గావించుకుంటూ వుండేవాడు.

ఇప్పుడు పైని చెప్పబడిన దొంగసారా అమ్మేచోటు, ఆ కూలీలు నివసించే కుటీరాలకు, ఈ రాజమార్గానికి మధ్యగా చెట్లల్లో వుంది. కొంచెం వంపుతిరిగితే కనిపిస్తూంది. కూలీలకు ఈ దొంగసారా వృత్తాంతము ఎంతమాత్రమున్ను తెలియదు. తిన్నగా లారీ తమ కుటీరాలమధ్యకు చేరుకోవడంతోనే అదేదో వింత సరుకుగా రాయిని క్రిందకు విసరి, లారీ ఖాళీఅయిన వెంటనే తాము దిగిపోయి లారీని కూలీలు పంపేసేస్తారు. అదీ పరిపాటి. మళ్ళీ పరున్నది పొటుగా పరుండి వారు లేవడం అనేది తెల్లారినట్లే. క్వారీకంటూ నడచిపోతారు చద్దివణ్ణం తిని కొందరు, మూట కట్టుకొని కొందరు, ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ, - కొందఱు రాత్రి తమకు వచ్చిన కలల్నివు ఏకరు పెడుతూ, మఱికొందరు తామువిన్న కథలను పూసగ్రుచ్చినట్లు చెప్పేరు.

"మరి దేవుడు తెలిపేదాకా మనం వూరుకుంటే గుడికట్టినట్టే?" అని ఒకడంటే, "తెలిసే దేవుడు నరబలి కోరి వెలిసేడు, ఊరికే వెలుస్తాడురా?" అని ఒకొక్క రోజున ఉదయం వారిలోవారికి తర్కింపు జరిగేది. ఆ తర్కింపప్పుడు, వప్పజారి వట్టు జారేవారు అందరూను. ఒక్కడూ ముందుకువచ్చేవాడు కాదు; తాను బలి అవుతానని అనేవాడు కాడు. పోనీ కట్టెయ్యవచ్చునని అనేవారు కారు తతిమ్మావారు. ఎవ్వరికీ గోచరింపు కాదు—ఏలాంటి దేవుడు వెలిసేడో ఎవరికని తాము గుడి కట్టేరో, ఎందుకని కట్టేరో — అలా అని ఉద్యమాన్ని విరమించేవారు కారు, రాయి మొత్తం ఒక కొండఎత్తు అంత కనబడ్డంతోనే. — నరబలి అన్నది బహిరంగంగా జరిపారా ఎవరిని బలి యిస్తారు? అక్కడున్న వారందఱు కళ్లు దెఱచుకు, ఏ నిమేషమూ కావలివున్నవాళ్లల్లే, ఒకళ్లొకళ్లకు కవిపించేవారు. ఇక మఱి బాగా ఆలోచిస్తే ఈ నరబలి అన్నది దైవికంగా దానం

తిటువి తమలో తమకే తెలియకుండగా జర గాలి

శ్రీమన్నారాయణ సింగు ఏ రాత్రి అయితే చీకట్లో సింహంలా నడుస్తూ వున్నాడో ఆ రాత్రి అప్పటికప్పుడే తిరుగ వచ్చేస్తూ వుంది ఉత్త లారీ, లారీ డ్రైవరు తాగివుండి లైట్లు ఆర్పే శాడో, అసలు ఆ లారీకి లైట్లే లేవో, అతి వేగంగా, వంకర టింకరలు పోతూ, ప్రతీ చెట్టూ భయపడేలా వచ్చేస్తూ వుంది. మరొక్క నిమిషం అలా కడిచని వుంటే, శ్రీమన్నారాయణసింగుకు ముందలి లేడిలా పరుగెత్తే చిన్నపిల్ల ఆ లారీ క్రింద పడి హతమైపోవలసింది కాని చటుక్కున పిల్లను ప్రక్కకు త్రోసి శ్రీమన్నారాయణ సింగు ప్రమాదవశాత్ లారీ చక్రం క్రింద పడి తానే నలిగిపోయాడు. పిల్ల అక్కడ నిలబడలేదు. లారీ మరి కనబడలేదు. సమస్తం అయోమయాంధకారంగా వుండి పోయింది వొక క్షణం చక్రం క్రింద పడ్డ మానవుని ఉసురు లెటు పోయినాయో చూచేందుకు చుక్క కూడా ఆ గడియప్పుడు కళ్లు మూసికొన్న దనవచ్చును "మినుకు" "మినుకు" మధ్యను అంతర ముండదూ? ఆ సమయాన్నే జరిగివుంటుంది ఆ స్వర్గారోహణం!

పిల్ల వెళ్ళివెళ్ళడంలో తల్లితో "అమ్మా! ఎవరో నన్ను ప్రక్కకు త్రోసినట్లయిందే ఈప్రొద్దు లేకుంటే లారీక్రింద పడిపోయే దాన్ని" అని అంది. తల్లి "అమ్మా! నిన్నింత చీకటపడ్డాక పంపడం నాదే తప్పు! లారీ గాలే నిన్ను దూరంగా విసరి వుంటుంది. మా అమ్మ! బతికావు! పది వేలు! పట్టు కొచ్చావా? కానీ పసుపూ, కానీ మిన ప్పప్పూ?" అని అడిగింది. పొట్లాలు రెండూ అక్కడే పెట్టి "ఎందుకే ఇవి?" అని అడిగింది పిల్ల. తల్లి "ఎన్నడూ పోపు పొయ్యను నిండుకోరాదు" అంది అంటూ "లారీకి దీపా లేవ్వటే?" అని అడిగింది "దీపాలు లేవు దిబ్బద్దాలు లేవు లారీ నడిపించేవాడు ప్రతిరాత్రి మనింటికి వచ్చే వాడే కదే? ఈపొద్దు రాకుండా పోయినా డేమే?" - "ఏమోనమ్మా! వాడేం పాపం తలపోసి ఆ లా విఱ్ఱవీగిపోయినాడో! అయితే అది వాడి లారీయే అంటావా?"-

"ఆఁ అదే! కొమటక్క కొట్టునుండి ఆనే దీపంకాంతిలో నాకు తెలిసింది. ఆ లారీయేనే" అంది పిల్ల "ఏడిశావు! కోమ టక్క కొట్టెక్కడ? యీ లారీ నీకు దను లయింది ఎక్కడ? ఆ దీపం దానిమీద కంటా అనడం ఏమిటి? బెదరినట్టున్నావు" అని పిల్లకు దృష్టితీసి నిదురబుచ్చింది తల్లి.

కాని తల్లికి నిదురపడుతుందా? పిల్లకు పట్టేనేమో కాని.

తనదగ్గఱకు రోజూ వచ్చినట్టువచ్చి, ఆ రాత్రిపూట సారా పుచ్చుకోకుండా లారీ డ్రైవరు ఏ కారణంచేత వెళ్ళిపోయినాడో అనే జిజ్ఞాసలో పడుంది ఆమె.

అపురూప సుందరి ఆత్మప్రబోధం

ఆమెకు వుంటాయి ముప్ఫైఅయిదుఏళ్లు. ఛాయలోనే సువాసన, సువాసనలోనే ఛాయ అన్నట్టు ఒళ్ళంతా ఏకమాదిరి వన్నె, వన్నెకుతగ్గ పొంకం! అసలు ఆమె ఎన్నడూ రైకే తొడగని మనిషి అనుకుంటాను. మరిన్నీ చీరకట్టినా నడుందగ్గర నాభి నాభిలా కనిపించవలసిందే! చెప్పొస్తే వేదకాలపు స్త్రీ రత్నంలా ఒక ఉత్తరీయం, ఎగుబుజాన్ని వైచుకు, అవసరం వెంబడిని దిగువకుజారుస్తూ దాన్నే వోణీలా, దాన్నే పవిటలా కాపరుస్తూ, చెమటన్నది పోయనీయకుండా చేసికొంటూ పోసినా దానంతటదే ఎప్పటికప్పుడు చల్లటిగాలి కారిపోయేలా సంచరిస్తూ, స్వచ్ఛందం, అందం రెండూ ఒక్కుమ్మడి గుత్తకుచ్చుకుందా అన్నట్టు కానవచ్చేది చూచేవారికి. ఆమె పోసిన దొంగసారా తాగినవారు సోమరసం పుచ్చుకున్నంత ఆప్యాయంగానూ తీసుకు తీరవలసిందే! కూలివాండ్రు చెప్పుకునే నరబలిమాట ఆమె చెవిని అప్పుడప్పుడు వేస్తూ జాగ్రత్త అనేవాడు లారీ డ్రైవరు. "వాడే నాటిరాత్రి అంత దుర్వృత్తి తలపోసేడే?" అనే ఆలోచనలో పడింది. తనదగ్గరకు రాకుండా వాడా రాత్రి తిన్నగాపోవడం పదేపదే ఎంచి, "పిల్ల కుసింతలో తప్పుకోకపోతే చచ్చిపోవలసిందే గదా!" అని ఒకింత కుమిలి, కన్నీళ్ళు పిల్లపక్క తడిసేలా కార్చి ఎట్టకేలకు నిదురించింది.

* * *

తెల్లవారి కూలీలు తాము మరి పనిలోనికి వెళ్ళకుండగా, రాయిమీద రాయి రాయి మీద రాయి దారిలో అడ్డంగా చచ్చిపడి వున్న ఆ మనిషిమీద పడవేస్తూ, ఆ స్థలాన్ని కేవలం, మయ చమత్కారమా అని అనిపించేలా, ఒక కట్టడం లేవదీసి, పెద్ద గుడిలా కొందరికి, పెద్ద సమాధిలా కొందరికి కనబడే మోస్తరుగా చేసి హత్యను కప్పిపుచ్చివేశారు. మనిషి ఫలానా అని తెలిస్తేగా ఎవరైనా ఏరికోరి చేస్తేగా? - రిపోర్టు అనేది? - పోలీసు అనేది? - మరి లారీ మాత్రం ఆ వుంతకు రాలేదు, లారీ డ్రైవరున్నూ ఆదారి త్రొక్కలేదు.

దొంగసారా చేస్తూ ఆ చుట్టుపట్ల నివసిస్తూన్నదన్న అన్నులమిన్న మాత్రం మొదటి రాత్రివేళనే, పునాది నేలనుండి నెత్తురెగజిమ్మి, ఎఱ్ఱనిదుమ్ము లేగినట్టు కనిపెట్టింది. "ఏమిటా సిత్రం? గుడి కట్టడం ప్రారంభించినట్టులున్నారు చూచిరా పిల్లా!" అని పంపించింది తన కుమార్తెను. పిల్ల ఎప్పుడే పని పురమాయించినా లేడిపిల్లలా వెళ్ళి నెరవేర్చుకువచ్చే పిల్ల కాబట్టి, వెంటనే వెళ్ళి చూచి, తిరుగ వచ్చి, "అమ్మా! నన్ను పక్కకు తోసి, చక్రంక్రింద నన్ను పడకుండా తాను పడ్డ ఆయనలాగుందే! కూలివాళ్ళచేత ఇంకా రాళ్ళదెబ్బలు తింటూ కదలకుండా మెదలకుండా, రాళ్ళక్రింద కప్పడిపోతూ వున్నాడు."—అంది. "అదేనే గుడి కట్టడం! అలాగే కడతారు! మనం కూడా వెళ్ళి ఒక రాయి వేస్తే మనంకూడా పుణ్యం కొంచెం సంపాదించినవాళ్ళం అవుతాము" అని తల్లి జవాబు చెప్పింది. "అతనివల్ల నేను రక్షింపబడ్డాను. అతనిమీదనా నేను రాయి విసిరేది?" అంది పిల్ల. "నిన్ను రక్షించింది లారీ డ్రైవరు గాని, దారే పొయ్యే మార్గస్థుడు కాదు. పాంథుడు నిన్నెల్లా రక్షిస్తాడు? అతడు తన దారి తాను తెలిసికోలేక మహాంధకారాన్న దేవునకు బలి అయినాడు," అంది తల్లి.

అంటూ తల్లీ పిల్లా యిద్దఱూ కూడా ఆ గుడి కట్టే స్థలానికి చేరుకున్నారు. గుడి సగానికి సగమప్పుడే తయారయింది. తల్లి ఒక రాయి పనివాడికి అందిచ్చినది. పిల్ల అందివ్వలేకపోయింది. పిల్ల కళ్ళమ్మట బాష్పధార పడసాగింది. తల్లి ఆ వైపరీత్యం కనిపెట్టి పిల్ల నెత్తుకున్నదై కళ్లు తుడుస్తూ— "నీవు నాకు దక్కావు. నీవు లోకంలో నిల్చావు. ఇక నెవరుంటేం? ఎవరు పోతేం?" అని ఎవరూ వినకుండా ఓదారుస్తూ పిల్ల సమేతంగా వెళ్ళిపోయింది. "ఈ సంగతి కొట్టుకోమటక్కకన్నా చెప్పకూడదు సుమ్మీ" అని తన కూతురుతో నాటి తుదిమాటగా చెప్పి కూతురును హెచ్చరించింది.

అచిరకాలంలో ఒక దేవాలయం తయారైనది అంటే వింత కాదు. దాని చుట్టూ మహాపట్నం వెలిసిందీ అంటే లోకంలో ఏడు వింతలనూ మించిన ఎనిమిదో వింత అని అనకతప్పదు. గుడికి శ్రీమన్నారాయణాలయమని పేరుపెట్టారు. ఆ పేరప్పట్లో దాని కుంచబడింది దేవుళ్లందరిలోను శ్రీమన్నారాయణమూర్తి, ఘనతముడనే. ఉత్తరోత్తా మటేమైనా పాఠకులకు స్ఫురిస్తే రచయిత కారకుడు కానేరడు. గుడి ఎత్తు నుండి దిగువ భాగమును నాలుగు వైపులా సోపానాలు ఏర్పాటుచేశారు. 'సోపానాలకు తిన్నగా నాలుగువైపులా బ్రహ్మాండ

మైన నాలుగు వీధులు నిర్మాణం గావించారు, సిమెంటుతో కొన్ని, తారుతో కొన్ని; టకటకా బండ్లు నడిచే మార్గాలు అవి. వీధుల కిరుప్రక్కలా సువర్ణకుడ్యాలు గల భవనాలు, ముత్యాల ముగ్గులు పెట్టబడ్డ వాకిండ్లు, పచ్చల తోరణాలుగల ద్వారబంధాలు, ఒక టేమిటి? చెప్పన్న రాజుల భాగ్యభోగ్యాలు ఆ నగరానివే అన్నట్టు విలసిల్లేయి. రచ్చలకు రచ్చలు, ఉద్యానవనాల కుద్యానవనాలు, కేళీకూళులకు కేళీకూళులు, విద్యాలయాలకు విద్యాలయాలు, గరిడీస్థలాలకు గరిడీస్థలాలు, ఏవి ఎక్కడ వుండవలెనో అవి అక్కడవుంటూ, కామధేనువును కట్టురాటకు కట్టుకున్నట్టు, కల్పవృక్షమును పెఱటిచెట్టుగ పాతుకున్నట్టు, వుంది ఆ పట్టణం. ఏ తెల్లవారుజాము అప్పుడో ఒకటిరెండు గంటలమధ్య రస్తా నీరసంగా వుండేదేమో గాని మిగతా రోజల్లా ఆ పట్నపువీధుల్లో, బజారుల్లో నడిచే జనానికి మితంలేదు. సూర్యోదయం కాకుండానే శకటాల చప్పుడైతే? గుఱ్ఱపు స్వారులైతే? సన్యాసి వేషగాండ్లు కషాయ కండువాపింజెతో తంబుర మీటుకుంటూ, "వేస్తే బిచ్చం వేయకుంటే వేదాంతం' తేల్చుకుంటూంటే? - మరి కొంచెము పొద్దెక్కి ఏ రేవైనా దిగినా కూరగాయల నేతిమజ్జిగల బేరాలు, తూనిక విలాసాలు. ఇలా ప్రయోజనవర్గము అప్రయోజనవర్గము ఒక పట్నం అవుతుందీ అని చాటే పరిణామానికి ఆ పట్నం క్రమక్రమంగా వచ్చింది. వైశాల్యంలో పెరిగి కూలివాళ్ల కుటీరాలవరకూ వ్యాపించిపోయి వాటి నొక కోటీశ్వరుల గృహాల్లా పరిగణింప జేసింది ఈ క్రొత్తపట్నం. మరిన్ని కోమటక్క కొట్టనొక "రెన్ను బెన్నట్టు" షాపులా మార్చేసింది. మరి మనం పేర్కొని వారల్లా చిన్నపిల్లా, ఆ పిల్ల తల్లీని. వాళ్లు కూడా సంఘంలో అర్హత అభివృద్ధి పొందగల్గారు. ధనమే సహజమైంది అనే సూత్రం ప్రబలించింది. తల్లి గుడికో బంగారు కలశం చేయించింది ఉదాహరణంగా! ప్రజలుకూడా ఆ పట్నమంత వృద్ధిలోకి రావడాని కాదేవుని కృపే అని నమ్మి నిత్యమూ శ్రీమన్నారాయణమూర్తిని పూజించేవారు.

* *

కొంతకాలము కడచిపోయింది. కడచిపోవడంలో అనేక మార్పులు కుటుంబాల్లోను దేశాల్లోనూ కూడా కలిగాయి. అయితే ఎప్పటికప్పుడే మీదికి నుగువుతెచ్చినట్టు, ధనికవర్గము, యువయువతీవర్గము, సంఘములో సమస్తమున్నైచోట్లా విజృంభిస్తూనేవున్నాయి. ఎటొచ్చి ఆనాడు పుల్లయ్య అయితే ఈనాడు ఎల్లయ్య.

ఈలాంటి పరిస్థితుల్లో మన కథలో తొల్త చిన్నపిల్లగా నిరూపింపబడ్డ వ్యక్తి క్రమంగా ఎదిగి, ఏపుగాంచి, రూపం మోసి, తన్నెవరైనాసరే మగాడైనవాడు, ప్రేమించి తీరాలనేటంత యదిలోకి వచ్చేసింది. తల్లి గతించింది. ఇల్లు పెద్దది. ఎంత ఎదిగినా ఎన్నిగదు లామె ఆక్రమించుకున్నా ఈ పిల్ల కింకా ఇల్లు, అంజనేయులుతోకలా మిగిలిపోతూ, ఒక విధమైన భయంగొల్పుతూవుండేది. మరిన్నీ పట్నంలో గుడివంకకు చూచినప్పుడల్లా అదోమాదిరి దుఃఖము, ఆరాటము, తనలో తట్టుతూవచ్చేవి. లోపలి భావం ఎవరికీ చెప్పకూడదు అని తల్లి ఆజ్ఞ. ఆలాగ్గానే, తనలో వయస్సుబట్టి పుట్టే ఊహల్తోపాటు, ఈ ఎటికనుబట్టి పుట్టే ఊహలనుకూడా ఉగ్గబట్టుకుంటూ,

అపురూప సుందరి ఆత్మప్రబోధం

వచ్చి వచ్చి, ఒకనాడు ఏం చేసిందీ అంటే—

చక్కని చీర కట్టుకు, పిక్కటిల్లే రయిక తొడుక్కు, ఒకొక్కక్క అంగే నేలకు లత్తుకరంగు అద్దేలా నడుచుకొంటూ కోమటక్క అంగడికి వెళ్ళింది.

అప్పటికప్పుడే కోమటక్క తల నెరిసింది. మోాల వంగింది. బలము తగ్గింది. కనుబొమలమీదకు చేయి చాపెట్టుకు, చూపు ఆన్చుకుని, కోమటక్క మన చక్కనిచుక్కను పోల్చి, "పిల్లా! పేరేవరు?—ఎప్పుడో చూచినట్లున్నాను" అంది. పిల్ల "ఇదివఱలో నా పేరెఱుగవు. ఇప్పుడు చెప్తాను. జ్ఞాపకం వుంచుకో. అపురూపసుందరి. - మా అమ్మను బాగా ఎఱుగుదువేమో? ఈ మహాపట్నం ఏర్పాటు కానప్పుడు ఆ చెట్లల్లో సారా అమ్ముకునేది. ఆమె ఇప్పుడు లేదు. చనిపోయింది" అని కంట తడిపెట్టుకు తుడుచుకుంది.

"అవునమ్మా! మహాపట్నం అయ్యాక ఎవరున్నది ఎవరు పోయింది ఒకరికొకరికెరుకే లేదు. బొట్టిగానున్నప్పుడు లాగుంది ఒకనాడొచ్చి కానీ పసుపు కానీ మినప్పప్పు పట్టుకెళ్ళావు" అంది కోమటక్క. "నీకింకా జ్ఞాపకం వుందా? ఆ రోజులే మంచివి అనిపిస్తున్నాయి" అంది అపురూపసుందరి. "నీకవి మంచి రోజు లేమిటి? నీకు మంచిరోజులు ఈపయి నుంచీ? పెళ్ళాడతావు, మొగుడొస్తాడు, పిల్లల్ని కంటావు! - నాకను - ఆరోజులే మంచివని." అంది కోమటక్క. "నీకు మాత్రం నేడు బాగులేదూ? పెద్దమేడ కట్టావు. పెర్మిట్లు సంపాదిస్తున్నావు. బారెడు పొగాకు వర్తకం చేస్తున్నావు." అంది అపురూపసుందరి. "నిన్ను చూస్తే జ్ఞాపకం వస్తోవుంది పిల్లా! పిల్లా అనే పిలిచేను. తప్పట్టకు. ఆరోజున నీ వెనకాలే వెంటాడించిన మనిషి జ్ఞాపకం వున్నాడా. మళ్ళీ కానలేదు అతగాడు. తిరుగ ఈ దారిని వెళ్లినట్టు లేదు. ఏమయ్యాడో? ఆ రాత్రి అసలు వానికి మా అరుగు శయ్యే కావలసింది." అంది కోమటక్క. అపురూపసుందరికి కళ్లనీళ్ళు తిరిగాయి. "ఎందుకు అదంతా! అదంతా నా నోట ఎందుకు చెప్పిస్తావు? మా అమ్మ ఎవ్వరికీ చెప్పవద్దన్నది" అంది అపురూపసుందరి. "ఏమి? అందులో ఏమైనా లేకితనంవుందా? మీ అమ్మ వానికేమైనా బాకీవుందా?" అని అడిగింది కోమటక్క. "అబ్బే! మా అమ్మకే ఒకళ్లు బాకీపడేరుగాని మా అమ్మ ఎవళ్లకు బాకీ పడలేదు, ఆమె బ్రతికినన్నాళ్ళు. ఏమో నేను బ్రతకటమే చాల్నని నన్ను మూర్కొని, ముద్దెట్టుకుని, ఆ రోగాడి వూసెత్తి నా తల తిప్పేసుకునేది. నీకింకా ఆ మనిషి గాపకం వున్నాడా?" అంది అపురూపసుందరి. "నా కంటికి చతుర్భుజుడిలా కనబడ్డాడు నీ కెలా తోచాడో?" అని ఆ అరవైయేళ్ళ కోమటక్క ఇరవైయేళ్ళ అపురూపసుందరితోటి ఏకవయస్సు ధాటీగా మాట్లాడింది. "ఎవరైతేం - అతడడుగుపెట్టిన వెంటనే అలయం ఏర్పాటు అయింది ఆ చోట" నంది కోమటక్క. "ఇటువంటి వెఱ్ఱినమ్మకాలతో బ్రతకడం నా కిష్టంలేదు" అంది అపురూపసుందరి.

"మరి ఎటువంటి నమ్మకాలు కావాలి?" అంది కోమటక్క. "నాకు ఎటువంటి నమ్మకాలు అవసరమో నీకు తెలిసికోవాలని వుంటే ఆ ఆలయం తవ్వి పారవేసి, అడుగునఉన్న ఆ మనిషిని తిరుగ లేవదీసి, పునర్జీవితుజేసి, ఇదంతా ఎప్పటి జానపద రూపంగా ప్రమోగేటట్లు చేయాలి" అంది అపురూపసుందరి.

"పిల్లా! నీకింకా పెళ్ళికాలేదు కాబట్టి నీవీ జానపద వ్యామోహంలో పడియున్నావు. పెళ్ళి అయిందా, పట్నవాసమే కావాలంటావు." అంది కోమటక్క. "అందుకే నేను నా పెద్దయిల్లు అద్దెకిచ్చి, ఏ పల్లెటిపట్టుకైనా పోయియుండాలని అనుకొంటూ వున్నాను."- "ఎంత అద్దె?" -"నీకైతే నెలకు వంద." - "సరే!" - "ఏ గ్రామంలో కాపురం పెడతావు?" - "ఈ భరతఖండములో గ్రామమే దొరకదా?" -"దొరకదు. అన్నీ పట్నాలే" అంది వారి అన్యోన్య సంభాషణలో కడమ్ముక్కగా కోమటక్క. ఆశ్చర్యపోయింది అపురూపసుందరి.

* * *

అయినా అపురూపసుందరి బయలు దేరింది తానుకొన్న పల్లెటూరు, ఆ పల్లెటూరులో తనకు తగిన పెళ్లికొడుకు లభించడా అని తలపోస్తూ. ఆమెయొక్క ఆది సిద్ధాంతంకూడా - స్త్రీలు పల్లెటూళ్ళను ప్రేమిస్తే, స్త్రీలవెనక మగవాళ్ళున్ను ఉండగలరు - అని. - ఈ పట్నవాస వ్యామోహమంతా స్త్రీలనుబట్టి వచ్చిందే నని.

ఈ బాహ్యసిద్ధాంతంకాక అపురూపసుందరిలో వేరే అంతరాత్మ ప్రేరేపణ కూడా జనపదసీమకేసి మళ్ళేది కద్దు అని పాఠకులకు నేను వేరేచెప్పక్కర్లేదు.

ఈ అంతరాత్మ ప్రేరణ రూపేణా ఆమెకు ప్రయాణంలో సాక్షాత్కరించింది ఒక అరుణోదయదృశ్యము. దానిముందు పలుపైన విశాలమైన ఎత్తైన భూభాగము. ఆ భూభాగము నొక నాగలి పెట్టి దున్నుతూ ఒకానొక యువకుడు నీలూటీ చాయను తనకంటె ఎతరిగా, తనకంటె బలిష్ఠంగా తన కీడుజోడుగా ఉన్నవాడు కనబడ్డాడు.

ఆమె ఆ దృశ్యంకేసి నడుచుకుంటూ నడుచుకుంటూ వెళ్ళి వెళ్లి అడిగింది ఆ యువకుణ్ణి "ఇది నీ భూమా? నీ యూరేది? నీకు పెళ్ళిఅయిందా?"అని. మొదటి రెండింటికి అనుకూలములైన సమాధానాలు వచ్చినట్టుగా ఆమెకు తోచినాయి. ఏమని? "నేను దున్నేది భూమి కాదు అరుణోదయరాగము." అని, "ఎల్లలేని దేదో అదే మా యూరు" అని. మూడవదానికి సమాధానము చెప్పేలోగా వారిరువురి మధ్య మరుదంకురములతోపాటు మరుశరములు చెలరేగి నిస్సంభాషణమే మేలనిపించింది.

"పట్నాని కంతుంది కాని జనపదసీమ కంతులే"దంది అపురూపసుందరి. "అది నిత్యయౌవనంతో కూడుకున్న స్త్రీలా సాకగపెస్తూంది" అన్నాడు యువకుడు.

అప్పుడడిగింది అపురూపసుందరి "ఇదంతా నీ పితురార్జితమా?" అని. యువకుడన్నాడు "మా తండ్రిని నేను కుటలోనే నీ జనపదభూమిని కనుగొన్నాను. సాగుచేయుచున్నాను. అతగాడెవ్వడో? శ్రీమన్నారాయణసింగు! శ్రీమన్నారాయణసింగు అతడి పేరు" అని ఆకాశమువంక తెలిమాపులు చూశాడు. అపురూపసుందరి తన పట్నమువందలి ఆలయస్వామి పేరు కూడా అదేనని చెప్పబోయూరుకుంది. నూతనంగా వివాహమై జనపదసీమను వారిద్దరు వివేకవంతులై సుఖమనుభవించుచున్నారు. కాని నేటికీ తనలోని రహస్యము అపురూపసుందరి తన భర్తకైనా వెలిబుచ్చలేదు.

ఈ కథ వ్రాయకుంటే అప్పటికీ ఇప్పటికీ అది అందరికీ రహస్యమైయుండేది. కథ వ్రాసి నేనే బయటపెట్టాను. శ్రీమన్నారాయణాలయం క్రింద నున్నది శ్రీమన్నారాయణసింగుయొక్క ఎముకలపోడి. తెలిసి ఎవరైనా ఆ పట్నంలో నివసించగలరా? నివసించలేరు. అపురూపసుందరిలా జనపదసీమనే శాంతి సౌఖ్యాలను చూచుకొన వాంఛిస్తారు. ★

నడిచేగోడను విరిచేయంత్రం

మావూరి రోడ్లు అసలే యిరుకు. దానికి తోడు మావూరి కాలేజిలో చదువుకొనే ఆడపిల్లలు ఎప్పుడూ అరడజను మందికి తక్కువ లేకుండా వీధుల వెంట తిరుగుతూ వుండేవారు. పోని అలా తిరగ దలుచుకొన్న వారు ఒకళ్ల వెనక ఒకళ్లుగా నడిచి పోతారా అంటే-అబ్బే, అదేం లేదు. ఆ అరడజను మందీ ఒకళ్ల చేతులు ఒకళ్లు పట్టుకొని కాళ్లు వచ్చిన గోడలా రోడ్డు మీద కదిలిపోతూ వుండేవారు.

నేను అసలే బద్ధకస్తుణ్ణి. ప్రతి రోజూ ఆఫీసు వేళ అయ్యాక కానీ యిల్లు విడిచి బయలుదేరలేక పోయేవాణ్ణి. ఆఫీసుకు అసలే లేటు అవుతున్నదని నేను నురుసులు క్రక్కుకొంటూ వీధివెంట పరిగెత్తబోతే యీ అంగనలు అడ్డగోడలా అడ్డు తగిలేవారు. ఒక నెలరోజులపాటు వీళ్లతో నానా అవస్థలు పడి, చివరికి ఆ నెలలో జీతం రాగానే సెకండ్ హాండ్ సరుకుల షాపుకు పోయి కారు హారన్ ఒకటి కొనుక్కున్నాను. ప్రతి రోజూ వీధిలోకి పోయేటప్పుడు ఆ హారన్ చంకలో పెట్టుకు బయలుదేరి, ఆ ఆడపిల్లలు ఎక్కడ అడ్డం వచ్చినా సరిగ్గా వాళ్ల వెనకాలికి పోయి గబగబా హారన్ నొక్కేసేవాణ్ణి. దాంతో ఆ అన్నుల మిన్నలు ఆకాశం విరిగి మీద పడినంత హడలి పోయి, తలా ఒకదిక్కూ పరిగెత్తేవారు. నాదారిని నేను ఆఫీసుకి టైముకి పోయేవాణ్ణి.

అంతర్ధానం

శ్రీ యస్. ఆర్. నంది

ఆశ్చర్యం వేసింది. తను ఎక్కడున్నట్టు?

చుట్టూ చూశాడు: శూన్యం. భయం వేసింది. అరుద్దామనుకొన్నాడు: నోరు పెగల్లేదు. ఆశ్చర్యం! తడివి చూసుకొంటె తనే లేడు! తన శరీరం ఏమైనట్టు? మరుగు పడ్డ కొన్ని భూతకాలపు దృశ్యాలు మస్తిష్కంలో మెదల సాగాయి. తను చచ్చిపోయాడు.

కాదు, ఆత్మహత్య చేసుకొన్నాడు: శరీరంనించి అంతఃశక్తిని బలవంతాన వేరు చేసేశాడు.

లోకంలో అక్రమాలని, అన్యాయాలని సహించలేక, క్షణక్షణం నూరుల్లాపోతున్నా చిత్రవధ చేస్తున్న ప్రాపంచిక బాధలకి, వ్యధలకి తాళలేక — ఆత్మహత్య చేసుకొన్నాడు.

తను ఒక్కడు, లోకంలోవున్నా ఉడిగినా మిగతా ప్రాణులతో, మానవ వ్యక్తులతో ఎలాంటి సంబంధం లేని సాంఘిక జంతువు.

సాంఘిక సూత్రాలననుసరించి తను తన కుటుంబానికి యజమాని అయ్యాడు. ఒక చిన్న కుటుంబం. తల్లి, భార్య, పిల్లలు, పెళ్ళికావలసిన చెల్లెలు. వీళ్ళందరు తన మీద ఆధారపడినవాళ్ళే.

సుందర ప్రకృతిలో ఆకలి రాక్షసి ఈ యుగంలో మరీ విజృంభించింది. దాన్ని వాకిట్లోనే కట్టెయ్యడానికి ఎన్ని వుపాయాలు ఆలోచించేవాడో!

పగలు ఎముకలు పిండయేటట్టు పనిచేస్తే, ప్రతిఫలం నెలముప్పైరోజులకి అరవైరాళ్లు. ఏం చాలుతుంది? రాత్రిళ్లుగూడ చిల్లర మల్లర పనులు చేసేవాడు.

విశ్రాంతిలేని జీవితానికి పర్యవసానం: రోగాలు, రొష్టులు! పొత్తికడుపునించి బాధ — పంచప్రాణాలు ఎగిరిపోయేటట్టు. చచ్చినా బాగుండేది అని ఏడ్చేవాడు.

అయ్యో! చావంటె మాటలా? చచ్చేవాళ్లందరు ఏం సాధిస్తున్నారు? తను చచ్చిపోతే ఈ యింట్లో ఆడవాళ్లు మర్నాటినించి ఎండనక వాననక పరాయివాళ్ళ పంచల్లో దేవుళ్లాడుతూ, ఒకళ్ళ చేతికీ, నోటికీ చూస్తూ, వాళ్ళేసే ఎంగిలి మెతుకులకోసం, అర్ధాకలితో మడత కుడుముల గుటకలతో కాలాన్ని గడుపుతారే! వాళ్ల వేపుచూసి దయతలచి, ధనవంతులు ఎంగిలి చేత్తో కాకిని కొడతారా?

ఎవరికొక్కవాలి?

మిఠాయికొట్లని చూస్తూవుంటె నోరూరుతుంది; కాని తనదగ్గర డబ్బేది?

డబ్బుగలవాళ్లు తమ పిల్లలకి అజీర్ణమయ్యేది కానకండా తెగ తినిపిస్తారు. వాళ్ళ పిల్లలమీద వాళ్ళకి ప్రేమ ఎంతుందో, తన పిల్లలమీద తనకిగూడ అంతే ప్రేముంది. ప్రేమున్నంతలో సరా? డబ్బేది—డబ్బు!

'మనుష్యుల్ని అర్థం చేసుకొనే మానవత్వం మనుష్యులనించి ఈ యుగంలో మాయమయింది.

'తనతోడి మానవ వ్యక్తిమీద ప్రేమ, దయ, జాలి మృగ్యమయ్యాయి

'నానాటికి మానవుడు స్వార్థజీవి, సంకుచిత వ్యక్తి ఐపోతూ పతనమై పోతున్నాడు.

'లోపల లోపలే కళకళలాడుతున్న లక్షల అగ్నిపర్వతాలు ఎప్పుడో ఒకనాడు హఠాత్తుగా బద్దలవుతాయి. ఆ పరవళ్లు తొక్కే పైశాచికలావాలో ఈ స్వార్థాలు, అసూయలు, సంకుచితాలు కాలి నుసై మానవుడు పవిత్ర పరిపూర్ణవ్యక్తి అవుతాడు.'

ఒక మహోద్రేకమైన నగ్నసత్యం!

కాని ఈ మధ్యలో?

తనకి విసుగెత్తింది — అంతరాత్మలో ఏ ప్రబోధం ప్రేరేపించి వూపి కదిపిందో, ఈ భౌతిక బాధలని, శూలపు పోట్లని తాళలేక, సాంఘిక సూత్రాలని, మమతా బంధనాలని తెంచుకొని, బలవంతంగా ప్రాణాలని తీసుకొన్నాడు...ఆత్మహత్య...

భిక్షాలు కిందికి చూశాడు.

భూలోకంలో తన శరీరానికి, కేవలం మట్టికట్టెకి పడి మిగతా వాళ్లు ఏడుస్తున్నారు.

అవి వింటూంటె ఏవిటో తను అదోలా ఐపోతున్నాడు! కడుపులో దేవినట్టనిపించింది. తనలో యింకా మమత, మానవ రక్తం వుందా?

ఉహుఁ! తను యిహ ఆ పరిధిలోకి వెళ్ళకూడదు. అదొక ఊబి. విషపు శూలాలు.

'ఎవడ్రా నువ్వు?'

అధికార పూర్వకమైన కంఠస్వరం వినిపించింది. భిక్షాలు చుట్టూ చూశాడు.

'కళ్లు మిటకరిస్తావేరా? మనుషులున్నారని కాస్త కుడీ యెడమా చూడక్కర్లా?'

'తమవరెవరో నాకు తెలీదుబాబు'

మానవలోకం నేర్పిన గౌరవాలని, మర్యాదలని వ్యక్తంచేసే అనేక నీకు సంబోధనభిక్షాలుని ఈలోకంలోగూడ చనవకపోవడం ఆశ్చర్యమే మరి!

'హారి వెధవ. చచ్చిన తర్వాతవిడవబొత్తిగా జ్ఞానం పోయినట్టుందే!'

ఈ గొంతుని పసికట్టి భిక్షాలు వినయంగా అడిగాడు:

'తమ రెవరో...?'

దిక్కులు పిక్కటిల్లేటట్టు నవ్వాడా యెదుటి వ్యక్తి.

'తెలీదురా? ఈవూళ్ళోకల్లా ధనవంతుడనని పేరు పొందిన కోటీశ్వరయ్యనిరా నేను'

పేరువిని భిక్షాలు భయపడ్డాడు. చచ్చిన జీవులమీద గూడ ఈయనకి అధికారం వుందా!

'తమ రిక్కడికి యెలా వచ్చారు బాబు?'

'చచ్చిపోయానురా'

ఆయన కంఠంలో ఎంత విచారం! చచ్చినందుకు విచారిస్తున్నాడు!!

'ఎలా బాబు?'

'తెగతిని! కడుపురోగం వచ్చి...నా భార్య చెబుతూనే వుండేది సుమా. కాని పోగాలం దాపించినవారు......అన్నట్టు, ఆ మాటల్ని పెడచెవినిబెట్టి తెగతిన్నాను. చచ్చాను'

ఏడుపు ముఖం పెట్టాడు.

మొన్ననే ఐదులక్షలతో ధాన్యం మిల్లు కట్టించాను. ప్రభుత్వానికి ఋణం కావాలంటె రెండులక్షలిచ్చాను. ఇంటి ఖర్చుకని ఈమధ్య పాతిక రిక్షాలని వూరుమీద తిప్పుతున్నాను. ఇంతలో అకస్మాత్తుగా నాకీచావొచ్చింది.

'కొడుకున్నాడు. వాడికేం తెలీదురా. రైతులు దొంగముండాకొడుకులు. ధాన్యం ధర ఆకాశానికి యెత్తేశారు...తీసుకున్న అప్పుని ప్రభుత్వం యేవో వెధవశాసనాల్ని తయారుచేసి ఎగనామం పెడుతుంది ... రిక్షావాళ్లు రోజుకూలి యివ్వరు. వాళ్లేమవుతారో—పిల్లలంతా ?

ఈ యుగంలో డబ్బే లోకమైనప్పుడు, యిన్ని లక్షల ఆస్తి విడిచి పెట్టొచ్చి గూడ ఆయన యింకా పిల్లలకోసం యేడుస్తాడేం!

'నా దగ్గర డబ్బుందిరా. లోకంలో ప్రతిదాన్ని జయించాను. కాని ఈ చావుని జయించలేకపోయాను'

'ఈ చావులు మానవశక్తులకి అతీతమైన మహాశక్తి చేతిలో వుంటాయి బాబు. అక్కడ ఈ ఆశలు డబ్బులు పనికిరావు.'

'అయితే మన ఆత్మ లిప్పుడు యెక్కడికిపోతాయి?'

'బలవంతాన చచ్చాం గాబట్టి, మనం మధ్యలోనే దొర్లాడుతాం బాబు'

'ఎంతవరకు?'

'ముక్తనేది లభించేవరకు'

ఇంతలో ఈశాన్యదిశనుంచి ఏదో పెద్ద కాంతి కనిపించింది. అది రానురాను వీళ్ళ దగ్గరకే వచ్చింది.

'ఎవరు మీరు?' ఒక శ్రావ్యమైన కంఠం వినిపించింది.

భిక్షాలు చెప్పాలనుకొన్నాడు, కాని కోటీశ్వరయ్య వాడి నోరు మూసేసి తనే ముందుగా చెప్పుకొన్నాడు! సవినయంగా



కోటీశ్వరయ్యంతటి వాడు తన భర్తకి వంగి సలాము పెట్టడమేమిటా అని ఆశ్చర్యపోయింది భిక్షాలుభార్య.

మహాభారతం ★ మహాపురాణం కాదు

బొంబాయి రాజధానిలో పూనా నగరమందు భండార్కరు పండితుని సంస్మరణార్థమై ప్రతిష్ఠింపబడినటువంటి "భండార్కరు - ఓరియంటల్-రిసర్చి-ఇన్‌స్టిట్యూట్" (భండార్కరు స్మారక ప్రాచ్య విద్యా పరిశోధక సంస్థ) అనే పండిత పీఠమొకటి కలదు. ఈ పండిత పీఠము యిటీవల సంస్కృత మహాభారతము యొక్క అతి ప్రాచీన ప్రతుల నన్నింటిని సంపాదించి శ్రద్ధగా పరిశీలించి, పండిత పరిష్కృతమైన "సంస్కృత భారతమును ఆయా వివిధ పాఠాంతరములతో సహా తయారు చేసి ముద్రించుచున్నాడు - డా॥ వి. యస్- సుక్రాంకరుగారు యీ పండిత పీఠమునకు అధ్యక్షత వహించిన ప్రాచీన ప్రతులను శ్రద్ధగా పరిశీలించు చున్నారు-

బహు పురాతన (పురాణ్) ప్రతులను వీరు సేకరించారు. సంస్కృత భారతము యొక్క పురాణ ప్రతులు క్రీస్తు శకము 13 శతాబ్దము నాటివి అనగా (క్రీ శ॥ 1250 లేక 1260) నాటివి మాత్రమే దొరికెను. మరికొన్ని సంస్కృత భారత ప్రతులు క్రీ॥ శ॥ 14 శతాబ్దములో వ్రాయబడినవి దొరికెను. అంతకంటె ప్రాచీనమైన పురాణ ప్రతి సంస్కృత భారతానికి ఎక్కడా లేదు.

కాని జావా ద్వీపంలోని జావా భాషలోనికి తర్జుమా చేయబడిన మహాభారతము క్రీ॥ శ॥ 10 శతాబ్దంలో వ్రాయబడినటువంటిది లభించెను.

తెలుగు భాషలో నన్నారు భట్టు రచించిన మహాభారతము క్రీ॥ శ॥ 11 శతాబ్దములో రచింపబడెను

మహాభారతం ప్రతి ఇంతకంటె పురాణమైనది ఏ భాషలోనూ లభించలేదు.

కాని ఒకప్పుడు మహాభారత కథ యావత్తు క్లుప్తమైన గ్రంథంగా వీరుల కథల గేయాలుగా రచింపబడి యుండవచ్చును. ఆ వీరుల కథల సుద్దులుగా రచింపబడిన గ్రంథ రూపము లభించలేదు అని ఆపండిత పీఠముయొక్క అభిప్రాయము-

కనుక ప్రస్తుతం లంభించిన అతి పురాణ ప్రతులను బట్టి యీ సంస్కృత మహాభారత ప్రతి మహాపురాణగ్రంథంగా కన్పించుట లేదు.

అంతర్లీనం

చేతులు కట్టుకొని-పరిస్థితులు ప్రతికూలిస్తే తల సయితం వాల్చేస్థితిలో.

'నా పేరు కోటీశ్వరయ్య — భూలోకంలో చచ్చిపోయాను. నోరులేని ఆలుబిడ్డల్ని నిస్సహాయస్థితిలో వొదిలి. మీ ఆ మహాశక్తి ఐతే...'

'అవును—ఆ మహాశక్తిని నేనే. కాని నీకు భూలోకానికి తిరిగి పోవడానికి అజ్ఞ యివ్వలేను...ఆఁ నువ్వెవరవు?' భిక్షాలకేశి ప్రశ్న వినవచ్చింది.

'ఒక దరిద్రుణ్ణి ప్రభూ. కష్టాలు, బాధలు పడలేక ఆత్మహత్య చేసుకొన్నాను"

'ఆత్మహత్యా!'

'అవును. ఇక నేను జీవితంకేసి చూడలేను. లోకంలో ప్రతీవ్యక్తి అధికారై రకరకాలుగా క్షుణక్షుణం పొడుచుక తింటున్నాడు. పేదలు కూటికి లేక అలమటించిపోతుంటె, ధనవంతులు లక్షలు లక్షలు పెట్టుబడులతో పరిశ్రమల నే వంకతో విపరీతలాభాలు తీసి, వాళ్ళ యినప్పెట్టెల్లో డబ్బుని మూల్గించుకొంటూ, పేదల్ని కాలి కింద నల్లుల్లా చంపేస్తున్నారు.'

'కాదు ప్రభూ — అంతా అబద్ధం — వీడు భౌతికవాది' అరిచాడు కోటీశ్వరయ్య.

'కూటికి లేనివాడికి భౌతికవాదం, ఆదర్శవాదం, అస్తితావాదం ఏమిటిబాబు! ఆకలి అని కాస్త గట్టిగా అరిస్తే అభివృద్ధి నిరోధకు డని జైళ్లలోకి తోసి చంపుతున్నారు'

సృష్టిశక్తి తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది. ఏన్నో ఏళ్ళతరబడి ఈలోకం వేపు దృష్టి మరల్చని ఆ మహాశక్తికి యివన్నీ ఆశ్చర్యాన్ని కలిగించాయి. భూలోకంలో ఇన్ని అన్యాయాలు జరుగుతున్నవా! ఈ మానవులు డబ్బుని నైతిక కొలబద్దగా గాకండా నానాభేదాలకి వుపయోగించుకొంటున్నారా!

'సరే. మీకు తిరిగి మీమీ ప్రాణాలు యిస్తాను' ఏభావంతో ఆమాట వచ్చిందో!

కోటీశ్వరయ్య ఎగిరి గంతేశాడు. భిక్షాలు కృంగిపోయాడు!

'అలా కాదు: డబ్బు మధ్య మదించిపోయిన కోటీశ్వరయ్య శరీరంలో భిక్షాలు ఆత్మ - కోటీశ్వరయ్య ఆత్మ భిక్షాలు శరీరంలోకి మారుస్తాను. ఈ ప్రయోగంలో మీరు మానవత్వపు విలువల్ని గుర్తించుకోగలుగుతారు—పొండి'

కోటీశ్వరయ్య ఆగ్రహంతో అసూయతో రేచ్చాడు.

భిక్షాలు, తిరిగి ఆ ఊబిలోపడుతున్నందుకు కుమిలిపోయాడు.

కాని సృష్టిశక్తిని యెదిరించలేక పోయారు యిరువురూ...

క్షణంలో...దృశ్యం మారింది!

చచ్చిపడున్న భిక్షాలు ఛప్పునలేచాడు. లేస్తూనే సరీరంలో బంధించబడ్డ కోటీశ్వరయ్య ఆత్మ ఆ పూరిపాకని, ఆ కంపుకొట్టే గుడ్డల్ని, ఆడవాళ్ళని చూసి అసహ్యించుకో మొదలు పెట్టింది. చనిపోయిన మనిషి తిరిగి బ్రతికినందుకు ఆ యింట్లో వాళ్ళందరు ఆనందంతో మురిసిపోయారు.

కాని కోటీశ్వరయ్య ఆత్మ, తన భవంతికి పోవడానికి భిక్షాలు శరీరానికి ఆజ్ఞయిచ్చింది.

"లాభంలేదు నేను వెళ్ళను" అంది భిక్షాలు శరీరం.

దహించుకపోతున్న కోటీశ్వరయ్య ఆత్మ ఊర్ధ్వస్వరంతో అరచింది: "ఏం!"

"ఇక్కడ నువ్వు నా ఆజ్ఞకి లోబడి వుండాలి. చచ్చినట్టు ఈ గుడిశల్లో, కంపుకాల్వల్లో వుండాలి. నీకూ, నాకూ సహకారం కుదరకపోతే ఫలితం శూన్యం."

ఇదేమిట్రా భగవంతుడా అని ఏడ్చింది కోటీశ్వరయ్య ఆత్మ. ఐనా మెల్లగా ఈ ప్రపంచంలో కాస్త కుదురుకొంటె తర్వాత న్యాయస్థానంలో తన స్థితిని చెప్పుకొని తను తిరిగి తన పూర్వపుస్థితిని పొందగలననుకొన్నాడు.

కాని ఆశ్చర్యం! న్యాయమూర్తుల శరీరాల్లో దొంగల ఆత్మలు ప్రవేశించాయి! ప్రధాన రక్షకభటుల ఆత్మలు సామాన్య ప్రజల శరీరాల్లోకి మారాయి! అంతా తల్లకిందులయింది!!

జైళ్లు లేవు, న్యాయస్థానాలు లేవు: వాటిస్థానే నైతికశిక్షణ కేంద్రాలు, మానవత్వ పునరుద్ధరణ పాఠశాలలు తయారయ్యాయి!

ఈ విచిత్రానికి ఆశ్చర్యపోతూ, సృష్టిశక్తిని తిట్టుకొంటూ కోటీశ్వరయ్య ఆత్మ భిక్షాలు శరీరంలో శాశ్వతంగా చిక్కుబడింది. భిక్షాలు శరీరం మర్నాటినించి కూలిపని చేయడం మొదలు పెట్టింది.

ఇక్కడ — కోటీశ్వరయ్య శరీరంలో చిక్కుకున్న భిక్షాలు ఆత్మ, ఆ భవంతిని, ఆ దీపాలని, ఆ నీడకనబడే నేలని, డబ్బుని చూసి తబ్బిబ్బులైపోయింది.

అలవాటులేని పంచభక్ష్యపరమాన్నాలు తినేసరికి రెండుదినాలు అజీర్ణం పట్టుకొంది.

ఇంతలో కోటీశ్వరయ్య కొడుకు వచ్చాడు.

"నాన్నగారు"

భిక్షాలు ఆత్మ కోటీశ్వరయ్య శరీరంలో

★ అంతర్లీనం ★

తులువక్కు పడింది. వెంటనే "ఊఁ" అనలేక పోయాడు.

"ఆ రిక్షావెధవలు — ఈవాళ వాళ్ళకి కూలిడబ్బులు కిట్టలేదని — మన బాడుగ రెండున్నర యివ్వలేనంటున్నారు"

భిక్షాలు ఆత్మ కించపడింది. తన శరీరం యింతకుముందు బ్రతుకు తెరువుకోసం అలానే పగలనక, రాత్రనక చచ్చిపోయేది. అది తలచుకొంటె యిప్పటికీ భయమేస్తోంది. రిక్షాలు లాగడంలో గల బాధ, కష్టం తనకి తెలుసు. ఆ అనుభవాన్ని, యిప్పుడు తను అధికారంలో వున్నప్పుడు వినియోగించుకోవాలి.

"ఆ రిక్షాలు వాళ్ళకి యిచ్చెయ్ బాబు— ధర్మంగా"

"అదేవిఁటి నాన్నగారు!"

"పాపం పేదవాళ్ళు—వాళ్ళకి నిజంగా ఈవాళ డబ్బులు దొరకలేదేమో!"

"కాదు నాన్నగారు; వీళ్ళు దొంగ ముండాకొడుకులు; వేషాలు"

కాని ఆ రిక్షావాళ్ళ శరీరాల్లోవున్న ఆత్మలు నిన్నటి కోటీశ్వరులవి, లక్షాధికారులవి అని తండ్రీ కొడుకుల్లో ఎవరికీ తెలీదు.

గాలిగదుల్లో, పంకాలకింద విలాసాలకి అలవాటుపడ్డ ఆ ధనవంతుల ఆత్మలు, ఆ కూలీల శరీరాల్లో చిక్కుకొని, రిక్షాలు లాగమని శిక్షింపబడడంవల్లే ఆనాటికి డబ్బులు దొరకలేదని గూడ వాళ్ళకి తెలీదు.

ఈ ఒక్క ధర్మంతో ఆ రిక్షావాళ్ళు జై జై నినాదాలుచేశారు.

ధాన్యం మిల్లు చూడానికి వెళ్ళాడు. భూసారాన్ని పిండిపండించి కడుపులింపే పేదరైతుల నోళ్ళుకొట్టి లక్షలు లాభాలు తీసే మిల్లులు; బక్కచిక్కి, రక్తంలేక ఎందుకో ఎలానో బ్రతుకుతున్న కూలీల అస్తిపంజరాలు; వీట్లని చూసేసరికి భిక్షాలు ఆత్మ ఎంతో బాధపడింది.

'ఎందుకీ పని చెయ్యడం' అనుకొన్నాడు. పాపం, పూర్వాశ్రమంలో తను వాట్లలో నలిగి నుసైపోతున్నా ఈ రహస్యం గురించి ఎప్పుడూ యింత అమోఘంగా, తీక్షణంగా, బాధగా ప్రశ్నించుకోలేదు. అలా ప్రశ్నించుకోవాలనే జ్ఞానం గూడ లేకపోయేది!

నెల ముప్పైరోజులు రెక్కలు ముక్కలయేటట్టు కష్టిస్తే సగం పొట్టనింపుకోడానికి—బోనులో సర్కస్ సింహాలకి వేసే మేత ముడుతుంది! ఇక మరి ఆ ప్రాణం మీద ఆధారపడి బ్రతుకుతున్న ఆడవాళ్ళ గతి అంతే!

అలా కాకూడదు. ఏ కూలీల రక్తంతో ఈ మిల్లుగోడలు, ముళ్ళచక్రాలు తయారు కాబడ్డాయో వాళ్ళనిగూడ తన హోదాతో సమానం చేయాలి. రాజుగారు తలచుకొంటె......!

లాభాల్లో కూలీలకు వాటా, వాళ్ళు బతికే పందుల పాలకష్టానే గాలివెలుతురూ కరుణించే గదులు, సౌకర్యాలు, సదుపాయాలు, తిండి, బట్ట—అన్నీ అందరికీ సమానంగా సరఫరాచేయాలని హుకుం జారీచేశాడు.

ఆ సాయంకాలం "భిక్షాలు" యింటికి "కోటీశ్వరయ్య" వెళ్ళాడు.

"భిక్షాలు" పడుకొనివున్నాడు కుక్కిమంచంలో. అతని భార్య వంట చేసుకొంటోంది. పిల్లలు ఆడుకొంటున్నారు బయట. వీళ్ళని చూసేసరికి భిక్షాలు ఆత్మ ఎంతో బాధతో కన్నీళ్లు తిప్పుకొంది.

భిక్షాలు భార్యను పిలచాడు. తనతో తీసుకవచ్చిన పళ్లు, డబ్బుయిచ్చి: "ఇవి నీ పిల్లలకి పెట్టి, ఈ డబ్బుతో పిల్లలకి బట్టలు కుట్టించు"

భిక్షాలు భార్య నిజంగా ఆశ్చర్యపోయింది! నిన్న మొన్నటివరకు పిల్లికి బిచ్చం పెట్టని కోటీశ్వరయ్య స్వయంగా తమ పూరిగుడిశెల దగ్గరకివచ్చి, ధర్మం చెయ్యడం ఆవిడకు విడ్డూరంగానే కనిపిస్తుంది మరి! తన భర్తలో చచ్చి బతికిన తర్వాత ధనవంతుల కుండవలసిన దర్జాలు, హోదాలు కనిపిస్తున్నట్టె, కోటీశ్వరయ్య గూడ చచ్చి బతికిన తర్వాత ప్రజలంటె ప్రేమతో, జాలితో దానధర్మాలు చెయ్యడం, నిజంగా కలియుగమే మారిపోయిందా అనిపిస్తోంది!

లోపల పడుకున్న 'భిక్షాలు' లేచాడు.

వాకిట్లోవున్న 'కోటీశ్వరయ్యా' ని చూసి నిలువెల్లా దహించుకపోయాడు. అక్రమంగా, అన్యాయంగా, తన డబ్బుని, మర్యాదని, హోదాని ఆ శరీరంలో దూరి తస్కరించింది చాలక, ఈ ముష్టివెధవలకి ధర్మాలు చేస్తున్నాడు!

"కాస్త తమాయించవయ్యా" అంది భిక్షాలు శరీరం, ఊరక లేస్తున్న కోటీశ్వరయ్య ఆత్మని. "ఎంతకాలం, నీది నీదని నీలాంటి శరీరాలని, ఆత్మలని యిలా చిత్రవధ చేస్తుంటావ్? పోనీ ఆ భిక్షాలు ఆత్మయినా లోకకల్యాణానికి పూనుకొంటె యేడుస్తావెందుకు?'

"అది నా డబ్బు"

"నువ్వు గడించావా?"

"ఆఁ, నా తాత ముత్తాతల నించి వంశపారంపర్యంగా వస్తున్న హక్కు..."

"ఆ హక్కులకాలం పోయింది గనుకనే ఆత్మలు, శరీరాలు విడిపడి మమతల్ని ప్రేమల్ని మార్చుకున్నాయి. నువ్విప్పుడు భిక్షాలువి. నువ్వు ఈ భిక్షాలు పిల్లల్ని ప్రేమించడం నేర్చుకో"

"నా పిల్లల్ని ఆ భిక్షాలుగాడు అలా ప్రేమించగలడా?"

"ఎందుకు ప్రేమించలేడు? ఆ శరీరం నీదేగా!"

"ఐతే?"

"లోకం రెండే రెండు విధాలుగా చీలిపోయింది. ధనవంతులు; దరిద్రులు. ధనవంతుల ఆత్మలు, శరీరాలు కేవలం ధనికతత్వంతోనే నిండిపోయాయి. అందువల్ల ధనవంతుని వద్దనుంచి ఏదో ఒకదాన్ని వేరుచేసి, దరిద్రునికిస్తే వేడినీళ్లకి, చన్నీళ్లతోడవుతాయి. అప్పుడే మానవులకు యిక ఈ అసూయలు, అస్తాం్రిలు, భయాలు, తత్వాలు ఎలా కలుగుతాయి?"

కోటీశ్వరయ్య ఆత్మ కాసేపు మౌనం వహించింది. భిక్షాలు శరీరం అతన్ని లేపింది. మెల్లగా బయటకు వచ్చాడు.

భిక్షాలు భార్యతో మాటాడుతున్న కోటీశ్వరయ్య భిక్షాలుని చూసి ఠప్పున నిలబడ్డాడు. వినయంగా తలవంచి చేతులు జోడించి "నమస్కారం బాబూ" అన్నాడు.

భిక్షాలు భార్య కోటీశ్వరయ్యంతటివాడు తన భర్తకి వంగి సలాము పెట్టడమేవిటా అని ఆశ్చర్యపోయింది!

కోటీశ్వరయ్య ఆత్మలో యింకా అహం చావలేదు.

"నువ్వా అతనితో బహువచనంలో మాటాడు" అంది భిక్షాలు శరీరం, లోపలి కోటీశ్వరయ్య ఆత్మతో.

కోటీశ్వరయ్య ఆత్మ ఏమనుకొందో ప్రతి నమస్కారం చేసింది. 'కోటీశ్వరయ్యా' నవ్వుకొన్నాడు.

'నన్ను క్షమించు భిక్షాలు!' అంది భిక్షాలు శరీరంలోని కోటీశ్వరయ్య ఆత్మ.

ఎవరికీ వినిపించని పరిభాషలో ఆ రెండు ఆత్మలు మాటాడుకొన్నాయి.

'అదేఁవిటి బాబు అలా అంటారు' అంది భిక్షాలు ఆత్మ కోటీశ్వరయ్య శరీరంలో నించి.

'ఇంతవరకు నాకు పేదరికమంటె ఏవిఁటో తెలీదు. ఈ దారిద్ర్యం గురించి పైకి డాబు మాటలాడ్డమే తెలుసునుగాని వీటిలోపలి బాధ నాకు తెలీదు. నాదగ్గర లక్షలకొద్దీ డబ్బుంది. దాన్ని వీళ్ళకోసం వినియోగించు. ఇక నువ్వూ నేను భేదం లేకండా భూలోకాన్ని స్వర్గం చేసుకొందాం."

భిక్షాలు ఆత్మ చిరునవ్వు నవ్వింది.

'ఐతే మనం శరీరాలు మార్చుకుందాం'

"వద్దు భిక్షాలూవద్దు, ఆత్మ, శరీరం ఆ ధన పిశాచపు వాతావరణంలోపడి మళ్లీ తోడుదొంగలవుతాయి. మళ్ళీ నేను గతాన్ని మరచిపోతాను. నీకు పేదరికమంటె ఏవిఁటో తెలిబట్టే ఆ రిక్షాలని పేదవాళ్ళకి యిచ్చేశావు. మిల్లు లాభాల్లో వాళ్ళకి లాభాలిచ్చి మానవత్వాన్ని గుర్తించావు ఇనపపెట్టెలోని డబ్బుతో పేదలకి యిళ్ళు కట్టిస్తున్నావ్. నీకు మమత, ప్రేమ వుండబట్టి శరీరసంబంధమైన నా పిల్లల్ని, ఆత్మసంబంధమైన నీ పిల్లల్ని సమానంగా చూసుకొంటున్నావ్. ఈలోకం యిప్పుడు నా, నీ భేదాలవల్లే కదా వేరుపడిపోతోంది. ఆ అంతరం లేకండా 'నా, నీ'ల రెండింటినీ ఒక వ్యక్తిలోనే వుంచుకోగలిగాం. మనం యిప్పుడు పరిపూర్ణ వ్యక్తులం. ఇప్పుడు మన్ని ఏ స్వార్థాలు, అసూయలు, నీ నా భేదాలు అంటవు. మనం పరిపూర్ణుల మయ్యాం"

భిక్షాలు ఆత్మ నవ్వింది.

ఊహుఁ, కోటీశ్వరయ్య శరీరంలో భిక్షాలు ఆత్మ.

అదీకాదు! కేవలం పరిపూర్ణ మానవ వ్యక్తి పరితృప్తిగా నవ్వాడు. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



89. నక్షత్రాలు

ఉత్తానపాదుని కుమారుడైన ధ్రువుడు శ్రీమన్నారాయణున్ని గూర్చి ఘోరతపస్సు చేసి, ఆయనను ప్రత్యక్షం మొనర్చుకొని, భూమిపై అనేక వేల సంవత్సరాలు రాజ్యం చేసిన పిమ్మట ఉత్తర ధ్రువపథాన్ని పొంది ఆకాశంలో వెలుగొందునట్లు వరములు పొందెనట్లు మన పురాణాలలో ఉంది. భూమిపై పుణ్యం చేసిన పురుషులు చనిపోయిన తర్వాత నక్షత్రాలై ఆకాశంలో ప్రకాశిస్తూంటారని పూర్వుల విశ్వాసం. కాని అందులో సత్యమేమీ లేదని మన మంగీకరించకతప్పదు. నక్షత్రాలన్నీకూడా సూర్యునివలెనే అధిక తమ తాపక్రమస్థితిలో నుండి వేడినీ వెలుగునూ ప్రసరిస్తున్న మూర్తులు.

అయితే నక్షత్రాలు చుక్కలుగానూ, సూర్యుడు బింబంలాగా ఎందుకు కనిస్తున్నాయని మనకు వెంటనే సందేహం కలుగవచ్చు. కొద్దిగా ఆలోచిస్తే మనంత మనకే సందేహ నివృత్తి కాకపోదు.

బయలు ప్రదేశంలో ఒకచోట గ్యాస్ లైటొకటి వెలుగుతుందనుకొందాం. గ్యాస్ లైట్‌కు చేరువగా నున్నపుడు దాని వెలుతురు కండ్లకు మిరుమిట్లు గొల్పుతూ ఉంటుంది; కొంత వేడికూడా ఉంటుంది. కాని ఒక ఫర్లాంగు దూరంగాపోయి, దానికేసి తిరిగిచూస్తే, అది ఒక హరికెన్ లాంతరువలె అనుతుంది; రెండు మూడు ఫర్లాంగులు దూరంగా పోయిచూస్తే, అది చిన్న ఆముదం దీపంవలె మినుకు మినుకు మంటూ గోచరిస్తుంది. ఇంకా దూరంగా పోయిచూస్తే, అది అసలు కనిపించనే కనిపించక పోవచ్చును. దీనినిబట్టి ఒక కాంతిమంతమైన వస్తువునుండి దూరంగా పోయిన కొలదీ దాని తీక్ష్ణత తగ్గుతుందని మనకు వ్యక్తమౌతుంది. ఇప్పుడీ ఫలితాన్ని నక్షత్రాలకు వర్తింపజేస్తే?.........సూర్యుని వలెనే నక్షత్రాలుకూడా అధిక తమ తాపక్రమ స్థితిలోనున్న మూర్తులే అయినా మనకవి చుక్కలుగా కనిపించుటకు కారణం భూమి కవి సూర్యునికంటె ఎక్కువ దూరంలో ఉండుటయే యని తోచవచ్చు. అవి యట్లు కనపడుటకు వాస్తవంగా కారణం అదే.

భూమిమీద రెండు ప్రదేశాల మధ్య దూరాన్ని కొలిచినట్లు గొలుసుతోనూ, గజం బద్దతోనూ నక్షత్రాల దూరాన్ని కొలవలేము. కాని కొన్ని ఉపాయాల వలన భూమినుండి వాటి దూరాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. తత్ఫలితంగా భూసూర్యుల మధ్య దూరానికి కొన్ని వేల రెట్ల దూరంలో నక్షత్రా లున్నాయని వ్యక్తమైంది; నక్షత్రాలన్నీ భూమికి సమానదూరంలో లేవనికూడా విశదమైంది. భూసూర్యుల మధ్య దూరం సుమారు 93,000,000 మైళ్ళు. సూర్యుని తరువాత భూమికి మిక్కిలి దగ్గరగానున్న నక్షత్రం సెంటరీ. భూమినుండి దాని దూరం 24,696,000,000,000 మైళ్ళు. అంటే సూర్యుని కంటే అది భూమికి 2,75,000 రెట్ల దూరంలో ఉంది! మిగిలిన నక్షత్రాల దూరాలు ఇంకా చాలా ఎక్కువగా ఉంటాయి. అంతంత దూరంలో ఉన్నా నక్షత్రాలు చుక్కలుగానైనా కనపడుతున్నాయంటే అవి ఎంతెంత పెద్ద గోళాలో, ఎంత హెచ్చు దీప్తిని కలిగియున్నాయో మనం ఊహించుకోవాలి.

నక్షత్రాలన్నీ సూర్యునివలెనే చాలా పెద్దగోళాలు. చాలా నక్షత్రాల పరిమాణాలు ఇంచుమించు సూర్యగోళ పరిమాణమంతే ఉంటాయి. కాని సూర్యుని కంటే చాలా పెద్దనక్షత్రాలూ, మిక్కిలి చిన్న నక్షత్రాలూ కూడా లేకపోలేదు. అంటేరస్ అనే నక్షత్రగోళ వ్యాసం సూర్యగోళ వ్యాసానికి 480 రెట్లుంటుంది; కాని ఎరిడానీ అనే నక్షత్రవ్యాసం సూర్యగోళపు వ్యాసంలో 50వ వంతుకంటె, తక్కువే. సూర్యునికంటె చాలా పెద్దవియైన నక్షత్రాలను బృహత్తారలనీ, మిక్కిలి చిన్నవియైన నక్షత్రాలను వామనతారలనీ అంటారు.

నక్షత్రాల పరిమాణాలలో ఎక్కువ వ్యత్యాసాలున్నా, వాటి ద్రవ్యరాశిలో మాత్రం ఎక్కువ తేడా ఉండదు. నక్షత్రాలన్నింటి ద్రవ్యరాసులుకూడా ఇంచుమించు సూర్యుని ద్రవ్యరాశి అంతే ఉంటాయి. బృహత్తారాలలో ద్రవ్యం అతిపలుచగానూ, వామనతారలలో ద్రవ్యం మిక్కిలి సాంద్రంగానూ ఉండడమే దానికి కారణం.

నక్షత్రాలన్నీ సమానదీప్తితో ప్రకాశించుటలేదని వాటికేసిచూస్తే మనకు వ్యక్తమౌతుంది. నక్షత్రాలావిధంగా ఎక్కువ తక్కువ దీప్తులతో ప్రకాశించుటకు కారణం భూమికీ వాటికీ గల దూరంలోనున్న వ్యత్యాసంకావచ్చు; సహజంగా వాటి దీప్తులలోనున్న తేడాకూడా కావచ్చు.

నక్షత్రాల సహజ దీప్తులను కనుగొనుటకై శాస్త్రజ్ఞులనేక పద్ధతులనన్వేషించేరు. ఆ పద్ధతుల ననుసరించి గావించిన పరిశోధనలవలన నక్షత్రాల సహజ దీప్తులలో చాలా వ్యత్యాసం ఉందని తేలింది. ఈ విధంగా నక్షత్రాల సహజ దీప్తులలో వ్యత్యాసం ఉండుటకు కారణం నక్షత్రాల తాపక్రమంలో వ్యత్యాసం ఉండడమే. నక్షత్రాలకేసి నిదానంగా చూస్తే కొన్ని తెల్లని కాంతితోనూ, కొన్ని పసుపురంగు కాంతితోనూ, కొన్ని నీలిరంగు కాంతితోనూ, కొన్ని ఎరుపురంగు కాంతితోనూ, ప్రకాశిస్తున్నటుల కనిపిస్తాయి. నక్షత్రాలలో తెల్లా తెలుపురంగు కాంతితోనూ, నీలిరంగు కాంతితోనూ ప్రకాశించే నక్షత్రాల తాపక్రమాలు మిక్కిలి యెక్కువ. వామనతారల తాపక్రమం చాలా ఎక్కువకాబట్టి అవి తెల్లని కాంతితో ప్రకాశిస్తుంటాయి. తత్కారణంగా వాటిని శ్వేతవామన తార

నికూడా అంటారు. సూర్యుడువంటి చాలా నక్షత్రాల కాంతిలో పసుపురంగు ఎక్కువగా ఉంటుంది. అందుచేత వాటిని పీతవర్ణ తారలని పేర్కొంటారు. నక్షత్రాలలో కెల్లా తక్కువ తాపక్రమమును కలిగియున్నవి ఎరుపురంగు కాంతితో ప్రకాశిస్తున్నట్లు కనిపిస్తున్నవి. బృహత్తారలన్నీ యీ రంగు కాంతితోనే ప్రకాశిస్తున్నాయి కాబట్టి వాటిని బృహదారుణ తారలనికూడా అంటారు.

నక్షత్రాలు ఈనాడు మనకు కనపడుతున్నట్లుగనే ఆదినుంచీ లేవు. ప్రతి నక్షత్రం కూడా ప్రారంభంలో బృహదారుణ తారగా ఉంటుంది. ఆ తరువాత క్రమంగా అది సంకోచించి, పసుపు పచ్చ వంటి కాంతులను ప్రసరించే తారగా మార్పు చెంది, చిట్టచివరకు శ్వేతవామన తారగా రూపొందుతుంది. ఈ పరిణామానికి కోట్లాది సంవత్సరాలు పట్టుననుటకు సందేహంలేదు. అంతకాలం నక్షత్రాలు వేడినీ వెలుగునూ ప్రదేశంలోకి ప్రసరిస్తూనే ఉంటాయి. ఈ శక్తి అంతా వాటికి తమలోని పదార్థంలోని పరమాణువులు విచ్ఛిన్నమై, తత్వాంతర పరివర్తనము (*Trans m tation*) పొందుటచేతనే చేకూరుతున్నది.

—'అనంత్'

90. ధూళి

ధూళి అంటే తెలియనివారుండరు. సూర్యరశ్మి ఇంటికప్పునకుగల రంధ్రములో నుంచి చొచ్చుకొని గదిలోనికి వచ్చినప్పుడు ఆ కిరణపుంజమంతటా ధూళి కణాలు ఎగురుతూ కనబడతాయి. ఈ కణాలు పైకీ కిందకీ కూడా సాగిపోతూంటాయి. పైకి వెళ్ళడానికి కారణము గాలి యొక్క చలనమే. మన పూర్వులు ఈ కిరణములోని ధూళికణానికి త్రసరేణువని పేరుపెట్టి మూడు త్రసరేణువులు కలిస్తే ఇదీ, అలాంటివి మూడు కలిస్తే మరొకటీ అంటూ మహా కొలిచిచూసినట్టు అంగుళ ప్రమాణాన్ని నిర్వచించారు. ఈ నిర్వచనమువల్ల పొడవునకు స్థిరమైన ప్రమాణము ఏర్పడదు.

త్రసరేణువు పతన వేగము చాలా కొంచెము. కారణము దాని వైశాల్యమంతటా గాలిరాపిడి పని చేస్తూ వుండడమే. ఒక ఘన అంగుళము ముక్కకి ఆరు ముఖాలుంటాయి. దీనిని సరిగా మధ్యకిచీల్చితే బరువులో సగము మాత్రమే అయినా ఒకొక్క ముక్కకీ ఈ వైశాల్యములో సగము వైశాల్యమేకాక అడ్డకోత వైశాల్యము ఎక్కువగా చేరుతుంది. ఇలాగ ముక్కలుచేస్తూ, పోయినకొద్దీ ద్రవ్యము సమంగానే విభాగమౌతూన్నా, ఉపరితల వైశాల్యము మట్టుకు పెరుగుతుంది. గాలి రాపిడి ఉపరి వైశాల్యాన్నిబట్టినీ, భూమి ఆకర్షణ ద్రవ్యరాశినిబట్టినీ ఉండడముచేత చిన్న చిన్న ముక్కలుగా కొట్టినకొద్దీ బరువుతగ్గిన నిష్పత్తిలో ఉపరివైశాల్యము తగ్గదు. కనక తునక ధూళికరణము లాగ సూక్ష్మమైన కొద్దీ భూమిలాగిన దానికన్న గాలి తేల్చివేస్తుంది. అందువల్లనే ధూళికణము రాయికణమే అయినా, గాలిలో తేలిపోతుంది.

నిశ్చలంగా ఉన్న గాలిలోనైనా ధూళి కణాలు అడుక్కిదిగిపోక తేలి ఉండడానికిదే కారణము. ఈ ధూళి, రాతిది కావచ్చునూ, పుష్పరజము కావచ్చునూ, చిన్న మొక్కలూ క్రిములూ కావచ్చును, బొగ్గ కణము కావచ్చును, ఉప్పు కణము కావచ్చును. అగ్నిపర్వతపు ధూళికావచ్చును. క్రకేటూ అనే అగ్నిపర్వతము పగిలినప్పుడు ఆధూళి ప్రపంచమంతటా వ్యాపించి సుందర సంధ్యాదృశ్యాలకి కారణమైనదట. సూర్యుడినుంచీ మేఘాల నుంచీమనకి చేరే తెల్లనివెల్తురులోని రంగులన్నిటినీ విరజిమ్మి, ఎర్రని కిరణాల్ని మట్టుకే మన కంటికి చేరనిస్తాయి ధూళి కణాలు. కనక, మబ్బులూ సూర్యుడూ ఎర్రగా గోచరిస్తాయి.

ప్రతీ సిగరెట్టు దమ్ములోనూ సుమారు నాలుగు వందల కోట్ల సూక్ష్మకణా లుంటాయట! ప్రతీ ఘనసెంటిమీటరులోనూ లక్షలాదిగా ఉంటాయట నగరీక వాతావరణములో. ఇవి తమమీద పడిన వెల్తురులోని నీలపురంగుని ఎక్కువగా విరజిమ్మడము వల్లనే ఆకాశము వెలుగుగా ఉన్నట్టు కనబడి నక్షత్రాల్ని కనబడనివ్వడము లేదు. ధూళి అన్నదే లేకపోతే, నల్లని ఆకాశములో సూర్యుడూ, నక్షత్రాలూ కనబడవలసినదే. పగలు మబ్బు కమ్మి సూర్యుణ్ణి దాచేస్తే చీకటి అయిపోవలసిందే. నీడలలో వెల్తురేదీ పడకపోవడముచేత కటికి చీకటిగా వుండి వస్తువులు కనబడకుండా ఉండవలిసినదే. ధూళికణాలు వెల్తురును విరజిమ్ముతూండడాన్నిబట్టే ఉదయ సంధ్యాకాలములలో వెల్తురు వుంటోంది కొంచెమైనా!

91. సన్నాయి భారతీయమవా?

అసలు పేరు 'సన్నాయి' అయినా దక్షిణాదివారి ధర్మమా అని 'నాదస్వరము' అయింది సన్నాయి. మన వాద్యాలన్నిటిలోనూ నిండైనదీ, కంఠ మాధుర్యాన్ని చక్కగా అనుకరించగలిగినదీ సన్నాయే. దీనికి కారణము సన్నాయి పీక. అది గొంతులోని స్వర తంత్రులవంటి తాటాకు దళాలతోనే నినదిస్తుంది. తంత్రీ వాద్యాలూ, వేణువంటి ఇతర సుషిర వాద్యాలూ సన్నాయికి అందవు.

'షాహ్‌నాయీ'అన్న పర్షియనునామమే సన్నాయి అయిందని చక్కగా తెలిసిపోతుంది. దక్షిణదేశమునకు ఉత్తర భారతమునుంచి దిగుమతి అయిన సన్నాయి, నౌబత్తులు ఢిల్లీనుంచే వచ్చాయి. ఢిల్లీకి పర్షియానుంచి. పర్షియాకో? అంటే, ఈజిప్టునుంచి అని జవాబు చెప్పకోవాలి. ఈ జిప్టులో చాలా కాలముక్రిందటనుంచీ సన్నాయివలె నోటితో ఊది, కన్నాలు మూస్తూ చేతితో స్వరాలునడిపే సన్నాయి వాడుకలో వున్నట్లు వారి ప్రాచీన చిత్రాలనుబట్టి తెలుస్తుంది.

భారతదేశపు శిల్పాలలోగాని, వర్ణచిత్రములలోగాని మొగలుల కాలమువరకూ సన్నాయి కానరాదు. బుద్ధుడికి పూర్వపు గాథలేనేమో అని నమ్మించే జాతక కథలలో శంఖమును మాత్రమే వాయించి సంతలో సొమ్ము గడించిన వాని కథ వుంది. క్రీ. శ. 150 నాటివగు బార్హుత్ శిల్పాలలో శంఖానికి ఒక పొడుగాటి గొట్టాము నమర్చి ఆ గొట్టపుకొసని నోటిలో పెట్టుకుని ఊదుతున్న కోతి ఉంది. ఆ గొట్టానికి కన్నాలున్నట్టుగాని, వాటిని వ్రేళ్ళతో మూస్తూ నడుపుతున్నట్టుగాని సూచనలు లేవు. సాంచీలోనూ, అమరావతీ నాగార్జున కొండశిల్పాలలోనూ, పొడుగాటి బాకాలు రెండు రెండు కూడా ఒక్కడే ఊదుతున్నట్టు కనబడుతుంది కాని సన్నాయి కనపడదు. అజంతాలో శంఖమూ, వేణువేగాని సన్నాయివంటిది నాకు కనపడలేదు.

నాగస్వరము మాత్రము చాలా కాలం నుంచీ తెలిసినవాద్యమై యుండాలి. అది సన్నాయికి మాతృక అవడానికి వీలు లేదనుకుంటాను. ఏమంటే, నాగస్వరములో శ్రుతిని నిరంతరాయముగా వేస్తూ స్వరాలు వాయించడానికి అవకాశ ముంది. అనపబుర్రలో పోశేస్తున్న గాలి కిక్కిరిసివుండి, శ్రుతి బూరానీ, కన్నాల బూరానీకూడా మోగిస్తుంది. సన్నాయిలో ఈ ఏర్పాటు లేదు. సన్నాయి భారతీయము కాదు.




సంతకు పయనం


—శ్రీమతి పి. లలితకుమారి, కుప్పం.



కృ షీ వ లు లు

—శ్రీమతి పి లలితకుమారి, కుప్పం.






పడవ ప్రయాణం
—శ్రీ జి. సుబ్బారావ్ చౌదరి, మద్రాసు.



కాపరులు
. టి. వి. నరసింగరావు,
రాజమండ్రి.

పాములవాడు
—శ్రీ సి. వి. శర్మ, నల్లగొండ.



బొమ్మరిల్లు

ఢిల్లీ రైలు:

శ్రీ వాసిపల్లె వెంకటేశ్వర రెడ్డి

నల్లనల్లని పొగలు చిమ్ముచు,
థక్, థక్, థక్, థక్ శబ్దము చేయుచు,
చూడుము అదిగో శరవేగముతో
ఢిల్లీరైలదె! వచ్చెను చూడు!

బండివచ్చెను, బండివచ్చెను;
ఎచ్చట చూచిన కేకలు అరుపులు,
కూలీలందరు మూటల నెత్తుక
ఇటు అటు అటు ఇటు—పరిగిడు చుండిరి.

"తినండి బాబూ! వేడి జిలేబీ
"తాజాబర్ఫీ తియ్యని హల్వా
"గారెలు బూరెలు నేతి మిఠాయి
బండి కదలును కొనండి అయ్యా!"

పూలొక దోటను అమ్ముచున్నది
పండ్లబాలకుడు పరుగిడు చుండెను.
ఇటు రావేగమె పండ్లభ్బాయీ!
ఇటు ఇటు అంటూ ఒకామె అరచెను

రంగు రంగుల పిల్లల బొమ్మలు,
రకము రకముల మాసపత్రికలు
పెట్టెలనుండి బేరము చేయుచు
అక్కర లేదను చుండిరి కొందరు.

"ఎండాకాలం చల్లని సోడా
తియ్యని క్రష్షు, ఐసువాటరు
చల్లని మజ్జిగ త్రాగండయ్యా!
కొనండి బాబు! కదలును బండి!

గులాబి కుచ్చుల పాగా చుట్టి,
చుక్కల చుక్కల షేర్వానీతో
పంజాబీ, ఒక చక్కని యువకుడు
ఒకటవ తరగతిలోకే ఎక్కెను

నల్లని టోపీ ఎర్ర శాలువ
కప్పుకొన్న ఒక బొంబయి సేటు;
అరవ సోదరుడు అడ్డకట్టుతో
తెలుగాసామీ పంచెకట్టుతో
పరుగిడు చుండిరి జాగా కోసం.

అనేక భాషల వింత శబ్దములు
వినబడుచున్నవి గందరగోళం!
"అక్కడ యిక్కడ" "యహా వహాఁ జా"
"యివడే అవడే" "యింగే అంగే"

అయిదు నిమిషములు అయిందో లేదో
జనం సందడి సద్దు మణిగెను.
విజిలు సన్నగా వినబడు చుండెను,
పచ్చపతాకం రెప రెప లాడెను,

చిన్నలు పెద్దలు స్త్రీలు పురుషులు
అందరు ఎక్కిరి బండీ కదలెను,
కోపముతో ఒక కూత వేసి ఆ
ఢిల్లీ రైలొక పరుగు తీసినది!

సీరియల్

విచిత్ర వ్యక్తి



మూలం:- మార్క్ ట్వేన్

జరిగినకథ:—ఆస్ట్రియాలోని ఈజెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడు వాళ్లేఅయిన సెప్పీ, నికొలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీద మా ఆట స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తి వచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తామేదో గొప్పవారమని అనుకుంటారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. ఈ సృష్టి ఆదినుంచీ మానవుడు ఎంతగా హింసాకాండలు జరిపిందీ, జరుపుతున్నదీ, జరుపనున్నదీ మాకు అంతా కళ్ళకు కట్టినట్లు చూపించాడు. మానవజాతి యింతవరకు అభ్యుదయం పేరిట సాధిస్తున్నది మారణాయుధాలను కనిపెట్టటమే నని నిర్ధారణచేసి చెప్పాడు.

9

సైతానుతో మాకు పరిచయమై చాల రోజులైనా కాలంమీద, దూరంమీద అతనికి గల అధికారం మాకు ఎప్పటి కప్పుడు కొత్తగా, వింతగా కనిపిస్తూనే వుంది. అసలు అతనికి కాల దూరాలనేవి లేవేమోనని కూడా అనిపించేది. కాల దూరాలు మానవకల్పితాలనీ, అవి నిజంగా లేవనీ అతడొకసారి చెప్పాడు. భూగోళంలోని దూర దూర ప్రాంతాలకు అనేకసార్లు అతనితో కలిసి వెళ్లాము. వారాలు, నెలలుతరబడి ఆ ప్రదేశాల్లో సంచరించాము. అయినా మేము నిజానికి సెకండులో అర్ధభాగం కంటె ఎన్నడూ మా గ్రామం విడిచి వుండలేదు. ఈ సంగతి మావూరు తిరిగి రాగానే గడియారం చూస్తే స్పష్టపడేది.

మావూళ్లో మంత్రగత్తెల విచారణసంఘం ఒకటి ఏర్పడివుందని ఇదివరకే చెప్పాను. ఈ సంఘం వారికి మంత్రగత్తెలంటే ఎక్కడలేని భయం పట్టుకుంది. ఇదివరకటిలాగా యథేచ్ఛగా విచారణ చేయటానికి జడుస్తున్నారు. మాయలు, మంత్రాలు నేర్చాడని ప్రతీతి పడిన జ్యోతిష్కుణ్ణిగాని, ఇంద్రజాలాలు చేశారని దేశమంతా మారుమోగిన మార్గరెట్, ఉర్సులాలను గాని విచారణ చెయ్యటానికి వారికి ధైర్యం చాలలేదు. అందుచేత గ్రామస్థులు అధికారులతో నిమిత్తం లేకుండా తమంతట తామే మంత్రగత్తెలను శిక్షించటానికి పూనుకున్నారు. ఒకరోజున ఒక మధ్యవయస్కురాలిని పట్టుకున్నారు. ఆమె సైతాను సహాయంతో రోగాలు నివారణ చేస్తోందని అపవాదు బయల్దేరింది. ఆరోజుల్లో వైద్యశాస్త్రం చిత్రహింసలతో కూడివుండేది. కత్తి పుచ్చుకుని పరపర కోసెయ్యటం, గ్లాసులకొద్దీ రక్తం లాగెయ్యటం మొదలైన మోటు పద్ధతుల్లో వైద్యం జరిగేది. ఈ మధ్యవయస్కురాలు అవేమీ లేకుండా రోగులను శుభ్రంగా స్నానం చేయించి, శుభ్రమైన ఆహారం

★ అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు ★

★ విచిత్ర వ్యక్తి ★

ఇప్పించటంద్వారా రోగాలు నయం చేసేది. రోగాలు ఇంత సులభంగా నయమవటానికి సైతానుతో సంబంధంతప్ప మరేకారణం వుంటుంది? పట్టుకోండంటే పట్టుకోమన్నారు. ఆమె పరిగెత్తసాగింది. జనం గ్రామవీధులవెంట ఆమెని తరమసాగారు. ఆమె ఎవరింట్లో జొరబడి తల దాచుకోబోయినా ఆయింటి తలుపులు భళ్లున మూసుకునేవి. చివరి కెలాగయితే నేం పట్టుకున్నారు. గ్రామమధ్యంలో ఉరికొయ్య, ఉరితాడు సిద్ధం చేశారు. పాపం ఆమె ఏడుస్తూ, తా నే పాపం ఎరగనని మొత్తుకుంది. ఆమె కూతురు నిస్సహాయంగా నుంచుని చూస్తూ ఏడ్చింది. అప్పుడు నేనూ సైతాను కూడా అక్కడే వున్నాము.

యథా విధిగా ఆస్త్రీ ఉరితీయబడింది. అందరూ ఆమె శవంమీద రాళ్లు విసురుతున్నారు. ప్రతివాడూ తన పక్కమనిషి రాయి విసిరాడో లేదో ఓరకంటితో గమనిస్తున్నాడు. అందుచేత నేను కూడా లాంఛనంగా ఒక రాయి విసిరాను. అదిచూసి సైతాను పక పక నవ్వసాగాడు.

నవ్వు విని దగ్గిరగావున్న వారంతా నిర్ఘాంత పోయారు. సైతానుమీద (మూన్నాళ్లో అతని పేరు ఫిలిప్ ట్రామ్) అదివరకే అందరికీ అనుమానంగా వుంది. ఎవరికీ గౌరవం చూపించకపోవటం, ఊరికి కొత్తవాడైనా అందరితో నిర్లక్ష్యంగా సంచరించటం, అతని అలౌకిక సంగీతం, మొదలైనవన్నీ చూసి గ్రామస్థులు అదివరకే గుసగుస లాడటం సాగించారు. ఇప్పుడు బహిరంగంగా, ఇంతమంది గ్రామస్థులను వెక్కిరిస్తున్నట్టు నవ్వటంతో వారికి మరీ ఒళ్లు మండిపోయింది. గుంపులో ఒక వడ్రంగి వున్నాడు; మదించిన ఏనుగుపిల్లలా గుంటాడు. అతడు సైతానుకేసి చూసి—

"ఏమిటయ్యా నవ్వుతున్నావు? ఎందుకు నవ్వుతున్నావో చెప్పు అసలు నువ్వు శవంమీద రాయి ఎందుకు విసరలేదో ముందు చెప్పు," అని గర్జించాడు.

సైతాను నిశ్చలంగా "నేను రాయి విసరలేదని నీకు నమ్మకమేనా?" అని అడిగాడు.

"నమ్మకమేమిటి? ఇందాకట్నించీ నిన్నొక కంట కనిపెట్టడం లేదనుకున్నావా?" అన్నాడు వడ్రంగి.

"అవును, నువ్వు రాయి విసరలేదు. మేమూ చూశాం," అని మరి ఇద్దరు అరిచారు.

"ముగ్గురు సాక్షులు," అన్నాడు సైతాను. "మ్యూలర్ అనే పేరుగల వడ్రంగి, క్లీన్ అనే కసాయి దుకాణందారు, ఫీఫర్ అనే సాలెవాడు, ఈ ముగ్గురూ ఇందుకు సాక్షులు. ముగ్గురూ అబద్ధాలకోర్లు. ఇంకా ఎవరైనా వున్నారా సాక్షులు?"

"ఉన్నారో లేదో తరవాత చూద్దాం లే. మేము అబద్ధాలకోర్లమో కాదో తరవాత తేలుస్తాం. మేము ముగ్గురం చాలదూ నీ ప్రాణాలికి? ముందు, నువ్వు రాయి విసిరావని ఋజువు చెయ్యి."

"అవును, ఋజువుచెయ్యి," అని మిగతా జనం మీదికి తోసుకొచ్చారు.

తనకి ఇంతమంది జనం సహాయంగా రావటం చూసి వడ్రంగికి మరీ ధైర్యం కలిగింది. "అసలు నువ్వెందుకు నవ్వావో ముందు చెప్పు," అన్నాడు.

సైతాను చిరునవ్వు నవ్వి మృదుస్వరంతో సమాధాన మిచ్చాడు: "చావటానికి సిద్ధంగా వున్న ముగ్గురు పిరికి దద్దమ్మలు చనిపోయిన స్త్రీమీద కసితో రాళ్లు విసరటం చూసి నవ్వాను."

ఈమాటకు జనం హఠాత్తుగా ఎంత భయ కంపితులైందీ వర్ణించ లేదు. వడ్రంగి గుండె ఝల్లుమన్నా, మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని అన్నాడు:

"మేము చస్తామని నీకు తెలుసా?"

"నాకా? అన్నీ తెలుసు. అసలు నేను జ్యోతిష్కుణ్ణి, మీరు ముగ్గురూ రాళ్లు విసరటానికి చేతులెత్తినప్పుడే, ముగ్గురి చేతులూ చూశాను. మీలో ఒకడు వచ్చేవారం చస్తాడు. మరొకడు ఈరాత్రికి

చస్తాడు. ఇంకొకడు ఇంకో అయిదు నిమిషాల్లో గుటుక్కుమంటాడు. కావలిస్తే, అదిగో గోపుర గడియారం వుంది. చూడండి."

గుంపులో పెద్ద సంచలనం కలిగింది. అందరూ అప్రయత్నంగా గడియారంకేసి తిరిగారు. కసాయి వాడు, సాలెవాడు భయంతో పాలిపోయారు. వడ్రంగి మాత్రం ఇంకా ధైర్యంగానే వున్నాడు.

"చూద్దాం, నీ జ్యోతిష్యం ఎంతవరైటో. ఇంక అయిదు నిమిషాల్లో నీమాట నిజం కాకపోతే, ఆతరవాత నువ్వు ఒక్కనిమిషం కూడా బతకవు, తెలుసా?" అన్నాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. ఊపిరి బిగపట్టి గడియారంకేసి చూస్తూ నిమిషాలు లెక్క పెడుతున్నారు. నాలుగున్నర నిమిషాలు దాటింది. హఠాత్తుగా వడ్రంగి గుండె పట్టుకుని "బాబోయ్, నాకు చోటివ్వండి, ఊపిరాట్టంలేదు," అని అరుస్తూ, కిందపడి అరనిమిషం సేపు గిలగిల కొట్టుకుని చనిపోయాడు. జనం ఒక్కసారిగా వెనక్కి తగ్గారు. శవంవంకా, సైతాను వంకా నిర్ఘాంతపోయి చూశారు. అంతా నిశ్శబ్దంగా వుంది.

"నేను రాయి విసరలేదని ముగ్గురు సాక్ష్యం పలికారు. ఇంకా ఎవరన్నా వున్నారా? ఉంటే చెప్పండి," అన్నాడు సైతాను.

భయంతో వెర్రెత్తిపోయారు జనం. ఎవరూ అతనికి సమాధానం ఇవ్వలేదు కాని ఒకరి నొకరు తిట్టుకో సాగారు. "నువ్వే అన్నావు, అతడు రాయి విసరలేదని" "కాదు నువ్వే అన్నావు. "నువ్వూ అన్నావుగా." "నువ్వు ముందన్నావు." జాగ్రత్త నోర్మూయ్," "నేననలేదు." "తంతాను దొంగ..." మరుక్షణంలో జనం ఒకర్నొకరు కొట్టుకుంటూ గలభా మొదలెట్టారు. ఈ గలభాలో నిమిత్తం లేకుండా, ఉరితీయబడిన స్త్రీ ఉరికొయ్యనుంచి గిర గిర వేళ్లాడుతూ, ప్రాణంలేని కళ్లతో అందర్నీ చూస్తోంది.

తరవాత మేము అక్కణ్ణించి వెళ్లిపోయాము. "సైతాను అబద్ధం ఆడాడు. అతడు నవ్వింది వాళ్లని చూసి కాదు; నన్నుచూసి," అని లోపల అనుకున్నాను.

సైతాను మళ్లీ నవ్వాడు. "అవును నిజంగా నిన్ను చూసి నవ్వాను. నువ్వు ఆస్త్రీ శవంమీద రాయి విసిరావు. విసరకపోతే నీమీద ఎవరన్నా పిత్రీలు చెబుతారేమో నని భయపడి విసిరావు. అంతేగాని నిజంగా యిష్టమై విసరలేదు. అందుకని నవ్వాను. అయితే నిన్నొక్కణ్ణే కాదు, మిగతావార్ని చూసి కూడా నవ్వాను."

"ఎందుకూ?"

"వాళ్లూ నీలాగానే రాళ్లు విసిరారు."

"అంటే?"

"అక్కడ అరవై ఎనిమిది మంది మనుషులున్నారు. వారిలో కనీసం అరవై ఇద్దరికైనా, రాళ్లు విసరాలనే కుతూహలం ఎంత మాత్రమూ లేదు. అయినా నీలాగానే భయపడి విసిరారు."

"నిజంగానా, సైతాన్?"

"అవును, నిజం. మీజాతి నాకు బాగా తెలుసు. వట్టి గొర్రెలమంద. మీజాతిని ఎప్పుడు చూసినా అల్పసంఖ్యాకులే పరిపాలిస్తూ వుంటారు. అధిక సంఖ్యాకులు తమ భావాలు, విశ్వాసాలు మనస్సులోనే దాచుకుంటారు. అల్పసంఖ్యాకులు నోరు పెట్టుకుని అరుస్తారు. అందుచేత అధికసంఖ్యాకులు తలకాయలు వంచుకొని అల్ప సంఖ్యాకులనే అనుసరిస్తారు. నోరుపెట్టుకుని అరిచే కొద్దిమంది ఒకొక్కసారి నిజమే అరుస్తారు; ఒకొక్కసారి అబద్ధం అరుస్తారు. వాళ్లు చెప్పింది నిజమైనా, అబద్ధమైనా గుంపు మాత్రం వారినే అనుసరిస్తుంది.

మీ జాతిలో, నాగరికసంఘంలో వారైనా, అనాగరికసంఘంలోవారైనా, అధిక సంఖ్యాకులు దయాహృదయులే; ఇతరులకు హానికలగటం, కలిగించటం సహించలేనివారే. అయినా దౌర్జన్య పరులైన అల్పసంఖ్యాకుల ముందు తమ దయాహృదయం విప్పి, తమ అభిప్రాయం వెల్లడించటానికి జంకుతారు. ఎంత చిత్రమో చూశావా? మీలో నూటికి తొంభైతొమ్మిదిమందికి మంత్రగత్తెలను చంపటం ఇష్టంలేదని నాకు తెలుసు. అయినా ప్రతివాడూ "మంత్రగత్తెలని చంపండి" అని బైటికరుస్తాడు. బహుశా రాబోయే శతాబ్దాలలో ఎవరో కొందరు అల్పసంఖ్యాకులు మంత్రగత్తెల్ని చంప

విచిత్రవ్యక్తి

కూడదని నోరు పెట్టుకుని అరుస్తారేమో. బహుశా ఎవడో ఒకడే ధైర్యశాలి అలా అరవ్వచ్చు. ఇహ వెంటనే మిగతా గుంపంతా అతనిమాట శాసనంగా భావించి అతని ననుసరించ ప్రారంభిస్తారు.

మీజాతి చరిత్రలో ఇన్ని సామ్రాజ్యాలు, నియంతృత్వాలూ, మతాలు సంభవించాయంటే దానికి ఒకటే కారణం. ప్రతివ్యక్తికీ పొరుగువాడిమీద అపనమ్మకం. ప్రతివ్యక్తీ పొరుగువాడికి తనమీద సదభిప్రాయం ఉండాలనీ, లేకపోతే తను దుంపనాశనమై పోతాననీ భావిస్తాడు. ఇలా భావించటంవల్లనే, ఇది ఆధారం చేసుకుని ఇన్ని రాజ్యాలూ, మతాలూ వెలిశాయి. ఇంకా వెలుస్తాయి; మిమ్మల్ని ఇంకా అణగదొక్కుతాయి; ఇంకా అధోగతికి లాక్కుపోతాయి. ఎందుకంటే మీరు అల్పసంఖ్యాకులకు బానిసలు. ఈ బానిసతనం మీకు పోదు. మీజాతి గొర్రెలమంద—"

మానవ జాతిని గొర్రెలమంద అనటం బాగులేదనుకున్నాను.

"నేనన్నది అబద్ధం కాదు. యుద్ధ సమయంలో చూడరాదూ?"

"ఏమిటి?"

"ఇంతవరకూ జరిగిన యుద్ధాల్లో న్యాయంకోసం ఎవరూ యుద్ధం ప్రారంభించలేదు. మరొక పదిలక్షల ఏళ్లు గడిచినా న్యాయయుద్ధం అంటూ ఉండదని హామీ యివ్వగలను. నోరుగల అల్ప సంఖ్యాకులే ఎప్పుడూ "యుద్ధం, యుద్ధం" అని అరుస్తారు. చర్చి అధికారులు ముందు కొంచెం సందేహిస్తూ "యుద్ధం ఏమంత మంచిది కాదు," అని నసుగుతారు. అసంఖ్యాక ప్రజలు నిద్రకళ్లు తుడుచుకుంటూ, ఈయుద్ధం ఎందుకో తెలియక ఆలోచిస్తారు; "ఇది అన్యాయం; అపకీర్తికరం; యుద్ధావసరం లేనేలేదు," అని వాదిస్తారు. అప్పుడు యుద్ధం కావాలనే అల్ప సంఖ్యాకులు ఇంకా బిగ్గరిగా అరుస్తారు. అధిక సంఖ్యాకుల్లో కొద్దిమంది ఆలోచించగలిగిన వారుంటే, వారు "యుద్ధం వద్దు. యుద్ధాన్ని త్యజించండి," అని ఉపన్యాసాలిస్తారు; పుస్తకాలు రాస్తారు. వీరిని మొదట్లో అంతా ప్రశంసిస్తారు. కాని యుద్ధకాములు వీరికంటే బిగ్గరిగా అరిచి వీరి మాట ప్రజలకి వినబడకుండా చేస్తారు. యుద్ధవ్యతిరేకులు క్రమంగా పల్చబడి పోతారు. వారిమాట ఎవరూ వినిపించుకోరు. మరికొద్ది కాలానికి యుద్ధవ్యతిరేకులను ఇదివరకు పొగడినవారే ఇప్పుడు రాళ్లు రువ్వుతారు; గొంతు నొక్కేస్తారు, లోపల యుద్ధం వద్దనుకుంటున్నవారే ఇదంతా చేసేది. చివరికి వాక్స్వాతంత్ర్యం మచ్చుకైనా వుండదు. ఎవడైనా నోరు తెరిచినా నోట్లో కత్తులు దూర్చబడతాయి. దేశం దేశమంతా, చర్చితోసహా "యుద్ధం కావాలి" అని అరవటం మొదలెడుతుంది. తరవాత అధ్యక్షులు, ప్రధాన మంత్రులు మొదలైన బిరుదులు తగిలించుకున్న రాజకీయ వేత్తలు కొన్ని అబద్ధాలు కల్పిస్తారు. తాము ఏదేశంమీద యుద్ధం చెయ్యబోతున్నారో ఆదేశంమీద అబద్ధనేరాలు బోలెడు మోపుతారు. ఈనేరాలు నిజమైనవేనని ప్రజలు నమ్మి "ఆ, మనం తప్పుపని చెయ్యటం లేదు. తప్పంతా ఆదేశానిదే" అని తమ్ము తాము నమ్మించుకుంటారు. కాదని ఎవడన్నా అంటే నోరు నొక్కేస్తారు. ఈవిధంగా ఆత్మవంచన చేసుకొని తృప్తిపడి యుద్ధానికి ఆయత్తమవుతారు. ఇదీ మీజాతి గొప్పదనం!" (ఇంకావుంది)

"రేడియో వలన లాభమేమి?" మేష్టారు క్లాసు పిల్లలని అడిగాడు.

అందరికంటే ఒక్కడు ముందు లేచి "రేడియో వలన యింతకు ముందు ఎటువంటి లాభం వుండేదో నాకు ఆట్టే తెలియదు కానీండి, యీ మధ్య మాత్రం నాకు రేడియో మూలంగా చాలా లాభం కనిపిస్తున్నదండీ" అన్నాడు.

"ఆలాభమేమి?" మేష్టారు అడిగారు.

"మా వాళ్లు ఎప్పుడు రేడియో ట్యూన్ చేసినా, నామట్టుకు నేను చక్కగా క్లాసు పుస్తకం పట్టుకొని మారుమూల గదిలోకి పోయి శుభ్రంగా చదువుకొంటున్నానండీ!"

పుట్టినరోజు పండగ

ఇవాళ బుధవారం. ఆవాళే నాపుట్టినరోజు పండగ. "జాము న్నర ప్రొద్దెక్కింది, లేవరా! ఇంకా పడుకోవడ మేమిటి? ఆనిద్రకు అంతేలేదా ఏం?...అయ్...అయ్ అయ్...అయ్యో! ఇంకా తలకి నీళ్లు పోసుకోవడం ఎప్పుడూ? తెమ లడం ఎప్పుడూ! కాకపోయినా—నీకు చదువూ సంధ్యా ఏమిల్లే!? ఒకటే చదువు" నేనింకా నిద్ర మంచం మీద నుంచి లేవకుముందే మా అమ్మ మొదలు పెట్టింది.

ఇక లేవకపోతే ఎలాగా భాగో తము జరుగక తప్పదను కుంటూ విధిలేక లేచి పెరట్లోకి వెళ్ళాను, మొఖం కడుక్కుందామని.

"ఒరే అబ్బాయీ! లేచావా? ఇంకా మొఖం కడుక్కోవడం అయినా కాలేదే!... అక్కడ నీళ్లు సలసల కాగుతున్నాయ్, నూనె రాసుకు తొందరగా తెములుతావా తలంటి పోసుకొందువు గాని" అంటూ మళ్ళీ మొదలెట్టింది మా అమ్మ.

మొఖం కడుక్కున్నాను. ఆపొయ్యి దగ్గర నిలబడి ఏదో ఆలోచిస్తున్నాను. వెనక నుంచి మామామ్మ పిడక ముక్క పట్టుకు వస్తూవుండటం కనుపించింది.

"అయ్య బాబోయ్! ఇవ్వాళ పొద్దున్నే అవుతోందిరోయ్ పెళ్ళి" అంటూ పారిపోబోయాను.

అదృష్టవశత్తూ మా మామ్మ ఆపేడు ముక్కను పొయ్యిలో పడేసి నా దగ్గరికి వచ్చింది. "ఏరా! బెంకంత ఉన్నావో లేదో, నీకు పెళ్ళి కావలిసి వొచ్చిందా? నిన్న నూని రాసుకు తగులడమంటే, పరుగులు తీస్తావేం? ఊ...చూస్తావే ఆనూని రాసుకు మరీ ఏడు" అంటూ మామామ్మ మేలుకొలుపు మొదలెట్టే సరికి నేను నృత్యం చేయడం ప్రారంభించాను. ఆ సమ యంలోనే నేను ఆనూనె గిన్నెను తన్నెయ్యడం జరిగింది.

శ్రీ ఇపటూరి సాంబశివరావు

మాఅమ్మ కూడా ఆ సమయా నికే నాముందర ప్రత్యక్ష మయింది. "ఏమిట్రా! ఎందుకూ? ప్రొద్దున్నే ఏడుస్తున్నావుట. ఇంక నీ మొఖానికి పుట్టిన రోజూ...పండగా... ఏమీ లేదా ఏవిటి?" ఈమాటలు అనే సరికి ఆ నూనిగిన్నె ఆవిడ కళ్ళ బడింది కాబోలు-"అయ్యో! ఇదే విట్రా! నిన్న నూని రాసుకు కూచోమంటే నూనెగిన్నె తన్నేసి ఇంకా ఏమీ తెలియనట్టు ఏడుస్తు న్నావా! ఏడు నీఖర్మ, ఖర్మను తప్పించే వాడెవడు లే! అయినా నీకు 'అమ్మ పెట్టేవి రెండూ పెడి తేనే కాని బుద్ధిరాదు లే!" అంటూ వేదాంతంలోకి దిగి పొద్దున్నే నా వీపుమీద రెండు తగిలించి ఇంట్లోకి వెళ్ళిపోయింది. చివరికి ఎలాగయితే నేం ఆ రోజు వెయ్యి దేవుళ్లకి మొక్కుకొంటూ తలంటి పోసు కొన్నాను.

మా నాన్నగారికి నిద్ర మంచం మీదనుంచి లేవడం తడ వుగా ఆయన నోట్లో 'వెధవ' అన్నమాట రెడీగా ఉంటుంది. నన్నుచూసీ చూడగానే "ఏరా! వెధవ, తెల్లారగట్లే లేవడం, చదువుకోడం ఏమీ లేదా ఏం? పరీక్షలు దగ్గరి కొస్తున్నాయ్ కదా! అంతేలే నీకు చదువేమిటి? అదేం? వెధవ్వి అలా ఏడుస్తున్నావ్— ఎందుకు? ఏం జరిగింది?" అంటూ యధారీత్యా అక్షతలు జల్లడం ప్రారంభించారు.

మాఅమ్మ అంతట్లోకే వచ్చి "అదేవిటండి పొద్దున్నే ఎందుకు వాడినలా తిడతారు? వాడి పుట్టిన రోజు కదా ఈ వేళ" అంది—అక్క డికి తనేమో నన్ను ఎత్తుకు ముద్దాడినట్టు!

"'ఆ...! ఇవాళేనేవిటి యీ వెధవ పుట్టింరోజు? పాడ్యమికదూ? అవును...ఈవేళే." అంటూ మా నాన్నగారు పెరట్లో కెళ్ళారు.

ఇంక స్కూలు కెడదాం అను కుంటూ టైంటేబుల్ చూసుకొనే సరికి మొదటి పిరుడు ఇంగ్లీషు ఉన్నట్టు కన్పించింది. మా ఇంగ్లీషు మాష్టారంటే అందరికీ హడలే. ఒక్కసారి ఆయన గట్టిగా అరచా



★ పుట్టినరోజు పండగ ★

డంటే క్లాసులో అందరూ గజగజ వణికి పోవాల్సిందే! అది కాకుండా ఆయన ఇవాళే నోట్సు చూస్తానని నిన్న క్లాసులో అన్నమాట జ్ఞాపకం వచ్చేసరికి ఒక్కసారి నిలువునా నీరైపోయాను"

నరే-అయేదెలాగ అవకతప్పదను కుంటూ భోంచేసి స్కూలుకి బయలు దేరాను. కాని స్కూలుకి వెళ్ళుతూంటే, నిజంగా సింహానికి ఆహారంగా వెళ్లుతున్న కుందేలు ఎమనస్సుల్లా వుంటుందో, నా మనస్సులోనూ అలాగే వుంది. తీరా క్లాసులోకి వెళ్ళి కూచునేసరికి 'సోషల్ స్టడీస్ మేష్టారు' మా క్లాసులోకి వచ్చారు. అది చూసి "మాకు మీరు కాదండీ, మేష్టారు ఇప్పుడు. మాకిప్పుడు ఇంగ్లీషండీ. లాస్టుపిరుడండీ మీరు" అని గట్టిగా అరిచాను. (మేష్టారు మర్చిపోయి వస్తున్నారన్న ఉద్దేశంతో)

కాని ఆయన నా మాట విని పించుకోకుండా క్లాసులోకి వచ్చి కుర్చీలో కూచుంటూ "ఎవడ్రా ఆవెధవ? స్టాండ్ అప్" అని గద్దించాడు. కొయ్యబొమ్మలా నిలబడ్డాను.

"ఏరా! ఇవాళ నాటైంటేబుల్లో ఫస్టుపిరుడు నాకిక్కడ వుర్కుందని ఉంటే, ఇంగ్లీషని వాగుతావేం? మతి ఏమైనా పోయిందా ఏమిటి? బెంచీ ఎక్కు" అని హూకుంవేసి, తన ముక్కులో యింత పొడుం దట్టించుకొన్నాడు.

అంతట్లోకే నాఫ్రండు మోహన్ గాడు లేచి "అది కాదండి మాష్టారూ! వాడు రేపు లక్ష్మీవారం టైంటేబుల్ చెపుతున్నాడండి" అని తనకన్నీ తెలిసినట్టుగా బయట పెట్టాడు.

"అవున్రా! వాడికి చదవేస్తే ఉన్నమతి పోతోంది. వారాలే జ్ఞాపకం వుండటం లేదు. లేకపోతే ఈ వెధవకి చదువేమిటి?" అని మేష్టారు అనేసరికి నాకప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఈవాళ బుధవారం అని. కాని ఏం లాభం—?

అంతట్లోకే మా మేష్టారు "పాఠాలు అందరూ బాగా చదువుకొచ్చారా? కొశ్చన్లు అడుగుతానన్నాను కదూ-?" అన్నారు.

మళ్ళీ మా మోహన్‌గాడే లేచి 'మేష్టారూ? గుంటూరులో వేడి జాస్తీ అంటారు ఎందుచేత నండీ?

(43-వ పేజీ చూడండి)

దొంగ... దొంగ... దొంగ

శ్రీ జి. వి. జి. [illegible]

ఆవేళ గోపీకి పర్వదినం. అన్నయ్య పెళ్లికి బెంగుళూరికి, అమ్మా, నాన్నా అన్నయ్యా చెల్లాయీ తనూ, రైల్లో కూర్చొని తమాషాగా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం చేయబోతూ వుంటే పండగ కాక మరేమిటీ?

ఇంట్లో వాళ్లు అందరూ ప్రయాణానికి సిద్ధమవుతున్నారు, అందరికీ చేతినిండా పని. గోపీకి మాత్రం ఏం చేయటానికీ తోచటం లేదు-కాలు కాలిన పిల్లిలాగా, ఇంట్లోనించి బయటికీ బయటనించి ఇంట్లోకీ తిరుగుతున్నాడు. ఐనా, అప్పుడప్పుడూ ఈ హడావిడి అంతా ఎంతో పెద్ద ఎత్తున జరుగుతూన్నట్లు, అందులో తానూ పాల్గొని మహా అలసి పోయినట్లూ మొహం పెట్టేస్తున్నాడు. ఇలాంటి సంతోష సమయంలో ఏం చేయటమా అని ఆలోచిస్తూ వీధి అరుగు మీద కూర్చున్నాడు.

ఉన్నట్లుండి "దొంగ... దొంగ... పట్టుకోండి పట్టుకోండి!!" అంటూ కొంతమంది ఒక వ్యక్తిని వీధినిబడి తరుము కొస్తున్నారు. ఆ దొంగ వచ్చే సరికే పదిమందీ పోగై వాణ్ణి గోపీ వాళ్ల ఇంటి ఎదుట పట్టేసి, ఎవరిచేతి దురద తీరేదాకా, వారు ఆదొంగను కొట్టేశారు.

ఈ తమాషా అంతా చూస్తూన్న గోపీకి ఏమనిపించిందో ఏమోకానీ, చివాలున లేచివచ్చి నలుగురూ పట్టుకొని కొట్తూవున్న ఆదొంగను అందరి చేతుల సందు గుండా తనూ చేతిని పోనిచ్చి, ఎలాగో సాహసించి మెల్లిగా ఓగుద్దు గుద్దాడు. ఆ సంతోషంతో మెల్లగా మరోగుద్దు గుద్దాడు.

అందరూ కొట్టిన దెబ్బలకు ఆదొంగకు ముక్కులో నుంచీ, నోటిలో నుంచీ రక్తం కారిపోతోంది. కొన ఊపిరితో వున్న ఆదొంగ, గోపీ రెండోసారి కొట్టినప్పుడు మాత్రం కళ్లు తెరిచి వాడి



మోళీచేసే వాళ్లిద్దరు ఒకచోట తారసిల్లారు. ఒకరికొకరు పరిచయమై బాగా ఒక గంటసేపు ఆమాటా యీమాట మాట్లాడుకొంటూ వుండగా, వాళ్లల్లో ఒకడు సిగరెట్ పెట్టెకోసం జేబులు తడుముకొన్నాడు, సంచీ వెదికాడు. ఎక్కడా కనిపించలేదు.

"మామా! రెండో వాడి మనస్సులో ఏముందో నీకు తెలుస్తుంది కదా! ఆ సిగరెట్టు పెట్టె ఎక్కడ పెట్టానో కాస్త జ్ఞాపకం చేద్దూ!" అని అడిగాడు.

"ఊఁ! అయితే...ఆపాముల బుట్టలో వుంది చూడు."

పాముల బుట్ట తెరిచాడు. అందులో అగ్గిపెట్ట వుంది.

"ఇదేమిటిది? ఇది సిగరెట్ పెట్టెకాదే?" అన్నాడు మొదటి మోళీవాడు.

"నీకు కనికట్టు విద్య వచ్చుగా, దాన్నే సిగరెట్ పెట్టెగా మార్చేయ్" అని సలహా యిచ్చాడు రెండో మోళీవాడు.

దొంగ...దొంగ...దొంగ

వైపు ఓ మాదిరి ఓరచూపు చూశాడు. గోపీ గుండె అదిరిపోయింది. ఆదొంగ, వాడి వాలకం, ఆ ఎఱ్ఱని కళ్లు, ఆచూపు వాడి మనస్సులో నిలిచిపోయి ఏదో భయం ముంచుకు వచ్చింది గోపీకి.

అందరూ కలసి ఆదొంగను చేతులు వెనక్కి విరిచికట్టి పోలీసు స్టేషనుకు లాక్కొని వెళ్ళిపోతూన్నారు. గోపీ మాత్రం ఇంకా అక్కడే నిలుచొని ఆలోచిస్తూన్నాడు. "అందరూ చితగ్గొట్టూంటే, వాళ్లవంక తల ఎత్తి అయినా చూడనివాడు నాఒక్కడివైపు మాత్రం అలా ఎందుకు చూశాడు?...ఇంతకీ వాడు దొంగతనం చేయటం మాత్రం తప్పు కదూ? అందుకు వాడ్ని అందరూ కొట్టూంటే నేనూ కొట్టాను. ఇందులో తప్పేముందీ? మరి అయితే వాడు నావంక అలా చూడటంలో అర్థమేమయి వుంటుందీ? బహుశః నేను కొట్టినందుకు, 'ఇంత చిన్న పిల్లవాడు కూడా నన్ను కొట్టాడు కదా' అని వాడికి కోపం వచ్చింది కాబోలు...అట్లాగయితే నన్ను బాగా గుర్తు పెట్టుకొని జైలునించి విడుదలై రాగానే దారిలో ఎక్కడ నేను కనిపించినా నన్ను పట్టుకు చితగొట్టాడేమో?"

ఈ ఆలోచన వాడి మనస్సులోకి రాగానే గోపీ ఆపాదమస్తకం కంపించిపోయాడు. దొంగను కొట్టకుండా వున్నా ఎంత బాగుండిపోను అనుకొన్నాడు. రోడ్డు మధ్యన నిలుచొనున్న గోపీని చూసి "ఇదేమిట్రా, నడి బజారులో నిలుచొనున్నావ్? నీకేమైనా మతిపోయిందా ఏం? దర్జీవాడు కొత్త బట్టలు తెచ్చాడు; తొడుక్కొని చూతువురా" అని వీధి గుమ్మంలో నుంచే కేకేశాడు వాళ్ల అన్న.

మామూలుగా అయితే ఆమాటకు ఎగిరి గంతేసి వెళ్లాల్సిన గోపీ, ఇప్పుడు కాళ్లీడ్చుకుంటూ వెళ్ళాడు అన్నదగ్గరికి.

"అదేమిట్రా అలా వున్నావ్" అని అన్న అడిగాడు.

"అబ్బే...ఏమీ లేదే" అని బెదురుతూ జవాబిచ్చాడు గోపీ.

అసలే అన్నయ్య అసాధ్యుడు. ఈ సంగతి అన్నయ్యతో చెప్తే, ఇహ వచ్చిన వాళ్లందరి ఎదుటా తనని వేళాకోళం చేసి ఏడిపిస్తాడు. అంచేత అతడితో మాట మాత్రమైనా చెప్పకుండా తల వొంచుకొని సరాసరి ఇంట్లోకి వెళ్లిపోయాడు గోపి.

"ఎక్కడికి కెళ్లావురా, యింతసేపు? ఇలారా...ఇవి తొడుక్కొని చూడు" సరిపోతాయో లేదో" అని కేకేసింది వాళ్లఅమ్మ. గోపీ ఆమె దగ్గరికెళ్లి నిలుచున్నాడు. వాడికి షర్టు తొడుగుతూ వుండగా ఆవిడ చేతికి వాడి వళ్లు తగిలింది. "ఇదేమిటి? వొళ్లు వేడిగా వుందేం? ...జ్వరమేమైనా వచ్చిందా ఏం?" అని విస్తుపోయింది. అదంతా గోపీకేం తెలుసు? గోపీ అవస్త వాళ్లకు మాత్రం ఏం తెలుసు?

"వెళ్ళి కాస్సేపు పడుకోరా. శుభమా అని రాత్రికి ప్రయాణం పెట్టుకొని ఇంతలో ఇదేమిటిరా!" అంటూ గోపీవాళ్ల అమ్మ కంగారు పడ్డది.

గోపీకి తల తిరిగిపోతోంది. వెళ్ళి మంచం మీద పడుకున్నాడు. తలలో ఏదో పోటుకూడా ప్రారంభ మైంది. ఎంతసేపూ ఆదొంగ గురించిన పాడు ఆలోచనలేవస్తున్నాయి. కళ్ళు ఎంత గట్టిగా మూసుకున్నా ఆదొంగా, వాడిచూపులు కనిపించకుండా పోవటంలేదు.

ఎప్పుడు కన్నుమూశాడో ఏమో కానీ, సాయంత్రం వాళ్ళ నాన్న వచ్చి "ఇప్పుడెలా వుందిరా" అని వొంటిమీద చెయ్యివేసి చూసే వరకూ గోపీకి మెళుకువే రాలేదు.

అమ్మ కాఫీ తెచ్చియిచ్చింది. తాగి వెంటనే వాంతి చేసుకున్నాడు. ఉన్నట్లుండి వీడికి యీ జ్వరమెలా వచ్చిందా అని అందరూ ఆశ్చర్య పోతున్నారు.

"ఊఁ... వాడి బట్టలూ, అవీ తీసుకొన్నారా; బండికి వేళయి పోతోంది?" అని లేచి పోబో యాడు గోపీ వాళ్ళనాన్న.

"నాన్నా" అని బలహీనంగా మూల్గాడు గోపీ.

"ఏంరా?"

"దొంగ తనం చేసిన వాళ్ళని, ఎన్ని నెలలు జైల్లో పెడ్తారు నాన్నా?" తడబడే గొంతుకతో ప్రశ్నించాడు గోపీ.

"ఏం? ఇప్పుడా సంగతెందుకూ? కొంప దీసి నువ్వెక్కడా దొంగ తనం చేయలేదు కదా?" అని తిరుగు ప్రశ్న వేశాడు నాన్న.

"ఎబ్బే లేదు! ఊక్కే-అడిగా" అని వూరుకున్నాడు గోపీ. ఆ ప్రశ్నను ఎందుకు అడిగితినా అనిపించింది గోపీకి.

"మందుకు వెళ్ళినవాడు ఇంకా రాలేదేమి-వేళయిపోతోంది" అని తొందర చేస్తూ అక్కడ్నించి వెళ్ళి పోయాడు గోపి తండ్రి.

గోపీకి మాత్రం కళ్ళు మూసుకున్నా తెరిచినా ఆదొంగే కనిపిస్తున్నాడు.

రైలు ఏదో వంతెన మీదగా పోతోంది. ఆచప్పుడుకి తృళ్ళిపడి కళ్ళు తెరిచాడు గోపీ. అంతవరకూ తాను రైల్లో ప్రయాణం చేస్తున్నాడన్న విషయం గోపీకి తెలియనే తెలియదు. ఇప్పుడు వొంట్లో భారం



★ దొంగ....దొంగ....దొంగ ★

తగ్గి ఏదో కాస్త తేలికగా ఉన్నట్లు తోచింది.

గోపీ నాన్న వాడి దగ్గరకొచ్చి ఒంటిమీద చెయ్యివేసి చూసి "కాస్త తగ్గింది పర్వాలేదు" అని వాడి మెడవరకూ శాలువా కప్పి, గోపీ అన్నదగ్గరి కెళ్ళి "నేను కూడా కాసేపు కళ్లు మూస్తాను. పైనవుండే ఆసూట్ కేస్ జాగ్రతగా చూస్తు వుంటావా? వాళ్లు మరచి నిద్ర పోయేవు సుమా!" అని ఆవలిస్తూ పరుపు చుట్టమీద తల ఆనించి కళ్లు మూశారు.

గోపీకి వొళ్లాంతా చెమట పట్టేసింది. కాళ్లతో శాలవ తన్నేసి, మెల్లగా అటు చూశాడు.

అమ్మ నోరు తెరుచుకొని నిద్రోతూంది. అమ్మ తొడమీద పడుకొని చెల్లాయి గాఢ నిద్రలో వుంది. నాన్న అప్పుడే గుర్రు పెట్టున్నారు. అన్నయ్య నోరు తెరిచి పెద్దగా ఆవులిస్తూ, కునుకు పాట్లు పడుతూన్నాడు. అతని ప్రక్కన ఎవరో పెద్దమనిషి పైపు త్రాగుతూ పేపరు చదువుకొంటున్నాడు. అంతే-ఆపెట్టెలో ఇంకెవరూ లేరు.

అప్రయత్నంగా పైకేసి చూశాడు గోపీ. అక్కడ "దొంగలున్నారు జాగ్రత" అని వ్రాసి వుంది. అది కంటబడే సరికి గోపీ బుల్లి మెదడులో మళ్ళీ పోటు ఆరంభమైంది. ఆవేళ మధ్యాహ్నం జరిగిన సంఘటన మళ్ళీ గుర్తుకొచ్చింది. ఆదొంగను ఆరునెలల తర్వాత జైలునించి విడుదల చేసినట్లూ, ఒకరోజు తాను బడినించి ఇంటికి వస్తూండగా, దారిలో ఆదొంగ తనను పట్టుకొని మెడ నలిపి పారవేస్తున్నట్లూ ఏమిటేమిటో కలలా వచ్చింది.

"అమ్మోమ్మవ్...దొంగ దొంగ" అని గావు కేక పెట్టేశాడు. రైలు ఒక్క కుదుపు కుదిపి ఏదో స్టేషనులో ఆగిపోయింది. గోపీ వేసిన కేకకు ఆ పెట్టెలోని వారందరూ త్రుళ్లిపడి లేచారు. ఇవన్నీ ఒకేసారి జరిగిపోయాయ్.

జారిపోయే పంచెను సర్దుకుంటూ గోపీ దగ్గరకు పరుగెత్తుకొని వచ్చి "దొంగా? — ఎక్కడ్రా?" అని ప్రశ్నించారు గోపీ నాన్న.

గోపీ అన్నకు ఏమీ అర్థంగాక తికమకలు పడుతూ, పైన పెట్టిన సూట్ కేస్ కోసం చూశాడు. అది అక్కడలేదు! గభాలున లేచి కంపార్ట్మెంట్ దిగి, స్టేషనులోకి పరుగెత్తాడు, చీకటిని చీల్చుకొంటూ.

ఇదంతా తెల్లబోయి చూస్తూన్న గోపీ అమ్మ "భయపడ్డాడేమో నండీ. కలవరించి వుంటాడు" అన్నది.

"కలవరించేదేమిటే, నీమొహం! మన సూట్ కేస్ ఏమయిందీ...? అన్నయ్య ప్రక్కన కూర్చొనుండిన ఆసూట్ వాలా ఏమయ్యాడ్రా" అని గోపీ కేసి చూస్తూ గర్జించాడు వాళ్ళ నాన్న.


"అసలే జ్వరమొచ్చి వాళ్లు తెలియక పడివుంటే వాడ్నడుగుతా రేమిటండీ?" వాళ్లఅమ్మ గోపీని వెనక వేసుకు రాబోయింది.

"ఏడవలేక పోయారు. అందరూ దద్దమ్మలే! నేను ఇంటి దగ్గరే చెప్పా—ఆ సూట్ కేస్ మీద ఓకన్నేసి వుంచమని. ఎవళ్లమటుకు వాళ్లు ఒళ్లు ఎరగకుండా నిద్రకు పడ్డారు. పెళ్లికోసం కొన్న చీరలూ, నగలూఅన్నీ ఆపెట్టిలోనే పెట్టాను. ఇప్పుడు అమ్మా, కొడుకూ యిద్దరూ ఒకరితల ఒకరు పట్టుకొని ఏడ్వండి-అక్కడికి పోయింతర్వాత ఏం చేస్తారో? దొరికారు-త్రాష్టాలు!" అని పెద్దగా కేకెట్టున్నాడు గోపీ నాన్న.

కొంత సేపటికి రొప్పుతూ రొజుతూ గోపీఅన్న పరుగెత్తుకొని పెట్టిలోకి వచ్చాడు. "సూట్ కేస్ దొరికింది నాన్నా. దొంగకూడా దొరికాడు. ఆ వెధవే - ఇక్కడ యింతసేపు నా ప్రక్కన కూర్చో లేదూ? ఆ 'జంటిల్ మన్' ఆసూటూ, ఆ వాలకమూ చూడబోతే ఏదో పెద్దమనిషిలా వున్నాడు. ఈ స్టేషనులో అప్పటి కప్పుడే బండి దిగిపోయి, నేవెళ్లే సమయానికి గేటుగుండా పోబోతూన్నాడు. నేను వెళ్లి గట్టిగాపట్టుకొని పెద్దగా కేక పెట్టేశాను అంతే! అందరూ వచ్చి పట్టుకున్నారు... నాన్నా! నువ్విప్పుడు బండిదిగి రావాలీ. మనం రిపోర్ట్ ఇచ్చి వచ్చేటంత వరకూ బండి కదలదు" అంటూ గుక్క తిప్పుకోకుండా చెప్పేసి, నాన్నను పిల్చుకొని పోతూంటే "త్వరగా వచ్చేయండి.

(56-వ పేజీ చూడండి)

జంతుకోటిలో మానవలక్షణాలు



(గత సంచిక తరువాయి

మానవుడు మచ్చిక చేసుకొన్న కుక్క, పిల్లి, గుర్రం, యీమూడు జంతువులూ కూడా వాటికివున్న తెలివి తేటలను పరీక్షచేసి చూస్తే చప్పబడి పోయినట్లు వెనుకటి వ్యాసాలలో ఋజువు అయింది.

మచ్చిక చేసినందువల్ల జంతువుల తెలివి తేటలు ఏమైనా మొద్దుబారి పోతున్నాయేమో నని చూడవలసి వుంది. ఈ విషయాల్లో విశేషించి కృషిచేసి పరిశోధనలు చేసిన పండితులు, మచ్చిక మూలంగా జంతువుల తెలివితేటలు తగ్గిపోగలవనే అభిప్రాయాన్నే బలపరుస్తున్నారు. ఏదైనా ఒక జంతువు స్వేచ్ఛగా వున్నంత కాలం అది తన ఆహారం కోసం ఎన్నో రకరకాల ఎత్తులు తప్పని సరిగా వేయవలసి వస్తుంది. అలా ఎత్తులు వేయటంలో, దానికి ఎంత మాత్రపు తెలివితేటలు వున్నా కూడా వాటికి పదును పెట్టుకోవటం జరుగుతుంది. మనిషి ఎవడైనా ఏదో ఒక జంతువుని దగ్గరకు తీసి పెంచటం ప్రారంభించాడంటే, దాని తిండిని గురించిన బాదర బందీ అంతా అతడే పడతాడు. ఆ కారణంచేత ఆ జంతువుకి అంతకుముందు వున్న తెలివి తేటలు కూడా వాడుక లేకుండా పోయి, బుద్ధి మందగిస్తుందంటే ఆశ్చర్యం ఏమీ లేదు.

డాక్టర్ రీస్ అనే శాస్త్రజ్ఞుడు యీ విషయంలో వీలైనన్ని పరిశోధనలు చేశాడు. న్యూయార్క్ మహానగరంలోని గల్లీలలో తిరుగాడే పిల్లులను ఆయన పట్టుకొచ్చి కొన్ని పరిశోధనలు చేస్తూ వుండగా యీవార్త ఆనోటా ఆనోటా పాకింది. ఆవార్త చెవిని పడగానే గొప్పయింటి ఆడపడుచు ఒకావిడ తన పెంపుడు పిల్లిని చంక నెత్తుకొని యీ డాక్టర్ రీస్ గారి దగ్గరకు పరిగెత్తుకు వచ్చి "పిల్లుల తెలివితేటలు పరీక్ష చేయాలను కొంటున్నారట; పరీక్ష చేస్తే నాపిల్లి లాంటి పెంపుడు పిల్లిని పరీక్ష చేయాలికాని, 'కచడా' పిల్లుల్ని పరీక్షచేస్తే ఎలా తెలుస్తుంది?" అని అడిగిందట.

కేవలం ఆవిడగారి అహంకారాన్ని సంతృప్తి పరచటం కోసమే యీ డాక్టర్‌గారు, పాలూ మీగడా మేసి మారాంచేసే యీ పిల్లిని కూడా పరీక్షలో పెట్టటానికి ఒప్పుకొన్నారు. గల్లీలలో బ్రతికే పిల్లులను పరీక్షించినట్లే, దీన్నీ ఒక బోనులో పడేసి, బోను యివతల చేపముక్కలు పెట్టించి చూశారట. చేప మాంసం వాసన తగలగానే గల్లీ పిల్లి గింజుకు లాడుతూ వుండటం పరిపాటిగా చూసిన యీ డాక్టరుగారు, యీ 'పెట్టి పుట్టిన వారి యింటి పెంపుడు పిల్లి' ఆ చేప మాంసం తనవంటి కులీనులు కన్నెత్తి అయినా చూడకూడదని గడ్డికింద జమకట్టి, వున్న చోటినుంచి వీసమైనా కదలలేదు. మామూలు మనుష్యు లెవరూ తినలేనంతటి ఖరీదైన తినుబండారాలను అనుదినమూ యజమానురాలి చేత బ్రతిమాలించుకు తినే యీపిల్లికి

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

వెధవ చేపముక్కలు చూస్తే నోరు వూరుతుందా!

డాక్టరుగారు ఆవిడకు యీ విషయమంతా వివరించి చెప్పి, ఒక్కవారం రోజుల పాటు యీ పిల్లి కడుపు మాడ్చి, అప్పుడు తన వద్దకు పట్టుకువస్తే మరొకసారి పరీక్షచేసి చూస్తానన్నాడు. ఆవిడ అలాగేచేసి ఒకవారం రోజుల తరువాత మళ్లా ఆపిల్లిని చంకను పెట్టుకొని డాక్టరుగారి వద్దకు వచ్చింది. ఈసారికూడా ఆ పిల్లిని బోనులో పెట్టేసి, యివతలగా యిన్ని చేపముక్కలు పడేశారు. క్రిందటిసారి కాలు కదపకుండా కూర్చొన్న యీపిల్లి, యీసారి కొంతసేపు ఆచేప మాంసంకేసి చూసి చూసి ఒక్కసారి లేచి బోనులో అటు, నుంచి యిటు, యిటునుంచి అటు తిరిగి మళ్లీ వచ్చి మామూలుగా కూర్చొండి పోయిందట. అంతేకాని మిగిలిన గల్లీ పిల్లులలాగా ఆబోను వూచలమీద కాళ్లతో బరకటం కానీ, బయటకు రావాలని తంటాలు పడటం కానీ చేయనే లేదు.

దీనిని బట్టి తేలిన సారాంశం ఏమిటంటే - పరాయి వారెవరో తిండి తెచ్చి పెట్టితే తిని కూర్చోవటం అలవాటై పోయిన అన్ని జీవాలూ (మనుష్యులు సహా) ప్రస్థితి తారుమారై ఎంత ఆకలి అవుతున్నాకూడా తినుబండారాలు సంపాదించటం కోసం తాముగా కష్టపడక, వెనుకటి దర్పం దర్జా నిలబెట్టుకోవాలనే తంటాలు పడతాయి.

మన యిళ్లలో తిరుగాడే యీ పిల్లులలో దాని పూర్వీకులైన అడివిజాతి జంతువుల లక్షణాలు కొన్ని లేకపోలేదు. ఒళ్లు అలవకుండా వచ్చినచోట పడుకొని వుండిపోవటం మనయింట్లో తిరిగే పిల్లికి ఎంత మామూలో, అడవుల్లో తిరిగే సింహానికీ, బావురు పిల్లికీ, 'ప్యూమా' అని పిలవబడే ఒకరకం పులికీ కూడా ఒళ్లు అలవనీయకుండా కాలం గడుపుకు పోవటం అంత పరిపాటే! ఈమాదిరి సోమరి లక్షణం వున్నందు వల్లనే పిల్లి అధోగతి పాలైంది. మనిషికి లొంగిపోయిందువల్ల దానికి జీవితంలో కావలసిన ఏవో కొన్ని సుఖాలు ఒనగూరాయన్న మాట నిజమే కానీ, అందువల్ల దాని మెదడులో చురుకుదనం మాత్రం లేకుండా పోయింది.

పాపం - గుర్రానికి కూడా యిలాగే అన్యాయం జరిగింది. మనిషి దీన్ని మచ్చిక చేసుకొని, దానిబుద్ధికి సహజ వికాసంలేకుండా పుణ్యం కట్టుకొన్నాడు. మొట్టమొదటిసారిగా గుర్రాన్ని బండికి కట్టటమనేది యిప్పటికి ఎన్ని వేల సంవత్సరాల క్రితం జరిగిందో కానీ, ఆనాటి నుంచి నేటివరకు గుర్రానికి ఏ విషయాన్ని గురించీ స్వతంత్రంగా ఆలోచించ వలసిన అవసరం లేకుండా పోయింది.

గాడిదలను కూడా మనిషి మచ్చిక చేసుకొన్న మాట వాస్తవమే. కానీ, గుర్రాన్ని వాడుకొన్నంతగా, గుర్రం విషయంలో ఆతడు పట్టించుకొన్నంత ఎక్కువగా, గాడిదను వాడుకోనూ లేదు, దాని విషయమై అంతశ్రద్ధ తీసుకోనూ లేదు. అందు చేతనే గాడిదకు స్వతసిద్ధంగా వుండే తెలివి తేటలేవో తెలివి తక్కువ పనో అది మొద్దుబారి పోకుండా అలాగే వున్నాయి. గాడిదలను కూడా వ్యవసాయానికి వాడటం కొన్ని దేశాలలో వాడకంలో వుంది. అయినప్పటికీ, గుర్రాలనీ, గాడిదలనూ కూడా సేద్యానికి వుపయోగించి చూసిన రైతులు సామాన్యంగా గుర్రాన్నే మెచ్చుకొంటారు. రైతు చెప్పినట్లు వినటానికి గుర్రం తొందర పడినంతగా గాడిద తొందరపడదు. తన తెలివితేటలనో, తెలివి తక్కువనో వుపయోగించి, తానే ఏదో పని అడ్డదిడ్డంగా చేసేస్తుంది.

[ఇంకావుంది]

బస్తీలో గస్తీలు తిరిగిన మా మేనమామ ఒకసారి మా పల్లెటూరికి వచ్చాడు. మమ్మల్నందరినీ మెప్పించాలనీ, నవ్వించాలనీ ఆయన ఏవేవో చమత్కారాలు చెప్పకుపోవటం మొదలు పెట్టాడు. ఆయన చెప్పినవి అన్నీ చప్పగా వున్నాయి. మావాళ్లు ఎవ్వరూ నవ్వటం లేదు. నేను మాత్రం ప్రతి దానికీ పగలబడి నవ్వటం ప్రారంభించాను. నన్ను చూసి కాబోలు - మావాళ్లూ కొద్ది కొద్దిగా నవ్వటం ప్రారంభించారు.

కొంతసేపు గడిచాక మా అన్నయ్య నన్ను రహస్యంగా అడిగాడు... "ఏంరా? మామయ్య చెప్పేవన్నీ నీకు అర్థమౌతున్నాయా- అంతగా నవ్వుతున్నావ్?" అని.

"అది కాదురా? మనం ఎవరమూ నవ్వకపోతే, ఆయన చెప్పిందే చెప్పి మళ్లీ మన ప్రాణాలు తోడెయ్యగలడు. ఆ ఆపద తప్పించటానికే నేనింత యాతన పడుతున్నాను." అని నేను మావాడి చెవిలో వూదాను.

పుట్టినరోజు పండగ

(36-వ పేజీ తరువాయి)

అని దీర్ఘం తీసుకుంటూ వికటంగా ఒక ప్రశ్న వేశాడు.

ఆ సమయానికే నాకు నిన్న చెప్పినటువంటి బెలూచిస్థాన్ గురించిన పాఠం జ్ఞాపకం వచ్చింది. అక్కడ వేడి అంత అపరమితమనీ, వర్షం చాల తక్కువగా కురుస్తుందనీ, అది అంతా రాతి ప్రదేశమనీ, అన్నీ ఒక్కసారే జ్ఞాపకం వచ్చేశాయి.

ఇంకేం - ?గుంటూరు కూడా బెలూచిస్థాన్‌లోని దని నిర్ధారణ చేసేశాను. ధీమాగా 'సమాధానం చేస్తాన'ని మేష్టారుతో అన్నాను.

'సరే, చెప్పు' అన్నారు మేష్టారు.

నదురు బెదురు లేకుండా "గుంటూరు బెలూచిస్థాన్‌లోని దవడంచేత అక్కడ వేడి అపరమితము"ని చెప్పేసేసరికి ఎందుకో మా మేష్టారు కూచున్న పళంగా నుంచొన్నారు. క్లాసులో పిల్లలందరు ఒక్కసారి నవ్వడం మొదలు పెట్టారు.

మా మేష్టారు నుంచున్న పళంగా రెండంగల్లో నాదగ్గరికి వచ్చేశారు. "అవున్నా... వెధవా...! గుంటూరు బెలూచిస్థాన్‌లో ఉందికదూ...? నే చెప్పలేదూ? లేకపోతే నీకు చదువెందుకురా...!?" అంటూ నా వీపుమీద రెండు వడ్డించి వెళ్ళిపోయి, కుర్చీకి సరిపడా కూర్చొన్నారు.

ఆవాళ ఏలాగయితే నేం- స్కూలు ముగిసింది. ఇంటి కొస్తున్నా.

అంతట్లోకే మా అమ్మ గుమ్మంలో నుంచొని "ఏరా ఏడుస్తూ వస్తున్నావ్? మేష్టారు కొట్టారా...? ఆఁ...!అయిందీ...! అన్నంతపనీ జరిగిందీ...? నే చెప్పలేదూ...! ప్రొద్దున్నే లేచి చదువుకోరా అని బతిమాలినా వింటేగా?"అంటూ నేనింకా వీధిలో ఉండగానే మొదలెట్టింది.

నేను లోపల కెళ్ళేసరికి "ఏదీ ఎక్కడ కొట్టారు చూపించు!... అవున్లే! నీకు నిజంగా తగలవలసిందేలే-! కాస్త మంచీ చెడ్డా ఉండక్కరలేదూ...? అవున్లే కాని' నీకిచ్చిన 2 రూపాయల కాగితం అక్కడ పడేసి పోయావుకదా... ఏం? డబ్బంటే అంత నిర్లక్షమా?" అంటూ మరో రెండు వీపుమీద తగిలించింది మా అమ్మ.

ఇంతట్లోకే మా నాన్నగారక్కడికి వచ్చి "కొత్త బట్టలు తెచ్చాను. ఇవి తొడుక్కొని ఈ రూపాయి తీసుకొని నీయిష్టం వచ్చినట్టు తగలబెట్టుకో" అంటూ ఓరూపాయి నా మొఖాన గిరాటేశారు.

ప్రొద్దుటి నుంచీ పట్టుకొన్న నా ఏడుపు ఒక్కసారిగా మాయమైపోయింది. ఎగిరి గంతేసి రూపాయి తీసుకొన్నాను. కొత్త బట్టలు తొడుక్కొని వీధిలోకి పరిగెత్తాను.

ఎన్ని దెబ్బలు తిన్నా, ఎంత పడ్డినా పుట్టినరోజు పెద్ద పండుగే సుమా అనిపించింది, నామటుక్కు నాకు! ★



రాజ్‌కపూర్ ఫిల్మ్స్ వారి 'ప్రేమ లేఖలు'లో నర్గీస్.



ఎమ్. ఆర్. ఏ. వారి "లేడీ డాక్టర్"లో ఒక సన్నివేశం: విజయకుమార్, జగదీశ్వరి, కల్యాణం.

★ సినిమాపరిశ్రమ, ప్రభుత్వశాసనాలు ★

సినిమా పరిశ్రమ గురించి పరిశీలన జరిపి పాటిల్ కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన దీర్ఘ నివేదికలో రెండు ముఖ్య సూచనల్ని మాత్రం గ్రహించి ప్రభుత్వం శాసనాలు చెయ్య తలపెట్టినట్లు, భారత ప్రభుత్వ సమాచార శాఖామంత్రి డా॥ బి. వి. కేస్కర్ మద్రాసులో తెలియచేశారు. సినిమాపరిశ్రమకు పెట్టుబడి సహాయంచేసే ఫిల్మ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్థాపించడం ఇప్పుడు సాధ్యపడదనీ, రాష్ట్రప్రభుత్వాలకు సంబంధించిన వినోద సుంకాల విషయంలో భారతప్రభుత్వం జోక్యం చేసుకోలేదనీ కూడా చెప్పారు. పన్నులభారం తగ్గించాలని సినిమా పారిశ్రామికులుచేసే ఆందోళన రాజకీయాందోళనగా పరిణమిస్తున్నదన్నారు. సినిమెటోగ్రాఫ్ ఆక్టుకు తలపెట్టిన సవరణల్ని సమర్థించుకున్నారు. రాబడిపన్ను వసూలుచేసే పద్ధతిని గురించి వాసన్ గారి విమర్శలకు మంత్రిగారు సమాధాన మివ్వలేదు. అటు మంత్రిగారూ, ఇటు దక్షిణభారత సినిమా వాణిజ్య సభవారూ, సినిమా టెక్నిషియన్లూ దేశానికి సినిమా చేస్తున్న, చేయగల, చేయవలసిన సేవ అమూల్యమైనదని వివరించి చెప్పుకున్నారు


మంత్రిగారు వచ్చి వెళ్లారుకాని సినిమా పరిశ్రమకు సంభవించిన ఆర్థిక సమస్యల్ని గురించి పారిశ్రామికులకు తెన్ను తోచకుండానే ఉండిపోయింది. మంత్రిగారి రాకవల్ల పరిశ్రమ సమస్యలు పరిష్కరించబడిపోతాయని ఎవ్వరూ భావించకపోయినా, కనీసం ఈ సమస్యల్ని గుర్తించి త్వరలోనే ఏదో చర్య తీసుకోడానికి ప్రభుత్వం యత్నిస్తుందని కాని, పారిశ్రామికులతో సహకార భావంతో సమస్యల పరిష్కారానికి యత్నించగలరని కాని సూచనైనా లేకపోవటం ఆశాభంగం కలిగించక తప్పదు. ఫిల్మ్ కౌన్సిల్ స్థాపన ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్న ఒక్క మాటతప్ప పరిశ్రమవారికి ఆశాజనకమైన సూచన మరొకటి లేకపోయింది

అయితే ఈ సందర్భంలో కొన్ని పరిస్థితుల్ని గమనించినట్లయితే ఈ సమస్యలు సులువుగా పరిష్కారం కావటం కష్టమనీ, ఇవి పరిష్కరించబడాలంటే ప్రభుత్వానికీ పారిశ్రామికులకూ మధ్య సహకారం, విశేషమైనకృషీ అవసరమనీ గుర్తించవచ్చు.

★ సినిమాపరిశ్రమ, ప్రభుత్వశాసనాలు ★

సినిమా పరిశ్రమకు ప్రాతిపదికలైన ప్రధానాంశాలనే గమనించి చూడవచ్చు. నిరక్షరాస్యులైన ప్రజానీకంపైనా విద్యావంతులైన యువతీయువకులపైనా సినిమాలకు గల ప్రభావం అమోఘమైనదని ఉభయత్రా పలుకుతున్నమాటే. అయితే ఈ ప్రభావాన్ని గుర్తించే పారిశ్రామికులు సినిమాలను నిర్మిస్తున్నారా అంటే, చాలవరకు లేదని చెప్పక తప్పదు. ఈ ప్రభావాన్ని గుర్తించిన ప్రభుత్వం పరిశ్రమను సక్రమ పథంలో పెట్టడానికి నిర్మాణాత్మకమైన కృషిగాని ఉత్తమచిత్రాల నిర్మాణానికిచ్చిన దోహదం కాని ఏమున్నదంటే లేదనే చెప్పాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మితమైన ప్రచార చిత్రాలు సమాచార చిత్రాలు అనుకున్నంతగా ఫలించడం లేదు. కేవలం వినోదంకోసమే చిత్రాలు నిర్మించబడుతున్నాయంటే పారిశ్రామికులు అంగీకరించరు. వినోదంకోసమేనంటూ తీసిన చిత్రాలవల్ల దుష్ప్రభావం లేకుండా పోవడంలేదనే విషయాన్ని కొంతవరకైనా నిర్మాతలు ఒప్పుకుంటారేమో! ప్రతి చిత్రంవల్లనూ ప్రజానీకంలో ఎవరో ఒకరిపైన మంచికో చెడ్డకో ఏదో ఒకరకం ప్రభావం లేకుండాపోవడం లేదనే విషయాన్ని అందరూ గ్రహించి జాగ్రత్తపడితే సినిమాలపైన వస్తున్న విమర్శలకు తావుండదు. సినిమా పరిశ్రమకు ద్రవ్యార్జనతో పాటు దేశంలో గౌరవాదరాలు మన్నన లభించాలంటే, ప్రజలపై సినిమాలకు గల ప్రభావాన్ని గుర్తించి నిర్మాతలు జాగ్రత్త వహించడం అవసరం.

సినిమాలకుగల ప్రభావం గురించి ఇవాళ కొత్తగా చెప్పనక్కరలేదు. కాని ఇది ఎంత బలీయమైనదో ఇంకా పూర్తిగా అవగాహన కాలేదని మాత్రం చెప్పాలి. పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే, విద్యార్థులు, పల్లెటూళ్ళలోని యువతీ యువకుల భావరీతులలో 'సినిమా వ్యూహాలు' 'సినిమా పోకళ్లు' 'సినిమా త్యాగాలు' 'సినిమా ప్రేమలు' 'సినిమా వేషాలు' 'సినిమా చీరలు', 'సినిమా బుష్‌కోట్లు' 'సినిమా లాల్చీలు' వగైరా ఎంతవరకూ వ్యాపించిపోయాయో గమనిస్తే చాలు తెలుస్తుంది. ఈ ప్రభావాన్ని గుర్తించిన నిర్మాతలు 'గిడిగిడి' 'ఘాటు ప్రేమ'వంటి చెణుకులూ ట్రిమ్మీపాటలకోసం వెతుకు



అరుణాచల గుమస్తాలో పేకేటి శివరాంను అనుమానించి యింట్లోంచి వెళ్లగొట్టున్నారు.
ముదాంకోళి వెంకయ్య



నర్తకి:- చిత్రకారుడు: చి|| శేషాద్రి (బెసెంట్ థియోసాఫికల్ స్కూల్, అడయారు, మద్రాసు.) నేషనల్ ఆర్ట్ గాలరీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంలో మద్రాసు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బాలబాలికల చిత్రకళా ప్రదర్శనంలో యీ చిత్రానికి (5-6 సం||ల గ్రూపు) ప్రథమ బహుమానం వచ్చింది

తున్నారు. అధిక ధనార్జనకోసం వినోదం హెచ్చుపాలుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు కాని, యువజనులపైన దుష్ప్రభావం కలుగకుండా చూడాలనే జాగ్రత్త అక్కడ కనపడదు. అలా జాగ్రత్త పడనంత వరకూ సినిమాపరిశ్రమకు చౌకబారు ప్రచారమే తప్ప గౌరవమర్యాదలు లభించవు. ఈ సందర్భంలో పృధ్వీరాజ్ కపూర్ చెప్పిన మాటల్ని అందరూ గుర్తించడం మంచిది. "మనం (అంటే సినిమాలో పాల్గొనేవారందరూ నాటకకళలో పాల్గొనేవారూ) దేశానికి తెన్ను చూపే ఆచార్యులం. ఆ గౌరవాన్ని ఆర్జించుకునే శక్తి మనచేతిలోవుంది. మనం మన కర్తవ్యాన్ని గుర్తించి ఆ గౌరవాన్ని ఆర్జించినప్పుడు ప్రజలే మన అండను నిలబెడతారు. ప్రభుత్వంవద్ద దేహీ అని చేయి చూపనక్కరలేదు. ఆ సౌకర్యం కావాలి ఈ సదుపాయం కావాలి అని యాచించనక్కరలేదు" అన్నాడు పృధ్వీరాజ్. దేశంలో ఆచార్య స్థానాన్ని అలంకరించవలసిన పరిశ్రమ కర్తవ్యాన్ని ఇంతవరకూ గుర్తించలేక పోయిందని చెప్పకతప్పదు.

ఆచార్యగౌరవం మాట అటుంచి దొంగల్ని చూసినట్లు ప్రభుత్వం కొత్తశాసన నియమాలు తేవడం చింతించవలసినవిషయం. ప్రభుత్వం ఇంతవరకూ సినిమా పరిశ్రమపట్ల స్థిరమైన విధానాన్ని అవలంబించలేక ఇప్పుడు పారిశ్రామికుల పైనే పూర్తిగా దోషాన్ని ఆరోపిస్తూ నియమాల నతిక్రమించేవారికి ఖైదు విధించే శిక్ష నేర్పాటు చెయ్యడం పరిశ్రమకే కాదు ప్రభుత్వానికి కూడా గౌరవం కాదు.

పరిశ్రమ ఆర్థికసమస్యల్ని గమనించినా ప్రభుత్వవైఖరిగాని నిర్మాతల పద్ధతులుగాని పూర్తిగా సమర్థనీయం కావు. పన్నుల భారం చాలవరకు ప్రేక్షకులే భరిస్తున్నప్పటికీ నిర్మాతలకు పెట్టుబడి చేర్చుకోడానికీ, రాబడి పన్నులు కట్టడానికీ, పెట్టిన పెట్టుబడికి లాభసాటి సినిమాలపైనకూడా ఆదాయం తిరిగి రాబట్టుకోడానికీ దుర్ఘటమౌతోంది. ఈ చిక్కులకు కొంతవరకు నిర్మాతలే బాధ్యులు. సినిమా నిర్మాణంలో ఎన్నెన్ని కొత్తరీతులు తెచ్చుకొంటున్నారో అంతంతగా ఖర్చు పెరుగుతున్నదే కాని తగ్గడంల

'ఆలయం'

చిత్రకారుడు:- చి|| సైనన్ పి. సైనన్ (మద్రాసు క్రిస్టియన్ కాలేజీ స్కూల్ విద్యార్థి) 14–15 సం||ల బాలబాలికలు పంపినవాటిలో యీ బొమ్మకు ప్రథమ బహుమానం వచ్చింది.





సినిమా పరిశ్రమ, ప్రభుత్వ శాసనాలు

లేదు. తారల మూల్యంతో కలిసి ఖర్చు తడిసి మోపెడౌతున్నది.

లాభార్జనపైనే ఆధారపడే ఈ పరిశ్రమలో ప్రభుత్వజోక్యం అట్టే లేకుండా ఉండాలంటే, ద్రవ్యసహాయానికి ప్రభుత్వంపైన ఆధారపడకుండా నిర్మాతలు జాగ్రత్తపడ్డం అవసరం. అంటే కాలానికనుగుణంగా కొంతకాలం ఖర్చు తగ్గించుకుని ప్రజలలో ప్రచారం సాధించగల చిత్రాలను నిర్మించడం కష్టంకాదు. నిర్మాతలు పెట్టే ఖర్చు దుబారా ఖర్చు కాదని నమ్మకం కలిగించేవరకూ పన్నులభారాన్ని తగ్గించాలనే వాదానికి బలం చేకూరదు.

నిర్మాతలే ఇప్పటికి నిర్మాణ విధులు కొన్ని ఏర్పాటుచేసుకుని ఉన్నట్లయితే ప్రభుత్వం నీతులు చెప్పడానికి అంతగా అవకాశం లేకపోయేది. ఇలా ఏర్పాటు చేసుకోడం అంతకష్టం కాదు. ఇప్పుడు అవసరంకూడా. ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రభుత్వమూ నిర్మాతలూ నిర్మొహమాటంగా చర్చించుకుని ఏకాభిప్రాయానికి రావలసిన అవసరం ఉంది. సినిమాలను సెన్సార్ చేసేటప్పుడు కత్తిరించవలసిన ఆక్షేపణీయమైన ఘట్టాల్ని ముఖ్యంగా రెండురకాలుగా విభజించవచ్చు. అసభ్యము అవినీతి భావాలను స్ఫురింపచేసే రకం ఒకటి. ప్రభుత్వశాసనాల్ని అధిక్షేపించేవీ జాతీయ రాజకీయాశయాలకు విరుద్ధమైనవీ రెండోరకం.

హాలీవుడ్ చిత్రాల్లో చుంబనాలు ఆలింగనాలు శరీరావయవ ప్రదర్శనాలూ వుండగా వాటిని మన చిత్రాల్లో నిషేధించినందువల్ల ఆ చిత్రాలతో మనచిత్రాలు పోటీచెయ్యలేకుండా ఉన్నాయనికొందరి వాదం. ఈ వాదంలో పసలేదని మన చిత్రాలచరిత్రే నిరూపిస్తుంది. కాని ప్రభుత్వంమాత్రం ప్రజలనుకాని నిర్మాతలనుకాని ఒప్పించలేని స్థితిలో సమర్థించుకోడానికైనా యత్నించడంలేదు. ఈ నిషేధాలను అధిగమించడంకోసం మధ్య కత్తి అడ్డుపెట్టి చుంబనాలు చూపడం బుజాలు కొరకడం మొదలైనవి ఆరంభించారు బొంబాయి నిర్మాతలు కొందరు. నృత్యాలపేరు చెప్పి కొందరు నిక్కర్లు చాకాట్లు వేసి తారలు (చెడ్డీలూ బాడిస్‌లతో ఆడవాళ్ళని ఆడించడం కూడా జరిగింది.) మళయాళీజేళపు

(51-వ పేజీ చూడండి)

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ యస్. యం. భాషా—బద్వేల్, కర్నూలు జిల్లా.

ప్రపంచంలో సత్యానికి స్థలముందా?

—గ్రహాలు తమ గతి తప్పకుండా ఋజుమార్గంలో తిరుగుతూ ఉండడంవల్లనే "ఋతువులు" అనేవి ఏర్పడుతున్నాయి. వేదభాషలో "ఋతము" అంటే సత్యము అని అర్థం. లోకము అనేది కొన్ని స్థిరమైన ప్రకృతిధర్మములకు కట్టుబడి ఉంటున్నది. ఆ సుస్థిర శాశ్వత సత్యసూత్రములకు కట్టుబడి ఉన్నంత కాలమూ దీనిని "లోకం" అంటారు. ఈ సత్యము లేకపోతే లోకమే లేదు. అట్టి స్థితిని "అలోకం" అని పురాణాలలో నిర్వచించారు. కనుక "ప్రపంచం", లేదా "లోకం" అనేది "లోకం" అని పిలువబడుచున్నంత కాలమూ, దానిలో సత్యం విధిగా ఉన్నదనే భావం "లోకం" అనే మాటలోనే ఇమిడి ఉన్నది. అది ఎట్లన్నను?—"తల్లి" అని పిలువబడే వ్యక్తి "గొడ్రాలు" కాజాలదు. శ్రీ॥ శే॥ పొట్టి శ్రీరాములుగారుకూడా అవసాన దినములందు "ప్రపంచంలో సత్యానికి స్థలమున్నదా?" అని ప్రశ్నించియుండిరని పత్రికలలో ప్రకటింపబడెను. సత్యాన్ని శంకించడం అంటే భగవంతుణ్ని శంకించడమే—"కలడు, కలండనెడు వాడు కలడో లేడో" అనే శంక మోతు సాధకులకు ఒక దశలో కలుగుతుంది సహజంగా.

* * *

ఎం. సి. వి. రామన్—కర్నూలు.

మహాశయా! అంజలీదేవి మొన్న బొంబాయి వెళ్ళి అక్కడ శుకరంభ హిందీ చిత్రంలో పదిన్నర కాల్‌షీట్లపని మూడు దినములలో పూర్తిచేసి మద్రాసు తిరిగి వచ్చిందని ఒక పత్రికలో చదివాను. కాని పదిన్నర కాల్‌షీట్లంటే నాకేమీ అర్థం కాలేదు. సరియైన సమాధానాన్ని సెలవిస్తారా?

—'కాల్‌షీట్' అంటే కాలికీ, చేతికీ సంబంధించిందిమాత్రం కాదు. ప్రతి స్టూడియోలోను ఒకేరోజున రెండు మూడు చిత్రాలతాలూకు పని జరుగుతూవుంటుంది. రోజుకి 24 గంటలు కాబట్టి, ఎనిమిదేసి గంటల చొప్పున రోజుని మూడు భాగాలుగా చేస్తే, ఒక్కొక్క భాగాన్నీ ఒక 'కాల్‌షీట్' అంటారు. 'కాల్‌షీట్' అనేది ఒక కాగితం. ఆ కాగితంమీద ఫలాని రోజున ఫలాని కి గంటలకాలం స్టూడియోలోని ఫలాని ఫ్లోరుమీద ఫలాని కంపెనీవారి తాలూకు షూటింగ్ జరుగుతుందని వ్రాసి వుంటుంది. ఆ కాగితాన్ని బట్టి స్టూడియో సిబ్బంది, ఆ కంపెనీ తాలూకు వుద్యోగులు, 'సినిమా నక్షత్రాలు' తగిన ఏర్పాట్లు చేసుకొని సరిగ్గా ఆ సమయానికి అక్కడ హాజరు అవుతూ వుంటారు.

* * *

శ్రీ ఫీల్కానా వెంకట్రావు—విశాఖపట్టణము.

"కులము", "మతము" అను పదములు ఆంధ్రభాషలో మొదట ఎవరు ఉపయోగించారు? కారణమేమిటో సవిస్తరంగా సెలవిస్తారా?

—"కులము" "మతము" అను మాటలను మొట్టమొదటి ఆంధ్రుడు ఆంధ్రభాషలో మొట్టమొదటిసారిగా ప్రయోగించాడు. అతని పేరు తెలియదు. ఇతరుల పోటీ లేకుండా, ఒక వృత్తినీ వ్యాపారాన్నీ ప్రత్యేకంగా ఒక వర్గం జనులు వంశపారంపర్యముగా అనుసరించి జీవించడం కోసం కులం ఏర్పడింది. అందువల్ల కులమూ రక్షింపబడుతుంది. కులవృత్తియూ రక్షింపబడుతుంది. వంశపారంపర్యశిక్షణ ఆయా కులవృత్తులయందు సులభం. మేధస్సుకూడా ఆయావృత్తులయందు వృద్ధి అవుతుంది. ముక్తిపొందడానికి ఏదో ఒక మార్గం నమ్మితేనేగాని మనస్సుకు స్థిమితం లేదుగనుక ఏదో ఒకమతం అవసరమైంది, కులం అనేది భుక్తికి. మతం అనేది ముక్తికి. అవసరమైనాయి.

* * *

శ్రీ ఇవటూరి వీరేశ్వరరావు—అయితంపూడి.

"కనుమరోజున కాకికూడా కదలదు" అని అంటారు ఎందుచేత?

—'క'ప్రాస బాగా కలిసినందువల్ల.

* * *

శ్రీ పుల్యాల రఘునాథరెడ్డి—నంది కొట్కూరు, కర్నూలుజిల్లా.

నా స్నేహితుడు మనము నివసించేది *"Live to eat"* అని వాదించుచున్నాడు. కాని నేను *"Eat to live"* అని చెప్పుచున్నాను. ఇందులో మీరు ఎవరితో ఏకీభవించుతారు?

—తినడంకోసమే బ్రతుకగల తాహతు కొద్దిమందికే వుంటుంది. ఈ సూత్రాన్ని పాటించినవాళ్లకు జీర్ణకోశ వ్యాధులు మాత్రం తప్పవు. మిగిలినవారంతా బ్రతికి వుండటంకోసమే దొరికినప్పుడు యింత తింటారు. లేనప్పుడు పస్తుంటారు. ★



మాస్కో, బోల్షాయ్ థియేటర్ 175 వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఒపేరా గాయకి వార్వారా గగరీనా.

★ సినిమా వార్తలు ★

మెహతాబ్‌ను చలనచిత్రరంగంలో ఉన్నతికి తెచ్చి, కేదార్‌శర్మను ఉత్తమ దర్శకులలో ఒకనిగా నిరూపించిన కళాఖండం 'చిత్రలేఖ' తిరిగి త్రివర్ణచిత్రంగా తియ్యడానికి కృషి జరుగుతోంది. డైరక్టర్ కేదార్‌శర్మ దర్శకత్వం క్రిందనే అవే మాటలూ పాటలతో నిర్మించబడుతుందిట. ఈ చిత్రంలో ఈమారు దిలీప్‌కుమార్, మధుబాల నటించగలదని తెలుస్తోంది. చిత్రనిర్మాణం 1954 లో ప్రారంభం కావచ్చు. దీనిని హిం ఇం భాషల్లో తీస్తారు.

* * *

హిందీ తార నళినీజయంత్ కూడా స్వయంగా చిత్రనిర్మాణానికి పూనుకుంటోంది. ఈమె చిత్రనిర్మాణం రంగులతోనే ప్రారంభమౌతుందట. ప్రేమ్‌నాథ్ కూడా రంగుల్లో ఒక చిత్రాన్ని స్వయంగా నిర్మిస్తాడట.

* * *

రంగుల సినిమాలు వచ్చిన తరవాత మన దేశంలో వీటి మొదలు ఎవరు మొదలు అనే విషయంలో కొత్తపంగేలు బయలుదేరాయి. ఇదివరలో 'మదర్' అనే హిందీ చిత్రం రంగుల్లో వచ్చింది. అయితే ఆ రంగులు చేత్తో పూసిన పూర్వీకపు రంగులు. 'ఆన్' చిత్రం రంగుల్లో ప్రింట్ చెయ్యబడిందిట. 'ఝాన్సీ-కీ-రాణి' చిత్రం షూట్ చెయ్యడమే రంగుల్లో షూట్ చేశారట. కాని షూట్ చేసినవాడు మనవాడు కాదు.

ఇప్పుడు షూట్ చెయ్యడంలోనే రంగుల్లో బయలుదేరి, భారతదేశస్థుడే షూట్ చెయ్యడం మొట్టమొదట రాజ్‌కపూర్ నిర్మిస్తున్న 'అజంతా' చిత్రంలో జరుగుతుందిట. ఇందుకోసం ఆర్. కె. ఫిల్మ్స్ కెమెరామాన్ రాధు కర్మాకర్ ఇంగ్లండ్‌లో శిక్షణ పొంది వచ్చాడట. ఈ చిత్రంలో రాజ్‌కపూర్ బౌద్ధభిక్షువుగా, నర్గీస్ అజంతాసుందరిగా మనకి కనపడతారు.

* * *

భారతదేశపు పల్లెజీవనం గురించి విదేశాల వారికి తెలపడానికి డైరక్టర్ కేదార్‌శర్మ 'గునాహ్' అనే చిత్రాన్ని హిందీ, ఇంగ్లీషు భాషల్లో నిర్మిస్తున్నాడు.

* * *

దేవదాస్, జిందగీ, జవాబ్ వంటి ఉత్తమ చిత్రాలను నిర్మించిన న్యూథియేటర్స్ (కలకత్తా) వారు 'వనహంసి' అనే చిత్రంతో నూరు చిత్రాలనిర్మాణం పూర్తి చేస్తారు. మన చలనచిత్రపరిశ్రమకు న్యూథియేటర్స్ చేయవలసిన సేవ ఎంతైనా ఉన్నది. వర్ణచిత్రాలను నిర్మించిన ఖ్యాతి బొంబాయికి దక్కితే, ఆధునిక సారస్వతంలోని వాస్తవికతను చలనచిత్రాల ద్వారా నిరూపించే ఖ్యాతి కలకత్తాకి దక్కుతుందని ఆశించవచ్చు. వాస్తవికత అంటే కాశ్మీర్ ఉద్యానవనాలు, సరస్సులు, అస్సాం అడవులు షూట్ చెయ్యడం మాత్రమేనని భావించే నిర్మాతలకు కథా నిర్వహణలో వాస్తవికతను చూపించగలిగే బెంగాలీలే మార్గదర్శకులు కావాలి.

పృథ్వీరాజ్ ఆధునిక నాటక కళోద్ధరణ కృషి

జాతీయ పునర్నిర్మాణంలో నాటక కళకు కూడా ప్రధానమైన ప్రయోజన మున్నదని విశ్వసించి అట్టి నాటక కళను ఉద్ధరించడంకోసం బొంబాయిలో జాతీయ నాటకకళా మందిరాన్ని స్థాపించాలని కృషి చేస్తున్న పృథ్వీరాజ్ కపూర్ తన నాట్యమండలితో పర్యటిస్తూ వచ్చి గత వారం మద్రాసులో నారంరోజులు నాటకాలు ప్రదర్శించారు. ప్రదర్శించిన అయిదు నాటకాలకూ ఇతివృత్తాలు ఆధునికమైనవే జాతీయ సమస్యలు ప్రధానాంశాలుగా రచించబడిన ఈ నాటకాలయి దింటిలోనూ ఆశయాలను స్ఫుటంగా రసవత్తరంగా వ్యక్తపరచగలగడం ప్రధాన గుణం గంభీరమైన రంగభూమిఅలంకరణలో అవసరానికి మించనీయకుండా జాగ్రత్తపడి పరిసరాలను తగినట్లుగా స్ఫురింపచేస్తూనే కథాంశంపైన ప్రేక్షకుల దృష్టిని కేంద్రీకరింపచెయ్యగలిగారు జాతీయాశయాల ప్రబోధానికి నాటకకళ నెలా వినియోగించవచ్చునో నిరూపించగలిగాడు పృథ్వీరాజ్ కపూర్

పాత్రలతో తాదాత్మ్యస్థితిని పొందిన నటనాకౌశలంలో ఈ త్రినుసాయి వంగుతుని నాటక కళాకారులకు పృథ్వీరాజ్ మార్గదర్శకుడౌతున్నాడు.

*　　*　　*

పసిబాలుర జీవితానికి సంబంధించిన కథావస్తువులతో చాల చిత్రాలు బొంబాయిలో నిర్మిత మౌతున్నాయి రాజ్ కపూర్ 'బూట్ పాలిష్', అబ్బాస్ 'మున్నా' తీస్తున్నారు బిమల్ రాయ్, హేమేన్ గుప్తా, గోవర్ధన్ దాస్ అగర్వాల్ కూడా ఇలాటి చిత్రాలు తీస్తున్నారు.

*　　*　　*

సినిమా పరిశ్రమ ప్రభుత్వ శాసనాలు

(48-వ పేజీ తరువాయి)

యువతులంటూ మరికొందరు ఈ సినీ ఫీల్డ్ని అధిగమిస్తున్నారు ఈమాదిరి యత్నాలు జరుగుతున్నకొద్దీ ప్రభుత్వం మరింత కఠినవియమాలు విధించడానికి యత్నిస్తోంది సెన్సార్ చేసిన సినిమాల్ని సెన్సార్ చేసినట్లుంచక కత్తిరించిన ముక్కల్ని మళ్ళీ చొప్పించి సినిమాల్ని కొందరు ప్రదర్శించారు. దీనివల్ల పరిశ్రమకంతకీ అప్రతిష్ఠ వచ్చింది నియమాతిక్రమణకు ఖైదు విధించాలని ప్రభుత్వం తలపెట్టిందంటే ఇటువంటివారివల్లనే పరిశ్రమకు సంబంధించినవారందరూ ఇటువంటి అక్రమాలు జరిగేవారిని వెలివేసినట్లయితే పరిశ్రమకంతకీ ఈ అప్రతిష్ఠ సంభవించకపోయేది అందువల్ల ఇప్పుడైనా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి నిర్మాతలు స్వయంగా కొన్ని నియమాలను ఏర్పాటుచేసుకుని అందరూ దానిని పాటించేవిధంగా జాగ్రత్తపడ్డం మంచిది. ప్రభుత్వంకూడా పారిశ్రామికుల్ని అనుమానంతో చూడకుండా వారి సహకారంతో పరిశ్రమ అభివృద్ధికి దోహదం చెయ్యడం అవసరం ★



మాస్కో, బోల్షాయ్ థియేటర్ 175 వ వార్షికోత్సవంలో పాల్గొన్న బాలెట్ డాన్సర్ యూరీ జఖారోవ్.

దుర్గాబాయ్ దేశ్ ముఖ్

(11-వ పేజీ తరువాయి)

తానున్న ఇంటిచుట్టూ వున్న స్త్రీలనీ, బాలబాలికల్నీ పోగుచేసి బృందావన, గోపికల సేవా సాంఘిక వైజ్ఞానిక సంస్థ స్థాపించింది. ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం కొత్తగా వచ్చింది. పిల్లల కార్యక్రమానికీ, స్త్రీల కార్యక్రమానికీ బృందావన గోపికలే ఆధారం. దుర్గాబాయి అన్ని కార్యక్రమాలలోనూ కుటుంబంతో సహా పాలుతీసుకొని తెనుగు కార్యక్రమాలలో పేరుపొందించింది. ఆ బృందావనమే దరిమిలాని ఆంధ్రమహిళాసభగా పరిణమించింది. వివేకానందస్వామి రామకృష్ణమిషను ప్రారంభించినప్పుడు ఆయన చేతులో పావలా వున్నదట. సత్కార్యం కనక ధనసహాయం దానంతటదే వచ్చి ఆ సంస్థ అఖిలభారతసంస్థగా పరిణమించింది. సంఘసేవకి మార్గమైనది. ఆంధ్ర మహిళా సంఘం ప్రారంభించినప్పుడు దుర్గాబాయి చేతులో ఆ పావలాకూడా లేదు. సత్కార్యం గనక దీనికికూడా ధనసహాయం అల్లాగే లభించింది.

తెనుగు జమీందారిణీల సందర్శన ప్రోత్సాహం చేసి, చందాలు పోగుచేసి, ఒక మహాసంస్థ నిర్మించింది. కృష్ణా, గోదావరి జిల్లాలలో డబ్బంతా ప్లీడరు ఫీజుగా లాగి, ఆంధ్రోద్యమానికి ప్రతికూలులైన ద్రవిడ న్యాయవాదుల కోట మధ్య మైలాపూరులోనే తన నిర్మాణం చేసి పేరు నిలబెట్టింది. వందలాదిగా వనితలకి భాషావివక్షత లేకుండా విద్య నేర్పించి తన ఉదార స్వభావం నిరూపించింది. ఆ సంస్థ ఈనాడు యావదాంధ్ర మహిళా లోకానికి పట్టుగొమ్మ. వీరేశలింగం తర్వాత అన్ని సంస్థలెవరూ స్థాపన చెయ్యలేదు. విద్యాశాఖ, పారిశ్రామిక శాఖ, లలిత కళల శాఖ, ప్రచురణశాఖ, ఒక వైద్యాలయం, ఇవన్నీ ఒక్క చేతిమీద కట్టింది. అవన్నీ కేంద్ర ప్రాంతీయ ప్రభుత్వాల గ్రాంటులు పొంది ఆదర్శప్రాయమైన సాంఘిక సేవ చేస్తున్నాయి. దుర్గాబాయి తాను నాయకురాలే కాదు. నాయకురాళ్లని తయారు చేసింది. సంస్థాపకురాల్ని గదా అని వాటిని పట్టుకుని వేళ్లాడ్డంలేదు. తన జీవనోపాధి చేసుకోలేదు. అందులో తయారైన యువతులే వాటికి నిర్వాహకు లధికార్లు.

ఇటు మహిళా సంఘం నిర్వహిస్తూ మద్రాసు ఆంధ్రమహాసభ పునర్నిర్మాణం చెయ్యడంలో సాంబమూర్తి గారికి సహాయం చేసింది. ఇటువంటి నిర్మాణ కార్యక్రమంలో వున్న ఘనత గుర్తించే గాంధీ మహాత్ముడు ఆవిడ్ని కస్తూరిబా ఫండుకి తెనుగుదేశంలో పెత్తందారుగా నియోగించాడు. ఆ పని ఆక్షేపణ లేకుండా నిర్వహించి కృతార్థురాలైనది. ఆవిడకి చందాలిచ్చినవారు గాని, ఇవ్వబోయేవారు గాని విచారించే అవకాశం కలగలేదు. కలగబోదు. పరమ ప్రతికూల వాతావరణంలో కూడా ఆవిడ తన ఆంధ్రత్వం వదులుకోలేదు; వదులుకోదు.

కాకినాడలో నిలబడి నిర్వహించి ప్రాంతీయ నాయకురాలైంది. మద్రాసు చేరి రాష్ట్రీయ నాయకురాలైంది. వివిధ శాఖలలో తన నిర్మాణశక్తి చూపించింది. అందుకనే పందొమ్మిదివందల నలభైయేడులో కన్స్టిట్యూయంటు అసెంబ్లీ సభ్యత్వం ఆవిడకి అయాచితంగా లభించింది. నిజానికి ఇతర స్త్రీ సభ్యులలో ఎవరికీ ఆవిడకున్న క్వాలిఫికేషన్లు లేవు. ఢిల్లీ రావడంతోనే, రాష్ట్రీయ నాయకురాలు భారతీయ నాయకురాలుగా పైకొచ్చింది. రాజ్యాంగ విధాన నిర్మాణంలోనే కాదు. పార్లమెంటు సభలో చర్చలలోనే కాదు, ఆ సభ కధ్యక్షురాలుగానే కాదు, అనేక ఇతర విషయాలలో తన సామర్థ్యం ప్రకటించి ప్రధాన మంత్రి మన్నన లందుకుంది. సుప్రీంకోర్టు అడ్వకేటుగా అల్లాడి బహుగు సోమయ్యల వంటి సుప్రసిద్ధ న్యాయవాదులతో కలిసి పని చేసింది. ఇటువంటి సమర్థురాల్ని అంతర్జాతీయ రంగంలో పెట్టి పరీక్ష చేతామనే కుతూహలం కలిగింది ప్రధాన మంత్రికి. పారిస్‌లో యునైటెడ్ నేషన్స మహాసభకి వెళ్ళమన్నాడు. ఇంతలో ఎలక్షన్లు అడ్డుతగిలాయి. దుర్గాబాయి ఓటమి ఆ వ్యక్తికి కలిగిన అగౌరవం కాదు. అంత పురోభివృద్ధి పొందిన జీవిత యాత్రకి అంతరాయం కలిగిందా అనే విషాదసందేహ రేఖలు తోచినవి. ముఖ్యంగా ఢిల్లీ ఆంధ్రులు విచారించారు. అడుగంటిన కేంద్ర ఆంధ్ర సంస్థల్ని ఉద్ధరించి విద్యాసంఘం నిర్మించి, స్థలం సంపాదించి, పెద్ద విద్యాలయం కట్టడానికి సిద్ధంగావున్న వ్యక్తి వెళ్లిపోతుందా అనుకున్నారు. తాత్కాలికంగా ఏమీ తోచక నెహ్రూ ఆమెను చీనా యాత్రకి పంపించాడు. ఆ దేశంలో అల్పసంఖ్యాకుల సమస్యలు, న్యాయసంస్థలు పరిశీలించి చక్కని నివేదికలు తయారుచేసి ప్రధాని కందించింది. అవి కేబినెట్టులోనే చర్చించి కొనియాడినారు.

దుర్గాబాయిలో ఉన్న ప్రతిభ కార్యసాధన అన్న రహస్యం నెహ్రూ గ్రహించి అతి ముఖ్యమైన ప్లానింగు కమిషనులో సభ్యురాలుగా నియమించాడు. భార్యాభర్తల మిద్దరం ఒకే సంస్థలో సభ్యులుగా వుండడం ఎల్లాగన్నారు. మరీ మంచిది ఫరవాలే దన్నాడు. ఆంధ్రుల అదృష్టంగా రాయలసీమలో క్షామనివారణ కార్యక్రమం నెరవేర్చి వచ్చావు, ఇప్పుడు మహారాష్ట్రుల కోడలుగా అక్కడికి వెళ్ళి క్షామ నివారణ హాజమాయిషీ చేసిరమ్మని ఇరవైవేలరూపాయిల చెక్కు పంపించాడు. పంచవర్ష ప్రణాళికపని ఇప్పుడే ప్రారంభం అవాలి. అల్లాగే ఇద్దరు దేశముఖుల జీవితం కూడా ఇప్పుడే ప్రారంభం అనవచ్చు. దుర్గాబాయి కింతవరకూ సంఘసేవే గాని ఆత్మసేవ లేదు. తనలాగే జీవితం గడుపుతున్న వరుడు దొరికాడు. పూర్వకాలంలో మండన మిశ్రుడు, భారతి ఇద్దరూ కూడా మహాశాస్త్రవేత్తలని పేరు. ఈనాడు చింతామణి దుర్గాబాయి దేశముఖు లిద్దరూ, పరిపాలనాదక్షులు, దేశసేవాసక్తులు, మేధానిధులు. వారి కల్యాణం చరితార్థమైన మానసిక, వైజ్ఞానిక సంయోగం. స్వశక్తిమీద ఇద్దరూ స్వతంత్ర భారతంలో ప్రథమ శ్రేణికి వచ్చినవారు. జువ్వలలా ఒక నిశీథివేళ తారాపథం అంటినవారు కారు. బస్సుమీద తిరుపతి యాత్ర చేసినవారు కారు. జనసమ్మర్దంలో, తోసుకెళ్లి, మెట్లుమెట్లూ ఎక్కి, మోకాళ్ళ పర్వతం దాటి, ఏడు కొండలూ ఎక్కి ఆలయప్రాకారం ప్రవేశించి, భగవంతుడి సాన్నిధ్యంలో ఆత్మసాక్షాత్కారం పొందిన ధన్య దంపతులు. జీవితయాత్రే చతుర్విధ పురుషార్థ ఫల సిద్ధ్యర్థం గనక, అర్థలోపం లేని సంపూర్ణ జీవితం వారిది. అంతర్జాతీయ వ్యక్తులైన ఈ కొత్త దంపతుల్ని, లోకమే ఏక కంఠంతో ఆశీర్వదించింది.

★ కాలక్షేపం ★

నవాడు అనుభవించడం అరుదు. దావా ఖర్చుకోసం పెట్టుబడి పెట్టిన షాహుకారుకు అది దఖలు పడుతుంది. ఈవిధంగా తిన బ్రతుకు తెరువుకోసం పరాయివాడొకడు గ్రామంలో చేరి, గ్రామంలో ఉన్న పార్టీల మధ్య పంజరంలోని చిలుకలాగున ప్రాణాలు అరచేతిలో బిగబట్టుకొని కాలక్షేపం చేస్తూ, ఉభయ పార్టీలవారు వ్యాజ్యాలకై కోర్టు కెక్కినప్పుడు ఆ సందు చూచుకొని, వారికి అప్పుపెట్టి హెచ్చు వడ్డీకి వారి ఆస్తులను తాకట్టు వ్రాయించుకొని, అసలుకు మించి వడ్డీ పెరిగినప్పుడు, తనవడ్డీ వ్యాపారానికి ఆధారం కల్పించిన ఆసాములనే కబళించిన సాహుకారుల కడుపు నిండుతుంది.

ఈవడ్డీవ్యాపారం మన గ్రామాలను యీ రోజున కబళించుచున్న విధంగానే, యీస్టుయిండియా కంపెనీవారి 'రాజ్యాక్రమణ యీ దేశంలో సాగింది. నైజాముయొక్క రక్షణకోసం నైజామువద్ద వెలెస్లీ ప్రభువు (వెనుకటి గవర్నరుజనరలు) కొంత బ్రిటిష్ సేనను ఉంచాడు. ఆ సేనలకు అయ్యే ఖర్చుకు కొంత సొమ్మును నైజాము చెల్లించవలెనన్నాడు, ఆ బాకీ మొత్తం అంతకంతకు పెరిగి పెద్దదైంది. ఈ బాకీ మొత్తం రద్దుకోసం నేడు రాయలసీమ అనబడే దత్తమండలములను యీస్టుయిండియా కంపెనీవారికి నైజాము యిచ్చివేశాడు.

ఇంతకన్నా విధి వైపరీత్యం మన దేశచరిత్రలో ఇంకొకటి లేదు.

మహారాష్ట్రులతో మహమ్మదీయనవాబులకు యుద్ధములు వస్తే ఆ మహారాష్ట్రులను కూడా కబళించారు కంపెనీవారు. శివాజీ "కొండ ఎలుక" అయితే, దానిని మింగగల్గినది "కొండ చిలువ" కావాలి.

భారతదేశం యీ రోజువరకు రత్నగర్భ అనే గౌరవ నామధేయంతోనే ఉంది. కాని, యీ రత్నపేటికకు చేయబడిన కన్నములు కన్పిస్తున్నాయి.

మన అజ్ఞానాంధకారసమయంలో కన్నము చేసిన ముష్కరమూషికమూ కన్పించదు. దానిని మింగినపామూ కన్పించదు.

ఈ భారతదేశచరిత్ర యీ విధంగా ఎందుకు జరిగిందంటే ఎవ్వడూ జవాబు చెప్పలేడు. ఇదంతా విధి వైపరీత్యం. ఇదంతా భగవంతుని సంకల్పము. మనసంకల్పము కొనసాగినట్లయితే భారతదేశము రెండుభాగములుగా చీలిపోకూడదు. గాంధిమహాత్ముడు కూడా భారతదేశం చీలిపోకూడదన్నాడు. తన ప్రాణాన్ని యిస్తాను పాకిస్తాను ఏర్పడకుండా అన్నాడు. కాని, యీశ్వరసంకల్పమే యీడేరింది. మానవసంకల్పం కాదు. ఈశ్వరసంకల్పం ఏమిటో ఎందుకో ఎవరికీ అర్థంకాదు! "ఈశ్వరసంకల్పమెవ్వారెరుంగుదురు? ఏరీతి ఎట్లుండునో!!" పాకిస్తానులో అమెరికావారు (మధ్యప్రాచ్యదేశాల రక్షణకోసం) సైనికస్థావరములను ఏర్పరుచుకొంటున్నారు. బ్రిటిష్‌వారు కూడా అమెరికాతో కలిసి తమ విదేశ వ్యవహార తంత్రం సాగిస్తున్నారు. ఈ పాకిస్తానులో వీరందరూ డేరాలువేసే ప్రయత్నంలో ఉంటే, మన కాశ్మీరు వివాదవ్యవహారం పాకిస్తానుకు యిండియాకు మధ్య యిప్పట్లో తేలదు.

కమ్యూనిస్టు చైనా ప్రభుత్వమునకు చెందిన సింకియాంగు పరగణాలో "పీస్-గ్రాడ్" (శాంతి నగరం) నిర్మించారు. అక్కడకు రష్యనులు వచ్చి ఆటంబాంబుల ఫ్యాక్టరీ నిర్మించారు. ఇది మన భారత దేశంలో చేరిన కాశ్మీరుకు ఉత్తరపరిహద్దు వద్దనే ఉన్నది. చిన్నది కాదు యీ విషయం - అమెరికావారు అంటే అధిక భోగులు. పాము పడగనే "భోగం" అంటారు. భోగం కలవాడే "భోగి" - కోట్లకు పడగలెత్తిన అమెరికన్ సాహుకారీ సామ్రాజ్య "భోగి" పాకిస్తానులో కొన్ని పుట్టలు తనకు ఉనికిపట్టులుగా చేసికొదలంచినాడు. కాశ్మీరుకు ఉత్తరంగా రష్యను ఆటంబాంబుల గుట్ట - దక్షిణంగా అమెరికన్ పెట్టుబడిదారీ పుట్ట. "ఉద్ధతుల మధ్య పేదల కుండ దరమె?" - ఇక భారత దేశ భవిష్యత్తు భారతీ భర్తయైన బ్రహ్మకే తెలియాలి. పండిత నెహ్రూకే తెలియాలి. ఇక అమెరికన్ డాలర్లు పాకిస్తానుకు పెప్పరమెంటు బిళ్ళలవలె లభిస్తాయి. కనుక, అమెరికా జేబులో పాకిస్తాన్ ప్రవేశం, నివాసం, నిశ్చయం. అమెరికన్ జెండానిండా నక్షత్రాలున్నాయి. ఇక మీదట అమెరికన్ తారాబలమే పాకిస్తాన్ తారాబలం. కాని భారతదేశపు ఉత్తరగతి ఏమిటి?

భారతదేశం అనే రత్నగర్భ పేటికను విడిచిపోయిన సామ్రాజ్యవాద వర్గం యింకా యీచుట్టుప్రక్కల బుసకొట్టుతూనే ఉంది. ఈ సర్పమును యిక్కడ పాకిస్తాన్ అంటున్నది పాకిస్తాన్.

పండితనెహ్రూ పాముమంత్రం తెలిసిన పండితుడు కావచ్చు. కాని, మన మంత్రం వారి తంత్రంముందర ఎంతవరకు పని చేస్తుందో చూడాలి. ఏమైనప్పటికీ, భగవన్నిర్ణయానుసారమే భవిష్యత్తు నడుస్తుంది. ప్రయత్నమాత్రమే మనవంతు. "ఏ తరి హాని వృద్ధులకు నొక్కటి దైవము కారణంబగున్" మంచికైనను చెడుకైనను దైవమొక్కటే ముఖ్య కారణం. ★

★ గోడమీద బొమ్మ ★

(9-వ పేజీ తరువాయి)

యింట్లో వుంటే మీ దేం చెల్లిపోయేది? నోరు విడచి ఎందు కడిగానో నువ్వైనా ఆ మాత్రం ఆలోచించలేకపోయావూ?" కోపంతో రామం లేచిపోయాడు.

మంచంకు రెండో ప్రక్క నిల్చొని అన్నాడు. "కొడుకు ఇంటికి రాలేదని ఆ తల్లి బెంగపెట్టుకుని నోటిలో మంచినీర యినా పొయ్యలేదు. ఆవిడను చూసేవంటే నీకే యేడుపొస్తుంది. స్వతహాగా ఆలోచించడం యెప్పుడు నేర్చుకుంటావ్?" రామం కోపం యీ చివర మాటలతో అంతమయ్యింది. తలవాల్చి యెదురుగా నిల్చున్న భార్యను చూడగానే యెక్కడలేని కరుణ ఆవరించింది. రెండు,రోజుల క్రితం వుదయం యిలానే నిల్చుని భార్య సంతోషాతిశయంతో, "ఎంత మంచివారు! ఎంత శాంతం!" అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చినయ్. వెంటనే ఇప్పటి పరిస్థితిని తలచుకొని సిగ్గుపడ్డాడు. మనసులో మూలగనియ్యకండా యీ మాటలు ఒక్కసారి చెప్పటంవల్ల హృదయభారం తగ్గింది. రామం నెమ్మదిగా జానకిదగ్గరకు జరిగినా ఏమీ మాట్లాడలేకపోయాడు కొంత సాహసించి తల నిమిరి, నెమ్మదిగా ముఖమును పైకెత్తాడు. ఆమె చప్పున రెండు చేతులతో ముఖము కప్పుకుని, వెక్కి వెక్కి యేడుస్తూ, ఆ ఏడుపును ఆపుకోటానికి ప్రయత్నిస్తోంది.

రామం అలా నిల్చునే మెల్లగా నవ్వుకున్నాడు.

6

భర్త వచ్చే సమయానికి సీతాలు వీధి గుమ్మంకు అడ్డంగా నిల్చుంది కిష్టయ్య వస్తూనే భార్యమాటలు విన్నాడు. లోపలకు చొచ్చుకపోతూ "వీ-వీధిలోనికి వచ్చి లే-లేదని అరవకే" అన్నాడు.

"నా కెందుకమ్మా యీ సంసారం! మీరే చేసుకోండి. లేదని చెప్తే ఇలా కోపమైతే నే నెక్కడి నించితేను." ముందుకు పోతున్న కిష్టయ్య వెనుకకు తిరిగి చెయ్యి వూపుతూ. "పె-పెద్ద వాళ్ళే వ-వస్తుంటున్నారు ఒక్క పూటకు త-తరిగిపోమ్మా, చచ్చిపోము"కొంచెం స్వరం సౌహార్దంగా మార్చి" అ-అడుగు మ-మడుగు ఆ పిల్లల కేదో చూద్దూ?"

"ఇదెక్కడి మాటమ్మా! ఉండి లేదన్నదా యీ సీతాలు! మీరిచ్చినఅణా తక్కువ 75 రూపాయిలు యిరవయ్యేడో తారీఖు వరకూ యింటి అద్దెకు 15, చాకలాడికి 6, పాలవాడికి 7, మీకు రెండూ మిగతావన్నీ పోతే మిగిలింది నేను."

"గో-గోడ బెందుకే-ఆ సి-సినీమాలకెళ్లటంమ-మానె స్తానులే"

"అలా యిదివరకెన్నిసార్లు అనలేదూ, ఏమన్నా నే చెడ్డదాన్ని - ఆ రూపాయి బేడావుంటే యీ వాళ రేపూ రొట్లు కాల్చుకు తినేవాళ్ళమా? నా కెందుకీ సంసారం మీరే చెయ్యండీ తెలిసొస్తుంది."

కిష్టయ్య రభసలోనికి దిగక శాంతంగా, "ఏదో యీ వేళకి చూ-చూద్దూ!"

"ఇంట్లో పిడికెడు పిండివుంటే మీరు వేసినంత వొట్టు."

"ఎక్కడైనా అప్పు-"

"ఈ పొరుగమ్మ లేదండి. ఆ పొరుగమ్మను ప్రాణం వుండగా అడుగుతానూ?"

"కలిగిన వాళ్ళన్నావు — అ-అడుగే! పి-పిల్లల్ని యిలా మాడ్చకే"

"ఎంత చెప్పాలండీ మీకు. ఇదంతా నా కర్మ"తల మొత్తుకుంటూ సీతాలు లోనికి వెళ్లిపోతూంటే కిష్టయ్య గుమ్మం దాటాడు"

విధిలేక నరసమ్మ యింటికి వెళ్ళాడు. ముసలాయన కూర్చొన్నా "ఒకసారి చూసిపోదామని"వచ్చానండీ. అని క్రిందకు దిగాడు. నరసమ్మ వాకిట కూర్చుంది. దగ్గరగా వెళ్ళాడు. ఇంతలో పార్వతి వచ్చింది. కొంతసేపు యీ మాటా ఆ మాటా ఆడాడు గానీ నోరు విప్పి అడగలేకపోయాడు. నరసమ్మవద్ద సెలవుతీసికుని బయట పడ్డాక కర్తవ్యమేమిటని ఆలోచించాడు. పొరుగున వెంకట్రావు జ్ఞప్తికి వచ్చి విధిలేక కాలుకదిపాడు. ఇక్కడ అక్కడా యేమీ తోచక తిరిగి వచ్చేసరికి యెనిమిదైంది. పిల్లలంతా అప్పుడే పడక వేసుకుంటున్నారు. కిష్టయ్య వస్తూనే చిరాకు కోపంతో "మా - వాడు మా-వా డంటావ్. ఇంటిలో బ-బస్తాడు బియ్యం వుంచుకొని..."

"ఎవరండీ" అంది సీతాలు.

"మ-మరెవరు? ఆ వెంకట్రావు."

"ఆయ నెందు కడిగారూ? మీరు నరసమ్మ గారింటకి కదూ వెళ్ళిం దిప్పుడు?"

"ఎలా అడిగనే ఆయమ్మని చూ-చూస్తే అడగడానికి నో-నోరు వచ్చింది కాదు."

"ముఖం దించి అడగలేకపోయారా అంత సిగ్గయితే."

"సి-సిగ్గు కాదే! పాపం – ఆవిడ మనిషిలా లేదు."

"ఆవిడ యిస్తే యీ మూడు రోజులూ గడచిపోతుందనుకొన్నా."

కిష్టయ్య బట్టలు మార్చేవరకూ పిల్లలు చుట్టిముట్టినా మాటాడలేదు. సీతాలు వాళ్ళని పడుకోమని కసురుతోంది. మల్లిగాడిని బలవంతంమీద చాపమీద వేసి మొత్తుతుంటే కిష్టయ్య వాకిటకు పోయి మంచంమీద కూర్చున్నాడు.

ఆలోచనతో నీరసించి మంచంమీద చేరబడి ఆకాశంవేపు చూస్తున్నాడు. పిల్లలు ఆకలితోనే యీ రాత్రి గడిపినా తెల్లవారేసరికైనా మంచినీరు తప్పించి యింకేమి యీయగలడు? యెవరిదగ్గరకు వెళ్ళి ముష్టి యెత్తటం? ఇక ససేమిరా సినీమాలు చూడకూడదని అనుకున్నాడు. ఈ ఆలోచనకు హద్దంటూ లేకపోయింది. పిల్లలందర్ని నిద్రపుచ్చి సీతాలు దగ్గరగా వచ్చింది. కిష్టయ్య ఆమె వచ్చినా కదల్లేదు మెదల్లేదు. సీతాలు మెల్లగా "లేవండి" అంది. అదికూడ వినిపించుకోనట్టే మెసలాడు.

"లేవండి, ఆ రొట్టిముక్క తిని కాస్త మంచినీరు త్రాగండి." కిష్టయ్య లేచి కూర్చుని భార్యవేపు నిదానించి చూశాడు. ఆ చిన్న ఫాలభాగం, కొంచెం పొడుగు ముక్కుతో ఆ పొట్టి స్త్రీ యెంతో అందంగా కనిపించిం దతనికి. మెల్లగా చెయ్యి పట్టుకుని,

"నిజంగా నే!" అన్నాడు.

"సంసారులం కామా? సమయానికని ఒక మూల దాచిన పిండి తీశాను. పిల్లలంతా తిని పడుకున్నారు. మళ్ళీ లేస్తే మిమ్మల్ని తిననివ్వరు. లేవండి."

కిష్టయ్య లేచాడు. భార్య ముందు నడుస్తూంటే ఆ కొండి జడవైపు చూస్తూనే వెంటపడ్డాడు. ఖానంగా వేసిన రెండు రొట్టెలలో ఒకటి తిని గ్లాసుడు మంచినీరు త్రాగి లేచిపోయి మళ్ళీ వచ్చి మంచంమీద కూర్చున్నాడు. భార్య ఆ ఒక్క రొట్టితిని యింటిపనులు చూసు

కొని వచ్చేసరికి భర్త నిద్రపోతున్నట్లు గమనించింది.

తెల్లవారేక కొళాయి దగ్గర నుంచి బిందెతో నీరు తెస్తుంటే పొరుగావిడ మంచీ చెడ్డా ప్రస్తావిస్తూ "రాత్రి యేం కూర చేశా"వంది. సీతాలు "తోటకూరకుండా వంకాయ ముద్ద కూర, కొబ్బరికాయ పచ్చడి" అని చెప్తుంటే ఈ వేళ యెవరిన్ని నాలుగురూపాయిలు అప్పు అడిగేదా అని ఆలోచిస్తున్న కిష్టయ్య చెవిలో పడింది.

ఆ వేళ ఆదివారం కావటంచేత ఆఫీసుకు వెళ్ళినా వేగంగా వచ్చాడు. సాయంత్రం భద్రందగ్గరకు వెళ్ళి వచ్చేసరికి సీతాలు తల మొత్తుకుంటూ "ఇదంతా నా కర్మ" అంటోంది. కిష్టయ్య పౌరుషమంతా కొల్పుకుని నాలుగురూపాయిలు అడిగితే రెండు రూపాయి లిచ్చిన భద్రం గురించి చెప్పాలని యింటికొస్తే భార్య యిలా తల మొత్తుకోవటంతో ఆగి, "ఎ-ఎందుకే ఇదంతా!" అన్నాడు. ఇంతకీ చివరకు తేలిన కారణమేమిటంటే కూతురు మాసిన బట్టలతో వెళ్ళిపోతుంటే పొరుగుకుర్రవాడు డాబామీద నుంచి చూశాడు. కూతురు అందం చందం లేనిదా? బట్టలు లేకపోవడంవల్ల కదా సిగ్గుతో చచ్చిపోవలసి వస్తోంది?

కిష్టయ్య పెళ్ళాం దుఃఖం తీరేవరకూ ఆగాలనుకున్నాడు. అది యెంతకీ తీరని దుఃఖమని కలుగజేసుకొని ఆమె చేతిలో రెండురూపాయిలూ పెట్టాడు.

అవి తీసికుంటూనే "ఎందుకొచ్చిన బ్రతుకు ఎందుకొచ్చిన వుద్యోగం? ఒక యింటిదాన్నిగా చెయ్యలేకపోయాం మా తల్లిని." లోన గదిలో విసుక్కుంటూ వచారుచేస్తున్న కూతురు వేపు చూడకుండానే సీతాలు యింకా మాటలు సాగించింది.

"చూడండి! నా మాటలు వినండీ, ఎన్నిసార్లని చెప్పను!" కిష్టయ్య తీక్షణంగా, "నీకేం మ-మతిగాని పోయిందే, మనిషివా, మా-మానువా ఒక్కసారి చెప్పితే వి-వినుకోవాలి."

"మానునే లెండి అందుకోసమే యీ లేమి సంసారం నా నెత్తిన వేశారు. మన కర్మంకాలినప్పుడు ముష్టయినా యెత్తుకోవాలి"

"ధర్మంచే - చేసేస్తాడు. నా-నాటిక తెగాలికొని నే నడగను"

సీతాలు కొంత దగ్గరగా జరిగి, "నామాట వినండి ఆయన చాల మంచి మనిషి-పోనీ యీ కష్టాలయినా చెప్తురూ, కనికరంపుట్టి యేమైనా యిస్తారు."

"డ-డబ్బింటె దానం చేసేస్తారే! దా-దానం చేస్తే యి-యింతగడించకపోను."

సీతాలు మరీ దగ్గరకు జరిగింది. ఆమెకున్న శాంతమంతో కూడగట్టుకుని ప్రతిమాలుతూ, "అంతా మీకు తెలుసు యేం చెప్తాను. ఈ వుద్యోగం చేస్తూ యీ పిల్లలని పైకి తేస్తారన్నది కల్లో మాట. కష్టమెరిగిన ఆ బాబుతో మన కష్టాలు చెప్పుకుంటే కనికరం పుట్టదా? ఇంతకంటె మంచి సమయం మరి దొరకదు."

"అడగలేనే."

"పోనీ మీరు డబ్బిమ్మని అడగకండి. వెళ్ళగానే మంచీ చెడ్డా అడుగుతారుగా. అప్పుడు చెప్పండి అమ్మాయికి సంబంధాలు వస్తున్నాయి కాని శక్తిలేక పూరుకోవలసి వస్తోందని."

కిష్టయ్య లేచాడు. బలవంతంమీద రంగయ్యగారింటికి కాలు కదిపాడు. సీతాలు మనసులో వేయి దేవుళ్ళకు మ్రొక్కుకుంది.

రంగయ్యగారు కిష్టయ్యను చూడగానే "రా నాయనా! కూర్చోవోయ్" అంటూ కుర్చీ చూపించారు. కూర్చున్న తర్వాత "అంతా సవ్యంగా పోతోందా?" అన్నారు. ఏదో అనాలని అనలేక "ఆఁ ఆఁ" అంటూ నాన్చేశాడు.

కిటికీగుండా ప్రసరించిన క్రుంగిపోతున్న దినకరుని కాంతిలో కిష్టయ్య బట్టబుర్ర మెరసిపోతోంది. ముసలాయన మళ్లీ అడిగారు — "అమ్మాయికి యేమైనా సంబంధాలు వస్తున్నయా?" కిష్టయ్య చప్పున "లేదుబాబూ" అన్నా వెంటనే భార్య చెప్పింది జ్ఞాపకం రావటంచేత తడబడి తప్పును దిద్దుకోవాలనుకున్నా దిద్దుకోలేకపోయాడు.

"ఏమిటో రోజులే మీ బాగులేవు నాయనా! ఆడపిల్లగలవాళ్ళు మారోజుల్లో యింత ఆరాటం పడిపోవటం యెరగం. ఈ రోజుల్లో అంతా డబ్బులో వుంది."

"అంతేబాబూ"

"ముఖానికి తగ్గ పట్టెవర్ధనాలు పెట్టుకుందామన్నా వీలులేని రోజులైపోయాయి."

కిష్టయ్య సాహసించి అన్నాడు. "వీ-వీదో ఒక యింట ప-పడేద్దామంటే-లే-లేనివాళ్ళకు - ఆ-అకట్నాల తెగులే బాబూ!" ముసలాయన చుట్టవెలిగించారు. కొంతసేపయ్యాక—

"ఆపిల్లతాతగారు కొంచెం కలిగినవారు కదా! సహాయం చేస్తారనుకుంటాను." ఈ ప్రశ్నకు కిష్టయ్య సంకోచించినా లేదని నిజం చెప్పాడు.

"ఆయన లాయన పోయాక అన్నదమ్ములు విడిపోయారని విన్నాను. నిజమేనా?". అవునన్నట్లు కిష్టయ్య తల వూపాడు. రంగయ్యగారు మళ్లీ అన్నారు. "ఆఫీసులో పైన కాని పరకదొరుకుతుందా? లేక జీతం రాళ్ళేనా?"

"డి-డిస్ప్రెచింగు గుమాస్తాకి యె-యెవరిస్తారు? చీకటి పడేవరకు పనే. ఆ జీతం రాళ్లు త-తప్పించి ఒక్క దమ్మిడీ బయట దొ-దొరకదు."

రంగయ్యగారు యీ రెండు సంవత్సరాల పరిచయంలో అడగని ప్రశ్నలు అడగటం, ఒక విధంగా భార్య అనుకున్నది నిజమౌతుందేమో నన్న ఆశ మనసులో వూగులాడకపోలేదు. ఇంతలో వెంకట్రావు రావటం, ముసలాయన ఆయనను కూర్చోపెట్టి, లైట్ వేసి ప్రదక్షిణ చేసి ప్రణామం చెయ్యటం, "రామయతండ్రీ" అంటూ కూర్చోడం జరిగింది.

కిష్టయ్యమాత్రం భార్య అన్నమాటలు నెమరు వేసుకొనటంవల్ల వెనక్కు పోతున్నాడు, "ఎంత లోభంగా వె-వళ్ళేమున్నా యేం చాలుతుంది బాబూ? నెలకు నాలుగు రోజులు పస్తుంటే యింక అమ్మాయికి పె-పెళ్ళేమి చేస్తాను?"

వెంకట్రావు మధ్యను వెటకారంగా, "అందరు పిల్లల పెండ్లికి కావాలిరా?" అన్నాడు. కిష్టయ్యకు మనస్సు మీద కోపం వచ్చింది. "రంగయ్యగార్ని మధ్యను పెట్టి, అది అ-అనవలసినమాటేనా బాబు? నీ-నీకు ఒక్కడున్నాడనా అ-అందరికీ అలా వుండాలంటావు?"

"అది కాదురా! ఇలా వాళ్ళకీ కష్టములూ తెచ్చి యెందుకు బదులు ఒక్కడిన్ని కనుకుంటే మంచిదిగా?"

"నా-నాకు దేవుడిచ్చాడు. వ-వద్దనటానికి ని-నివ్వెవడివి?"

★ గోడమీద బొమ్మ ★

పౌరుషం మరింత రెచ్చించటానికి తగ్గట్టుగా, "పెద్దనాయకులే అంటున్నారోయ్. వాళ్ళు తప్పేమివుంది? ఈ కుచేల సంతానాన్ని నిర్వీర్యకని, అప్రయోజకుల్ని చేసి ప్రభుత్వం నెత్తిన పడేస్తున్నావుగా కూడూ గుడ్డకీ!"

కిష్టయ్య వుద్రేకంతో కుర్చీమీదనుంచి సగం లేచి అన్నాడు "కాకాకి పిల్ల కాకికి ముద్దు మధ్య నీ-నీకెందుకు—ని-నిన్న అప్పుకుపస్తే శే-శేరుబియ్యం యిచ్చావు కాదు."

"మేమే బ్లాక్ మార్కెట్ లో కొంటూంటే"

"దొంగచాటున ట్రంకు పెట్టిల్లో మీ-మీవూరునుంచి బియ్యం తెచ్చి మూ-మూడుపూటలా మెక్కుతున్నావే."

"అప్పు అడిగినవంటనే యివ్వలేదని యేమైనా అంటావుత"

"తి-తిని లేదంటే మహాపాపం. మీ-పొలాల్నించి తెచ్చుకో లేదూ?"

"ఆ పొలాలు నావంటే చెప్పతో కొడ్తారు."

"అంతాయమకం. ఆ-ముసలాడు తర్వాత యే-యేవరివా యిరసై యేక రాలు?"

"నేనేం గడించాను? అందులో కాని ముట్టటానికి నాకేం హక్కుంది. అదంతా గడించినవాళ్లది. నేనే అప్పులతో వుంటే."

"అప్పులు" వెక్కిరించాడు కిష్టయ్య. "అప్పులు యెందుకొచ్చావు? నా-నాలుగు వేలకి యిన్నూరెన్నూ—వ-వడ్డీలకు అప్పు లిస్తుంటే." వెంకట్రావు నవ్వి, "చూడండీ! ఎంత నింద నెత్తిన వేస్తున్నాడో!, అంటాడు లెండి, ఏనాయేదైనా కూల్ గా తీసుకోవటం నాకలవాటే. మీకు తెలియదు కామోసు, వాడూ నేనూ యెలమంచిలిలో ఫోర్తు ఫారం కలిసి చదువుకున్నాం - ఏంరా అంతేనా?"

కిష్టయ్య కోపావ్రేకంలో మాట్లాడలేకపోయాడు. ముసలాయన యింతవరకూ చూస్తూ, నవ్వుకుంటూనే చివరకు, వుద్రేకొన్ని చేతులు నులుపుకుంటూ అణచుకుంటున్న కిష్టయ్య వైపు చూచి, "నిజం! కిష్టయ్య సంగతి విచారించతగ్గదే" అన్నారు. వెంకట్రావు లేచిపోతూ "నాసంగతీ అంతేనండీ" అన్నాడు.

రంగయ్యగారు నవ్వేరుకాని, మరేం వ్యాఖ్యానం చెయ్యలేదు. "కిష్టయ్యా! నీతో ఒక విషయం మాట్లాడాలి. ఇలా వస్తావురా!" అన్నాడు వెంకట్రావు. ముసలాయనవద్ద సెలవు తీసికుని కిష్టయ్య వెంకట్రావు ననుసరించాడు. (ఇంకావుంది)

దొంగ....దొంగ....దొంగ

(40-వ పేజీ తరువాయి)

నాకేదో భయంగా వుంది; ఇక్కడ ఇంకెవరూ లేరు" అని లేచివచ్చి గోపీ దగ్గర కూర్చుంది, తల నిమురుతూ, వాళ్ళమ్మ.

పెళ్లిలో అందరూ పని కట్టుకొని గోపీ దగ్గరకు వచ్చి చూసిపోతూన్నారు. కొందరు ముద్దు పెట్టుకున్నారు. గోపీ వాళ్లమ్మ "వాడొక్కడు నిద్ర పోకుండా మేల్కొని, దొంగను చూసి అరిచాడు. లేకపోతే రెండు మూడు వేలు విలువచేసే నగలూ చీరలూ" అంటూ అందరి ఎదుటా గోపీని తెగ పొగడ నారంభించింది. గోపీ ఆనందానికి మేరయే లేదు. జ్వరం తగ్గి ఇప్పుడు హుషారుగావున్నాడు. నిన్న ఊళ్లో ఆదొంగను కొట్టటానికి మునుపు ఎంత ఉత్సాహంగా వున్నాడో అంతకంటే ఎక్కువ ఉత్సాహంగా ఉన్నాడు యిప్పుడు. కాదూ మరి; అంత ఆపెళ్లి సందట్లోనూ ప్రతి ఒక్కరూ గోపీని గురించే మాట్లాడుతున్నారాయెను! వాడి వంకే చూస్తున్నారు.

ఆ వేళ సాయంత్రం గోపీ క్రొత్త వదిన, పెళ్లి పందిరిలో తిరుగుతూన్న గోపీని చాటుగా పిలిచి "'దొంగా-దొంగా' అని అరిచావుటగా" అంది-గోపీ బుగ్గలు మెల్లగా నిమురుతూ. ఆమాత్రానికే ఎగిరి అక్కడే మూడు పల్టీలు కొట్టుదామా అనిపించింది గోపీకి. అసలే సంతోషంతో వాడు వుక్కిరి బిక్కిరి అవుతూ వుంటే వాడి నోట్లో ఒక్క లడ్డు దూర్చి వెళ్లిపోయింది వాడి కొత్త వొదిన.

"రక్షించావురా నాతండ్రీ. మా మానం నిలబెట్టావు" అంటూ ఒక చిన్న రిస్టువాచ్ ని గోపీకి ప్రెజెంట్ చేశారు వాళ్లనాన్న.

"నాన్నా! ఆదొంగను ఎన్ని నెలలు జైల్లో వేస్తారు" అంటూ ఎంతో కుతూహలంగా అడిగాడు గోపీ.

"బాగా మూడునాలు గేళ్లు శిక్ష పడవచ్చు... కాకపోయినా ఆరితేరిన ఘటంలావున్నాడు. ఇదివరకే నాలు గయిదు సార్లు జైలుకు వెళ్లివచ్చిన వాడేనట" అన్నారు గోపీ తండ్రి..

గోపీకి పిడుగుపడినట్లుంది మొన్న మధ్యాహ్నం తన ఊళ్లో తను కొట్టిన ఆదొంగకు కూడా మూడు నాలుగేళ్ల శిక్ష వేస్తారు. ఈలోగా తను బాగా ఎదిగి పెద్దవాడై మారిపోతాడు. అప్పుడు ఆదొంగ తననెలా పోల్చుకో గలడూ! అథవా పోల్చుకొన్నా, తాను అప్పటికే పెద్దవాడౌతాడుగా. ఇంక వాడు ఎలా కొట్టాడు? ఇలా వూహించుకొంటూ చంకలుకొట్టుకొని గంతులువేశాడు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt Mdr a



పంచతంత్రం
మిత్రలాభం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
"మనసు దొంగిలించు మర్మ మెచట నేర్చినావు సఖా!"
"ఎవరికేది ప్రాప్తముందో అదే లభ్యమౌనుగాదె!"
ఇది విని శశికళ నిశ్చేష్టయై పోయి - పిచ్చివాడని గ్రహించి వెంటనే - చెలికత్తియతో చెప్పి అతనిని కోట బయటకు తోలి వేసినది
వర్తక పుత్రుడు ధైర్యము విడక - అటు నిటు తిరిగి పాడుపడిన ఒక - దేవాలయమున పడుకొన్నాడు
అంతకుముందే ఒక భటుడెవడో - వ్యభిచారిణి కోసమొచ్చి అచట - మూడో కంటికి తెలియకూడదని - దాక్కొని నిరీక్షిస్తున్నాడు
"బాటసారి వలె వున్నావే - ఈ గుడిలో దేనికి, చలిలో పాపం - శుభ్రముగా మా యింటికి పోయి - హాయిగ పడుకో పొమ్మన్నాడు
నిదుర కళ్ళతో లేచిన యువకుడు భటుని గృహానికి పోయి, అతని కూతురు పక్కలో పడుకొన్నాడు ఆమె కూడ తన ప్రియుని కోసమై కాచుకు వుంటుం చేతను, పాపం ఇతడే అతడని భ్రమించి సుఖముగ కాలం గడిపెను రాత్రంతా!
"మాటలాడవేమి సఖా! మూగనోము పట్టేతివా?"
"ఎవరికేది ప్రాప్తముందో అదే లభ్యమౌనుగాదె!"
'అయ్యో, అయ్యో, పొరపాటైనది' అనుకొని యాతని తరిమి వేసినది
అప్పుడా యువకుడు నగర వీధులలో - ఒంటరిగా పడిపోతున్నాడు - పెళ్ళివారెవరో తరలి రావటము - చూసి వారిలో కలిశాడు - పెళ్ళికూతురూ, పెళ్ళికుమారుడు - పల్లకి నెక్కి వస్తున్నారు
ఇంతలోనే ఎక్కడి నుంచో పిచ్చెత్తిన ఒక మదపుటేనుగా పెళ్ళివారిపై కొచ్చింది
అంతా చెల్లాచెదరై పోగా పెళ్ళికూతురూ మిగిలింది
వర్తక పుత్రుడు ధైర్యం చేసి - మదపుటేనుగకు అడ్డం పోయి - నానా బూతులు తిట్టాడు - అదేమి చిత్రమో ఎవరికీ లొంగని - ఏనుగు యాతని తిట్టుకు జడిసి - వెనక్కు చల్లగ మళ్ళింది
"ఎవరో ఈయన మహానుభావుడు, - నన్నీరోజున రక్షించాడు. - ప్రాణం, మానం, హృదయం, సర్వం - ఈయనకే నే సమర్పిస్తాను - ఈయనయే మరి ఇక నా భర్త!"
పిచ్చివాడొకడు మాటలతోనే - ఏనుగు పిచ్చిని పోగొట్టాడని - కర్ణాకర్ణిగ విన్నారంతా - ఈ విచిత్రమును చూడాలంటూ - రాజుగారు అటకొచ్చారు
రాజుగారు: "ఏమయ్యా, ఎవరు నీవు? ఎచటి నుండి వచ్చినావు?"
"ఎవరికేది ప్రాప్తముందో అదే లభ్యమౌనుగాదె!"
ఇది వినగానే అక్కడనే గల - రాజకుమారి, భటుని పుత్రికా - తమ పొరపాటుకు చింతిస్తూ - కిందటి రాత్రి జరిగినదంతా - తమ తండ్రులతో చెప్పేశారు - జరిగినదేదో జరిగినదనుకొని - రాజూ భటుడూ తమ కూతుళ్ళను - వర్తక పుత్రుని కిచ్చి వివాహము వైభవముగ జరిపించారు - ముగ్గురు కన్నెల వివాహమాడి - వర్తక పుత్రుడు అర్ధరాజ్యమును - పరిపాలిస్తూ గడిపాడు
హిరణ్యకుడు.
"ఈ కథ తలుచుకు నా వ్యధనంతా - మరచిపోవుటకు యత్నించాను - పోయిన ఆస్తికి దణ్ణం పెట్టి - దూరపు వనమునకేగి ఒంటరిగ - నివసించుట మొదలెట్టాను"
12

ఆంధ్రపత్రిక

శ్రీ విజయ నామ సంవత్సర

పంచాంగం

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రిసిద్ధాంతిగారిచే గుణించబడిన

ఈ సంవత్సరం పంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం
రెండుపద్ధతుల తిథి, నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

క్రొత్తపంచాంగాలు సిద్ధముగా నున్నవి.

44 పుటలు	వెల ప్రతి **1**-కి	**0-3-0**
„	„ **100 1**-కి	**16-8-0**

పంచాంగములు మా ఏజంట్లవద్ద దొరుకును.

రైలు ఖర్చులతో సహా పంపబడును.

వివరాలకు వ్రాయండి:

మేనేజరు:—

ఆంధ్రపత్రిక; మద్రాసు-1.